చదువులు - కొత్తదారులు

సంకలనం, సంపాదకత్వం:

అరవింద గుప్తా











చదువులు - కొత్తదారులు

సంకలనం, సంపాదకత్వం

అరవింద గుప్తా

విజ్ఞాన ప్రచురణలు

మంచి పుస్తకం

చదువులు - కొత్తదారులు
విడివిడిగా ప్రచురించిన అయిదు పుస్తకాల సమాహారం
హిందీలో సంకలనం, సంపాదకత్వం: **అరవింద గుప్తా**

CHADUVULU - KOTTA DARULU
Combined Volume of Five Books
Compilation & Hindi Editing by Arvind Gupta

First Editions of Independent Books : 2002 onwards
First Combined Edition : April 2025
Copies : 1000
Price : **Rs. 80/-**

ISBN : 978-93-90131-90-7

Publisher, For Copies :
Manchi Pustakam
12-13-439, Street No.1,
Tarnaka, Secunderabad - 500 017
Phone : 9490746614
email : info@manchipustakam.in
website : www.manchipustakam.in

VIGNANA PRACHURANALU
Praja Science Vedika
G. Malyadri, 162, Vijayalakshminagar,
Nellore - 524004.
Ph : 9440503061

Printed at :
Deccan Press,
1-9-1126/B, Azamabad, Hyderabad - 20, Ph : 90599 50055

చదువుల ప్రయోగాలు



అరవింద గుప్తా

హిందీ మూలం : **ఆంఖోంకి చమక్**

(పూల్‌ఝుడీ నుండి వ్యాసాల సంకలనం)

అనువాదం : **లావణ్య**

1.	కంటి మెరుపులు	(మరియా మాంటిస్సోరి, 1870-1952)	5
2.	కథల మాంత్రికుడు	(గిజుభాయి బగేకా, 1885-1939)	6
3.	సమ్మర్ హిల్	(ఎ.ఎస్. నీల్, 1833-1973)	7
4.	సరికొత్త ప్రయోగం	(సిల్వియా ఏష్టన్ వార్నర్, 1908-1984)	9
5.	లక్ష్మీ ఆశ్రమం	(మీరా బెహన్, 1892-1982)	10
6.	అసాధారణ బడి	(రూథ్ రస్తోగి, 1945?-)	12
7.	గోర్కీ కాలనీ	(ఆంతోన్ మకరెంకో, 1888-1939)	13
8.	అమూల్యమైన బడి	(జూలియా వెబర్, 1912-1997)	14
9.	మిస్టర్ డాక్టర్	(యానుస్ కోర్చాక్, 1878/79-1942)	17
10.	పనికి రాని వస్తువుతో ఉపయోగాలు	(బుద్ధుడు, ఉ.శ.పూ. 6, 5 శతాబ్దాలు)	18
11.	ఉదయాచల్ పాఠశాల	(శ్రీమతి వకీల్ కూవెర్‌బాయి జె., --)	20
12.	రైలు బడి	(సొసాకు కొబయాషీ, 1894-1963)	22
13.	అసలైన శిక్షణ	(యం.కె. గాంధీ, 1869-1948)	27
14.	ఎలుకల కథ - పిల్లలకి వ్యథ	(రాబర్ట్ రోజన్‌థాల్, 1933-2024)	25

కంటి మెరుపులు

మరియా మాంటిసోరీ ప్రపంచంలో పేరు పొందిన విద్యావేత్త. పిల్లలు ఆడుకోడానికి ఆమె “ఉత్తరాల డబ్బా” అన్న ఆటని తయారు చేశారు. ఉత్తరాల డబ్బా అంటే ఒక మూసి ఉన్న డబ్బాకి అన్ని వైపులా రకరకాల ఆకారాలతో కిటికీలు ఉంటాయి. కొన్ని కిటికీలు త్రికోణం ఆకారంలో, కొన్ని గుండ్రంగా, కొన్ని చతురస్రాకారంలో ఉంటాయి. పిల్లలు గుండ్రటి ఆకారం గల బొమ్మను గుండ్రటి కిటికీలో “పోస్టు” చేయాలి!!

ఒక రోజు ఒక మత గురువు బడికి వచ్చారు. ఆయన బడిని చూపిస్తూ పిల్లలు ఆడుకునే మూలకి తీసుకుని వచ్చారు మాంటిసోరీ. అక్కడ ఒక నాలుగు సంవత్సరాల పాప “పోస్ట్ డబ్బా”తో ఆడుకుంటోంది. పిల్లలు గోలగోలగా అరుస్తూ పాటలు పాడుతున్నారు. అయినా ఆ పాప తన ఆటలో మునిగిపోయి ఉంది. మాంటిసోరీ ఆ పిల్లని లేపి బల్లమీద కూర్చో పెట్టినా, తన ఆట మానలేదు. మత గురువు బిస్కెట్ల డబ్బా తీసుకుని వచ్చాడు. అవి పిల్లలకి పంచుతూ, ఈ పాపకి కూడా ఇచ్చాడు. బిస్కెట్‌ని తీసుకోవాలా, వద్దా అని తటపటాయిస్తూనే పాప తీసుకుంది. దీర్ఘచతురస్రాకారం గల ఆ బిస్కెట్‌ని చూడగానే పాప కళ్లలో మెరుపులు మెరిశాయి. చటుక్కున దాన్ని దీర్ఘచతురస్రాకారం కిటికీలో వేసేసింది.

ఆశ పెట్టో, లంచం ఇచ్చో పిల్లలు చదువుకోరు. ప్రపంచానికే కొత్త కాబట్టి, ప్రపంచాన్నే అర్థం చేసుకోవాలని చూస్తుంటారు. అందరి పిల్లల్లోనూ ఈ నాలుగు సంవత్సరాల పాప కళ్లల్లోని మెరుపులు ఉంటాయి. కానీ, కొంతకాలానికే ఈ మెరుపు మాయమైపోతోంది.

✪

కథల మాంత్రికుడు

లక్ష్మీశంకర్ మాష్టారుకి ఎంతో కంగారుగా ఉంది. పిల్లలు రోజంతా అరిచి గోల చేస్తూ, ఆయన మాట అస్సలు వినడంలేదు. "శాంతి" ఆటలో కూడా పిల్లలు కుక్క, పిల్లుల అరుపులతో అల్లరి చేస్తున్నారు. 'నేను ఏం చెయ్యాలి? ఈ పిల్లలను నావైపుకి ఎలా తిప్పుకోవాలి? వీళ్లని కథలతో ఆకట్టుకోవాలి,' అనుకుని కథ చెప్పడం మొదలు పెట్టారు మాష్టారు. మూడు గంటలు చిటికెలో గడిచిపోయాయి. మొహం విప్పార్చుకుని, చెవులు రిక్కించి మరీ పిల్లలు వింటున్నారు. బడి గంట కూడా కొట్టారు. అయినా పిల్లలకు ఇంటికి వెళదామన్న ధ్యాస కూడా రాలేదు. వాళ్లకి కథలు వినడం చాలా హుషారుగా ఉంది. మరో పది రోజుల వరకు కథల తోనే కాలం గడిపేశారు లక్ష్మీశంకర్. పిల్లలు మంత్రముగ్ధులై వింటూ మాష్టారి చుట్టూ గుండ్రంగా కూర్చునేవారు. ఎవరూ పిచ్చి అరుపులు అరవలేదు. గోల చేయలేదు.

పదకొండవ రోజు కూడా కథలు చెప్పమని మాష్టారిని అడిగారు పిల్లలు. "నిజం చెప్పాలంటే నా దగ్గర ఉన్న కథల సంపదని అంతా మీరు ముందే దోచుకున్నారు. ఆలోచిస్తే మన తరగతిలో నలభైమంది పిల్లలు ఉన్నారు. అందరి దగ్గరా ఒకటే పుస్తకాలు ఉండటం ఎంత విచారకరం!! అందుకని ఈసారి ఈ పుస్తకాలని ఎవరూ కొనవద్దు. పుస్తకాలకి అయ్యే డబ్బును అందరూ నాకు ఇచ్చెయ్యండి. ఆ డబ్బులతో ప్రతీ ఒక్కరికీ మూడు రకాల కథల పుస్తకాలు తీసుకుని వస్తాను. అప్పుడు అందరం ఎన్నో కథలు విని ఆనందించవచ్చు," అని శంకర్ మాష్టారు అన్నారు. ఈ విధంగా క్లాసులోనే చిన్న గ్రంథాలయం

మొదలు పెట్టారు. బడి పుస్తకాలు మూడింటికి బదులు పిల్లలందరికీ వంద కంటే ఎక్కువ కథలు చదివే అవకాశం దొరికింది.

(గిజుభాయి బగేకా 'పగటి కల' పుస్తకం ఆధారంగా)

✪

సమ్మర్ హిల్

1921లో ఇంగ్లాండులో సమ్మర్ హిల్ అనే ఒక బడిని ఎ.ఎస్.నీల్ తెరిచారు. ప్రపంచంలో స్వేచ్ఛని ఇచ్చిన మొదటి బడి ఇదే. ఇక్కడ పిల్లలకి ఏ నియమాలూ, క్రమశిక్షణా ఉండవు. సమ్మర్ హిల్‌లో బడికి వేసుకునే బట్టలు, ప్రార్థన, బడిగంట, హాజరీ, పాఠ్య ప్రణాళిక, ఇంటిపని, పరీక్షలు ఏమీ ఉండవు. పిల్లలకి ఇక్కడ ఎంతో స్వేచ్ఛ. వాళ్లకి ఇష్టమైతే తరగతికి వెళ్లవచ్చు లేదా గోల చేయవచ్చు. బొమ్మలు చేయవచ్చు లేదా సీతాకోక చిలుకల వెంట పరిగెత్తి పట్టుకోవచ్చు. వర్క్‌షాపులో పనులు నేర్చుకోవచ్చు. నిజంగా సమ్మర్ హిల్ ఆనందాల పాఠశాల.



ఇక్కడికి ఎక్కువగా పెంకి లేదా అల్లరి పిల్లలు వస్తుంటారు. ఒక రోజు ఎనిమిది సంవత్సరాల పిల్లవాడు ఈ బడికి వచ్చాడు. పిల్లవాడి అల్లరి భరించలేక వాడిని అంతకుముందు బడి నుంచి పంపించేశారు. అందుకని ఈ పిల్లవాడికి ఏ బడికీ వెళ్లాలని లేదు. వాళ్ల నాన్న బలవంతంగా ఈ పిల్లవాడిని ఇక్కడ చేర్చడంతో వాడు చాలా కోపంగా ఉన్నాడు. ఆ కోపంలో, ఒక రాయి తీసుకుని కిటికీ అద్దాన్ని పగలగొట్టాడు. అక్కడికి దగ్గరలోనే నీల్ కూడా ఉన్నాడు. అయినా ఈ పిల్లవాడిని ఏమీ అనలేదు. ఈ పిల్లవాడు అలా కిటికీల అద్దాలను పగలగొడుతూనే ఉన్నాడు. పదకొండో అద్దం పగలగొట్టిన తరవాత ఆ పిల్లవాడికి అలుపు వచ్చింది. నీల్ అప్పుడు ఒక రాయిని తీసుకుని పన్నెండవ కిటికీ అద్దాన్ని తానే పగలగొట్టాడు. ఆ విధంగా ఉపదేశం ఇవ్వకుండానే నీల్ ఆ బాలుడి మనసు దోచుకున్నాడు. "మంచి గురువువి కావాలంటే, పిల్లలకి ఉపదేశాలు, నీతులు చెప్పవద్దు. ఎప్పుడూ పిల్లల పక్షమే ఉండండి. వాళ్లకి కావాల్సిన ప్రేమని ఇవ్వండి," అని నీల్ అంటాడు.

✪

సరికొత్త ప్రయోగం

సిల్వియా ఏష్టన్ వార్నర్ ఇరవై నాలుగు సంవత్సరాలు న్యూజిలాండ్‌లో "మావరీ" జాతి పిల్లలకి చదువు చెప్పింది. విద్యాబోధనలో ఆమె అనుభవాలను "టీచర్" అనే పుస్తకంగా ఆవిడ రాశారు. పిల్లల మొదటి మాటలు ఎంతో అమూల్యమైనవి. ఈ ఆత్మీయమైన "మొదటి మాటల్లో" పిల్లల బతుకు భారం లేదా వారి పల్లెల పరిమళాలు నిండి ఉంటాయి.

"ఈ రోజు మీకు ఏ మాటలు కావాలి?" అని వస్తూనే సిల్వియా పిల్లలను అడుగుతుంది. పిల్లలు వెంటనే "దెయ్యం", "పాము" లేదా "బల్లి" వంటి భయంకరమైన మాటలు చెబుతారు. పిల్లలు ఎప్పుడూ వీటి భయం నీడలో బతుకుతుంటారు. ఇవి వాళ్లు స్వయంగా చెప్పిన మాటలు కాబట్టి సిల్వియా ఈ మాటలు రాస్తుండగా చూడటం వల్ల, పిల్లలు వాటిని ఎప్పటికీ మరచిపోలేరు. ఆ మరుసటి రోజు, పిల్లలను "దెయ్యం" కథలని చెప్పమని సిల్వియా అంటుంది. పిల్లల్లో కల్పనాశక్తి రెక్కలు చాచి, వాళ్ల మనసుల్లోంచి కథలు ఉరికి వస్తాయి. ఈ కథలని పిల్లల మాటల్లోనే రాసి పెడుతుంది సిల్వియా. పిల్లల మాటల్లో,



పిల్లల కోసం రాసిన కథలు కాబట్టి వాటిని పిల్లలు నిమిషాల్లో చదివేస్తుంటారు. ఈ కథలకి అందమైన బొమ్మలని వేస్తారు. ఈ విధంగా ఆరు నెలల్లో పిల్లలు డెబ్బై సచిత్ర కథలు రాశారు. పిల్లల కలలు, అనుభవాలకి ఈ కథలు ప్రతిరూపాలు.

ఈ సిల్వియా పద్ధతినే బ్రెజిల్ దేశంలో పౌలో ఫ్రేరీ అనే విద్యావేత్త వయోజన విద్య కోసం ఉపయోగించి మంచి ఫలితాలు సాధించాడు. ఈ పద్ధతి వల్ల చదువు రాని వాళ్లు ఎంతో తొందరగా చదవడం, రాయడం నేర్చుకున్నారు. పిల్లల అంతరంగం విజ్ఞానంతో మండే "జ్వాలాముఖి" లాంటిదని, దాన్ని ప్రేమతో నింపడమే ఆలస్యం వారిలోని సృజనాత్మకత ఉబికి వస్తుందని సిల్వియా భావించే వారు. అందుకనే పిల్లల అనుభవాలను చదువులో ఒక భాగం చేశారు.

✪

లక్ష్మీ ఆశ్రమం

అల్మోరాకి కొద్ది దూరంలో కౌసానీ అనే ఒక చిన్న అందమైన పర్వత ప్రాంతం ఉంది. మంచుతో కప్పిన హిమాలయ పర్వత శ్రేణులు ఇక్కడి నుంచి కనబడతాయి. గాంధీజీ ప్రేరణతో 1946లో మీరా బెహన్ ఇక్కడ లక్ష్మీ ఆశ్రమాన్ని స్థాపించారు. మీరా బెహన్ జర్మనీలో పుట్టినా, ఆమె తల్లిదండ్రులు ఇంగ్లాండులో జీవించేవారు.

ఈ లక్ష్మీ ఆశ్రమంలో గఢ్‌వాల్ చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన వివిధ వయస్సుల బాలికలు ఉంటారు. ఇక్కడ చదువుకంటే జీవనోపాధికి కావాల్సిన మెలకువలు నేర్చుకోడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. బాలికలు పొద్దున్నే అయిదు గంటలకు లేచి కట్టెలు తీసుకువచ్చి, నీళ్లు నింపుతారు. కొంత మంది పశువుల ఆలనా పాలనా చూస్తారు. మరి కొంతమంది కూరగాయలు తరుగుతారు. కొంత మంది చెట్ల నుండి పళ్లను కోస్తారు. గాంధీజీ బోధించిన శ్రమైక జీవనం ఇక్కడ ఇంకా సజీవంగా కనిపిస్తుంటుంది. ఆశ్రమం ఆర్థికంగా తన కాళ్లమీద తాను నిలబడాలనే ప్రయత్నం ఇక్కడ జరుగుతోంది. తరవాత కొంత మంది పిల్లలు చరఖా తిప్పడంలోనో, బట్టలు నేయడంలోనో నిమగ్నమై



ఉంటారు. మరి కొంతమంది బాలికలు పొయ్యి అంటించి మధ్యాహ్న భోజనానికి వంట వండుతారు. భోజనాల తరవాత గిన్నెలు, వంటిల్లు కడిగి సర్దిన తరవాత రెండు గంటలు మాత్రం చదువు చెబుతారు. అయిదు గంటల తరవాత మళ్లీ రాత్రి భోజనానికి కావాల్సిన ఏర్పాట్లు జరుగుతాయి.

చుట్టుపక్కల గ్రామాల్లో బాలికలు తమ ఇళ్లల్లో చేసే అన్ని పనులనూ ఈ ఆశ్రమంలో బాలికలు చేస్తారు. వీటితోపాటు సమాజం, పర్యావరణం గురించి ఎన్నో విషయాలు నేర్చుకుంటారు. మెగసేసే అవార్డు గ్రహీత రాధా భట్ ఈ ఆశ్రమ నిర్వాహకురాలు. గఢ్‌వాల్ అడవుల పరిరక్షణ కోసం చేపట్టిన చిప్కో ఆందోళనలో చురుకుగా పాల్గొన్న విమలా బహుగుణ, మరికొందరు మహిళా కార్యకర్తలు ఈ లక్ష్మీ ఆశ్రమం నుంచే వచ్చారు.

✪

అసాధారణ బడి

భీమ్‌తాల్‌లో టెలివిజన్లు తయారు చేసే ఒక కంపెనీ ఉంది. దాంట్లో ఒక గోదాములోనే నాన్‌తిన్‌బాడి ఉంది - అదే చిన్నపిల్లల ఇల్లు, స్వర్గం. చుట్టు పక్కల నివసించే చిన్నపిల్లలే ఎక్కువగా ఈ ప్రాథమిక బడికి వస్తుంటారు. పది సంవత్సరాల కిందట రూథ్ రస్తోగీ ఈ బడిని మొదలుపెట్టారు.

పిల్లలకి ఈ బడికి రావడమంటే ఎంతో ఉత్సాహం, బడి మొదలు పెట్టడానికి చాలా ముందుగానే వచ్చేస్తారు. పాఠశాల బయట వాడేసిన టైర్లతో తయారు చేసిన ఒక అద్భుత ప్రపంచం వాళ్ల కోసం ఎదురు చూస్తుంటుంది. ఇందులో ఉయ్యాలలు, జారుడు బండలు, తూగుడు బల్లలు, టైర్లతో చేసిన సొరంగం లాంటి ఎన్నో వింతలు ఉన్నాయి. గంటల కొద్దీ పిల్లలు ఇక్కడ ఆడుతూనే ఉంటారు.

ఈ బడిని చాలా చక్కగా రూపొందించారు. పిల్లలకి పనికి వచ్చే అన్ని వస్తువులనూ ఎంతో ఆలోచించి పెట్టారు. పిల్లలు తమకి కావాల్సిన వస్తువులని తామే తీసుకుని, వాడుకున్న తరవాత మళ్లీ తిరిగి ఇచ్చేస్తారు.

బడిలో పదవ తరగతిలో ఇద్దరు, ముగ్గురు అబ్బాయిలు ఉన్నారు. వాళ్లు తమ చదువుకంటే ఎక్కువగా, పిల్లలకి ఎంతో సహాయం చేస్తుంటారు. ఒక మూలగా, పిల్లల ఎత్తులో, పిల్లలకి కావాల్సిన బొమ్మల పుస్తకాలు సర్ది ఉంటాయి. పిల్లలు తమకి ఇష్టమైన పుస్తకాన్ని తీసుకుని వచ్చి అక్కకి ఇస్తారు.

అక్క ఈ పుస్తకాన్ని చదివి వినిపిస్తుంటుంది.

ఇలా రోజంతా పిల్లలు తమకి ఇష్టమైన పనుల్లో మునిగిపోయి ఉంటారు. కొంతమంది కాగితపు పక్షులు చేస్తుంటారు, మరి కొంత మంది మట్టికుండలు చేస్తుంటారు. కొంత మంది లూడో గానీ వైకుంఠపాళీ గానీ ఆడుతుంటారు. ఆటపాటల తోనో, దినచర్యలో భాగంగానో పిల్లలు భాషను, విజ్ఞానం పునాదులను అర్థం చేసుకుంటారు. సాధారణమైన పిల్లలకి తక్కువ ఖర్చుతో చదువు చెప్పే దీనిని ఒక అసాధారణమైన బడి అనాలేమో!!

✪

గోర్కీ కాలనీ

రష్యా విప్లవంలో వేల మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. వేల మంది పిల్లలు ఇళ్లు లేక రోడ్డున పడ్డారు. వారి ఆలనా పాలనా చూసే వాళ్లు లేక, అమ్మా-నాన్నల తోడులేక ఈ పిల్లలు చెడుదారిని పట్టారు. చిన్నచిన్న పిల్లలు కూడా జేబులు కత్తిరించడంలోనూ, కత్తితో బెదిరించి డబ్బులు దోచుకోడం లోనూ ఆరితేరారు. మరి కొంత చురుకైన వాళ్లు లూటీలు, దొంగతనాలు చేయసాగారు. హింస పెరిగిపోవడంతో రష్యా ప్రభుత్వం ఆదేశంతో ఆంతోన్ మకరెంకో అనే విద్యావేత్త "గోర్కీ కాలనీ" అనే బడిని పిల్లల కోసం మొదలు పెట్టారు. ఇందులో మొదట చేరిన పిల్లలు రకరకాల జైళ్ల నుంచి వచ్చారు.



పద్నాలుగేళ్ల బాలుడు చాలాసార్లు జైలు జీవితాన్ని చవిచూసి మొండివాడయ్యాడు. వీడిని చూసి జైలు అధికారులు కూడా భయపడేవారు. ఈ

బాలుడిని తీసుకుని వెళ్లడానికి మకరెంకో వెళ్లగానే ఆ జైలు అధికారులు, "అమ్మయ్య! పీడ విరగడయ్యింది," అని ఊపిరి పీల్చుకున్నారు. ఆ బాలుడి భుజాలు తట్టి, చేతిలో 200 రూబుళ్లు, తీసుకుని రావాల్సిన సామానుల పట్టీ ఇచ్చి, "గుర్రబ్బండీ తీసుకుని వెళ్లి, ఈ కాయితంలో రాసిన సామాన్లు కొని, గోర్కి కాలనీకి తీసుకుని వచ్చెయ్యి. మిగిలిన విషయాలు అక్కడే మాట్లాడు కుందాం," అన్నాడు మకరెంకో.

ఆశ్చర్యపోయిన ఆ బాలుడు మకరెంకోని అపనమ్మకంగా చూడసాగాడు. అందరూ అతన్ని దొంగ, రౌడీ అని ఎన్నో తిట్లు తిట్టేవారు. కానీ, ఈ మకరెంకో అతని మీద పూర్తి నమ్మకంతో గుర్రబ్బండీ, ఇంత డబ్బులు అతనికే ఇచ్చాడు. గుర్రపు బండి తీసుకుని ఆ బాలుడు వెంటనే వెళ్లాడు. కానీ, మనసులో ఏదో భయం : 'ఒకవేళ, ఎవరన్నా దొంగ దారిలో ఈ డబ్బులు దోచుకుంటే మకరెంకోకి నేను మొహం ఎలా చూపించగలను?' అందుకే, చిటికెలో సామాన్లు కొన్నాడు. కాలనీకి వచ్చేసరికి భయంతో, చెమటతో అతను తడిచి ముద్దయ్యాడు.

పరిస్థితుల ప్రభావంతో పిల్లలు దొంగలుగా మారవచ్చు. కానీ, సరియైన పరిసరాలతో పిల్లలు మారతారని, సోవియట్ యూనియన్ గర్వపడే మంచి నాగరీకులని చేయవచ్చునని మకరెంకో నమ్మాడు. గోర్కి కాలనీ అతని కలలను నిజం చేసింది.

✪

అమూల్యమైన బడి

అమెరికాలో ఒక మారుమూల పల్లెటూరి బడిలో జూలియా వెబర్ గోర్డాన్ చదువు చెప్పేవారు. దెబ్బై సంవత్సరాల కిందట ఆ బడి పరిస్థితి అధ్వాన్నంగా ఉండేది. బడిలో ఒకే ఒక గది ఉండేది. స్కూలు నడవడానికి కావాల్సిన నిధులు ఉండేవి కావు. ఆడుకోడానికి, చదువుకోడానికి కావాల్సిన



వస్తువులు ఎక్కువగా పిల్లలే స్వయంగా చేసుకునే వాళ్లు, లేదా ఎక్కడి నుంచైనా అప్పుగా తెచ్చే వారు. ఈ నిధులు కొరత, బడి పరిస్థితులని చూసి వెబర్ ఎన్నడూ కంగారు పడలేదు. ఒకటవ తరగతి నుంచి ఎనిమిదవ తరగతి వరకు ఉన్న ఈ బడిలో వెబర్ ఏకైక ఉపాధ్యాయిని. చదువులోనే కాక మానసికంగా కూడా వెనకబడిన పిల్లలు కొంతమంది ఉన్నారు. వెబర్ ప్రతి ఒక్కరినీ ప్రత్యేకంగా, శ్రద్ధగా చూసేది. అందుకనే పిల్లలందరూ శ్రద్ధగా చదివి ప్రగతి సాధించేవారు.

ఈ చిన్న పాఠశాలకు అవసరమైన శిక్షణ సామాగ్రి, అనుభవం గల ఉపాధ్యాయులు, కావాల్సిన ఆర్థిక సహాయం ఇచ్చే స్థితిలో ప్రభుత్వం లేదు. పెద్దపెద్ద కర్మాగారాల లాగా ఖరీదైన భవంతులతో అన్ని పాఠశాలలనూ నిర్మిస్తారు. కానీ ఈ చిన్న బడిలో చదివిన అనుభవం ప్రత్యేకమైనది. ఈ బడిలోని పేద విద్యార్థులు ఒకే ఒక నెలలో ఈ బడి వాతావరణాన్నే మార్చివేశారు. చుట్టు పక్కల చవకగా లభించే వస్తువులతోనూ, వాడి పారేసిన వస్తువుల తోనూ వైజ్ఞానిక పరిశోధనలు చేశారు. చాలా ఉపకరణాలను దగ్గరలోనే ఉన్న ఉన్నత పాఠశాల నుంచి అడిగి తెచ్చుకున్నారు. ఏదైనా వస్తువు అవసరమైనప్పుడు ఏదైనా సంస్థ నుంచి కానీ వ్యక్తుల దగ్గర కానీ అప్పు తెచ్చుకునే వాళ్లు. గ్రామంలోనే ఉన్న వడ్రంగి సహాయంతో ఒక చెక్క ఇల్లు, ఎన్నో ఆట వస్తువులను తయారు చేశారు. వెబర్ ఇచ్చిన ప్రేరణతో దగ్గరలోనే ఉన్న జిల్లా గ్రంథాలయం నుంచి ఒక సంవత్సరంలో ఏడు వందల పుస్తకాలు తెచ్చుకుని చదివారు. అంటే ప్రతి విద్యార్థీ సుమారుగా 20కి పైగా పుస్తకాలని చదివారన్న



మాట. చాలా పెద్ద-పెద్ద విలాస వంతమైన గ్రంథాలయాల్లో ఎన్నో పుస్తకాలు అల్మారాల్లో బందీ అయ్యి నిట్టూరుస్తూ ఉంటాయి. చదువు కోసం మనం ఎప్పుడూ నిధులు చాలడం లేదని గొణుగుతూనే ఉంటాం. విద్యకి సరిపడా నిధులు లేవన్న ఏడుపు మనం ఎప్పుడూ ఏడుస్తూనే ఉంటాం. కానీ, నిజానికి కొరత నిధులలో కాదు, మన దృక్పథంలో ఉంది. అర్థంలేని వ్యవస్థ కోసమో, పనికిరాని పాఠ్య పుస్తకాల కోసమో డబ్బులని ధారపోస్తాం. సమాజంలో బడి ఒక భాగం అయినపుడు మాత్రమే పిల్లలు శ్రద్ధగా నేర్చుకుంటారు. అప్పుడే బయటి సమాజాన్ని వాళ్ల చదువు తాకి, ప్రభావితం చేస్తుంటుంది.

ఒక మంచి టీచర్ అవ్వాలంటే ఎన్నో కళల్లో ప్రవేశం ఉండాలి. వెబర్ విశిష్టత ఏమిటంటే ఆమెకి ఎన్నో నైపుణ్యాలు ఉన్నాయి.

ఆమె హార్మోనియం వాయిస్తుండేది, జానపద నృత్యం చేస్తుండేది, పాటలు పాడేది, గాలిపటాలను చేస్తుండేది, కళ్లతో ఆటలు ఆడేది, కాగితంతో విమానాలు చేసేది, చిత్రలేఖనం చేసేది, కథలు వినిపిస్తుండేది. అంతేకాదు, ఆమె దాదాపు అన్ని చెట్లు, పక్షులు, రాళ్లను గుర్తు పట్టగలిగేది. వీటన్నటితో పాటు ఆమెకి రాని విద్యలను పిల్లలే స్వయంగా నేర్చుకునేటట్లుగా ప్రోత్సహించేది. పిల్లలతో కలిసిపోయి, వాళ్లతోపాటు వస్తువులను తయారు చేసేది. తప్పులు చేసినప్పుడు పిల్లల నుంచి నేర్చుకునేది.

చాలా మంది టీచర్లకి శబ్దాల ప్రయోగం మాత్రమే తెలుసు. వాళ్లు కేవలం చదివించ గలరు. దీనికి మించి వారి దగ్గర ఏ కళలూ ఉండవు. బడిలో నాలుగు గోడల మధ్య విసిగి పోకుండా పిల్లలని దగ్గరలోనే ఉన్న అడవిలోకి పిక్‌నిక్‌కి తీసుకుని వెళ్లేది. చెరువు గట్టుమీద ఆడుకోడమంటే పిల్లలకి ఎంతో మజా. చాలాసార్లు వారి చదువు బడి బయటే జరుగుతూ ఉంటుంది. వాళ్ల బడిలో బోధనా సామాగ్రి లేదు,

అయినా వాళ్ల ప్రశ్నలకి జవాబులు పిల్లలు ఏదో విధంగా వెతికి మరీ పట్టుకుంటారు. వెబర్ చెప్పే చదువు ఎవరో రూపొందించిన పాఠ్య ప్రణాళికలకి లోబడి ఉండదు. పిల్లల అభిరుచులకి, జిజ్ఞాసకి సరిపోయే పాఠ్య ప్రణాళికను ఆమె తయారు చేస్తుంది. ఈ విధంగా ప్రతీ సంవత్సరం అవే పాఠాలను చెప్పే విసుగు, బంధనాల నుంచీ ఆమె తప్పించుకోగలిగింది.

జులియా వెబర్ గోర్డాన్, 'మై కౌంటీ స్కూల్ డైరీ' ఆధారంగా.

✪

మిస్టర్ డాక్టర్

పోలాండ్ దేశంలో ఒక బీద యూదు పరివారంలో యానుస్ కోర్టాక్ (Janusz Korczak) పుట్టాడు. ఆ ఇంట్లో తినడానికి తిండి దొరకడం కూడా కష్టంగా ఉండేది. కఠోర పరిశ్రమ, దీక్షతో చదివి కోర్టాక్ డాక్టరు అయ్యారు. అయినా తన చిన్నప్పటి, పేదరికాన్ని కోర్టాక్ మరవలేదు. అందుకనే పేద పిల్లల కోసం ఒక అనాథ ఆశ్రమాన్ని తెరిచారు. సుమారుగా వందమంది అనాథ పిల్లలు ఇక్కడ ఉండేవారు. పిల్లల రోగాలని నయంచేసే నిపుణుడిగా డాక్టర్ కోర్టాక్‌కి ఎంతో పేరు ఉంది. అందుకనే, పిల్లలందరూ కోర్టాక్‌ని ఎంతో ప్రేమగా మిస్టర్ డాక్టర్ అని పిలిచేవారు. మిస్టర్ డాక్టర్ కూడా పిల్లలను ఎంతో ప్రేమించేవారు. పిల్లలకి తండ్రి, గురువు, స్నేహితుడు - అన్నీ తానై ఉండేవాడు. "ఒక సీతాకోక చిలుక ఆత్మకథ", "నేను ఎప్పుడు చిన్న పిల్లవాడిని అవుతాను?" లాంటి ఎన్నో పుస్తకాలను కోచార్క్ రాశారు.

రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో లక్షలమంది యూదులని గ్యాస్ బట్టీలలోకి హిట్లర్ పంపించాడు. ఒక రోజు హిట్లర్ కిరాతకమైన పోలీసులు అనాథాలయానికి వచ్చి బెదిరించారు. పిల్లలందరినీ ఒక వరసలో గ్యాస్ బట్టీలలోకి వెళ్లమని ఆదేశించారు. కోర్టాక్‌ని అడ్డు తప్పుకోమని పోలీసులు చెప్పారు. అయినా, పిల్లలకి తోడుగా, వరసలో ముందు నిలుచున్నారు మిస్టర్ డాక్టర్. మిస్టర్ డాక్టర్‌తో పాటు పాటలు పాడుతూ పిల్లలు ముందుకి వెళ్లారు. పిల్లల మనసులో



చనిపోతామన్న భయం లేనే లేదు. వాళ్లకి ప్రియమైన డాక్టరు తోడు ఉన్నాడన్న తృప్తి ఉంది. గ్యాస్ భట్టీ రాగానే కొర్జాక్ అందరికన్నా ముందు వెళ్లారు. పిల్లలు ఆయన వెనకనే వెళ్లారు. కొర్జాక్ లాంటి గొప్ప గురువు అంతిమ క్షణంలో కూడా తన పిల్లలను వదల లేదు. ఆఖరి శ్వాస వరకు పిల్లల కన్నీళ్లను తుడుస్తూ డాక్టర్ వాళ్లకి తోడుగా ఉన్నాడు. "ప్రపంచంలో అనాదిగా అన్నిటినీ కోల్పోయిన వాళ్లు పిల్లలే," అన్న కొర్జాక్ మాటలు ఇప్పటికీ మన చెవుల్లో వినిపిస్తూనే ఉంటుంది.

✪

పనికి రాని వస్తువుతో ఉపయోగాలు

మనం వస్తువులను వాడిన తరవాత పారేస్తుంటాం. వినియోగ సంస్కృతి అంతా "ఎక్కువగా కొను, ఎక్కువగా పారేయి" అనే సిద్ధాంతం మీద ఆధారపడి

ఉంది. ఈ పారేసే సంస్కృతి వల్ల ఒక వైపు చెత్తకుప్పలు పెరుగుతుండగా మరో వైపు భూమిమీద సహజవనరులు దుర్వినియోగం అయ్యి కొరత ఏర్పడుతోంది. వస్తువులని చూడటంలో మరొక దృష్టికోణం కూడా ఉండవచ్చు. ఈ దృష్టితో చూస్తే, ప్రతీ ఒక్క వస్తువుకీ ఎన్నో స్వరూపాలు ఉంటాయి. ఒక రూపం జీవనం పూర్తికాగానే, అదే వస్తువు కొత్త రూపంలో ఉపయోగపడటానికి సిద్ధం!

ఒకసారి బుద్ధ భగవానుడిని ఒక భిక్షువు కొత్త బట్టలు ఇమ్మని అడిగినపుడు, "నీ పాత బట్టలను ఏం చేశావు?" అని అడిగాడు.

"భగవాన్! ఆ బట్టలు బాగా పాతబడితే, పరుపుమీద వేసుకునే దుప్పటిగా వాడుతున్నాను" అని జవాబు ఇచ్చాడు భిక్షువు.

"ఆ పాత దుప్పటిని ఏం చేశావు?" అని బుద్ధుడు ప్రశ్నించాడు.

"ఆ దుప్పటి బాగా పాతబడి చిరిగిపోతే, దిండు గలీబుగా వాడుతున్నాను," అన్నాడు భిక్షువు.

"మరి అయితే, ఆ పాత దిండు గలీబుని ఏం చేశావు?" అని ప్రశ్నించాడు బుద్ధుడు.

"ఆ పాత దిండు గలీబు ఎంతగా అరిగి, చిరిగి పోయిందంటే, దాన్ని కాళ్లు తుడుచుకునే పట్టాగా మాత్రమే వాడగలమని అనుకున్నాను," అన్నాడు భిక్షువు.

విషయం లోతుపాతులు తెలుసుకునేందుకు విచారణ జరుపుతూ, చివరిగా బుద్ధుడు, "అయితే ఆ పాత పట్టాను నువ్వేం చేశావో చెప్పు," అన్నాడు.

"భగవాన్! పాత పట్టా పీలికలు పీలికలుగా చిరిగిపోయింది. అందుకనే, ఆ దారపు పోగులను చుట్టి వత్తి లాగా చేసి దీపం వెలిగిస్తున్నాను," ఎంతో నమ్రతగా అన్నాడు భిక్షువు.

బుద్ధుడు ఆనందించి, వెంటనే భిక్షువుకి కొత్త బట్టలని ఇప్పించాడు.

✪

ఉదయాచల్ పాఠశాల

ముంబయిలోని ఉదయాచల్ పాఠశాల మన దేశంలోని మంచి పాఠశాలల్లో ఒకటిగా పేరు పొందింది. దీనిని గోద్రెజ్ కంపెనీ నడుపుతోంది. ఈ స్కూలుని శ్రీమతి వకీల్ స్థాపించారు. ఆమె చాలా సంవత్సరాలు గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ శాంతి నికేతన్ ఆశ్రమంలో పని చేశారు.

ఈ స్కూల్లో ఒక బాల్‌వాడీ అంటే ప్రీ - స్కూలు కూడా ఉంది. ఇక్కడికి మూడు సంవత్సరాల వయసుగల పిల్లలు వస్తారు. రోజంతా రకరరకాల కార్యక్రమాల్లో మునిగి ఆనందిస్తుంటారు. పిల్లలు ఇంటి నుంచి దినపత్రికలని తీసుకుని వచ్చి ఒక డ్రమ్ములో తడుపుతారు. ఇలా నానడం వల్ల కాయితపు ముద్దలు తయారవుతాయి. పొద్దున్నే పిల్లలు మంచి హుషారుగా ఉన్నపుడు కట్టె పుల్లలతో ఈ కాయితపు గుజ్జును నేలమీద కొట్టి కొట్టి మెత్తగా తయారు చేస్తారు. ఈ పని చేయడంలో వాళ్లకెంతో మజా! ఈ గుజ్జులో జిగురు, మట్టి కలిపి, దానితో పిల్లలు ఎన్నో జంతువుల బొమ్మలు తయారుచేస్తారు. ఎండిన తరవాత బొమ్మలకి రంగులు కూడా వేస్తారు. ఈ కాయితపు ముద్దతో తయారు చేసిన బొమ్మలు తొందరగా విరగవు.

ఈ బడిలో సుమారుగా మూడు వందల చెత్తడబ్బాలు ఉన్నాయి. వాటిని పిల్లలే ఎంతో చవకగా స్కూల్లోనే తయారుచేశారు. పాత సైకిల్ ట్యూబులతో చెట్లు, యంత్రం, ఇల్లు లాంటి ఆకారాలు కత్తిరించి దానిని చదునైన చెక్క మీద లేదా పాలరాయి ముక్కల మీద అంటిస్తారు. నలుగురైదుగురు కలిసి గుండ్రంగా కూర్చుంటారు. వాళ్ల మధ్యలో ఒక గిన్నెలో రంగుతో తడిసిన మొద్దుబట్ట ఉంచుతారు. పిల్లలు పాత వార్తాపత్రికల మీద ముద్రలతో ఎన్నో అందమైన ఆకర్షణీయమైన చిత్రాలు వేస్తారు.

పాఠశాలలో సంగీతం అంటే కూడా ఎంతో మక్కువ. నాలుగైదు రకాల వాద్య పరికరాలను పిల్లలు తయారుచేశారు. ఎలా అంటారా? డబ్బాలో రాళ్లు నింపితే అది ఒక వాయిద్యం అవుతుంది. రెండు మూతలతో చేతాళం, ఒక డబ్బా మీద తీగకడితే ఏక్ తారా తయారు అవుతాయి!! కొంతమంది పిల్లలు వాటిని వాయిస్తుంటే, మిగిలిన పిల్లలు నాట్యం చేస్తారు. ఈ బాల్వాడీలో అక్షరమాల

రాయడం గానీ, అంకెలు వల్లెవేయడం గానీ నేర్పించరు. ఇక్కడ పిల్లలు సంతోషాలతో తమ బాల్యాన్ని గడుపుతారు.

✪

రైలు బడి

ఈ జపనీస్ బడిపేరు యాతోమాయే! స్థాపించింది 1937లో! ఇది కేవలం ఎనిమిది సంవత్సరాలు మాత్రమే నడిచింది. ఈ స్కూలు ముఖ్య ఉపాధ్యాయుడు 'కొబయాషీ' ఒక అద్భుతమైన వ్యక్తి. స్కూలు అంటే అందరికీ పెద్ద భవనాలు, ఆట స్థలాలు, బల్లలు, కుర్చీలు గుర్తుకు వస్తాయి. కానీ ఈ జపనీస్ బడిలో మాత్రం పాత రైలు డబ్బాలే తరగతి గదులు. ఒక రైలు డబ్బాలో పుస్తకాలయం కూడా ఉంది.

ఈ స్కూలులో చదివిన అద్భుతమైన అనుభవాన్ని కురయోనాగి అన్న ఆమె 'తోత్తోచాన్' అనే పుస్తకంలో రాశారు. కురియోనాగి ముద్దుపేరే 'తోత్తోచాన్'. 1980లో ఈ పుస్తకం ముద్రించినపుడు విద్యా రంగంలో ఒక అలజడి సృష్టించింది. ముద్రించిన పదహారు నెలల్లోనే ఈ పుస్తకం 50 లక్షల కాపీలు అమ్ముడు పోయాయి. ఈ పుస్తకాన్ని తెలుగులో 'రైలుబడి'గా హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురించింది.

తోత్తోచాన్ ఎంతో తెలివైన, జిజ్ఞాస, సృజనాత్మక శక్తి ఉన్న పిల్లో అంతటి అల్లరి పిల్ల. తనకి ఇష్టమైన పనిలో చిటికెలో మునిగిపోతుంది.

ఈ చంచల స్వభావం, మొండితనం వల్ల తోత్తోచాన్‌ని ఒక సాధారణ స్కూలు నుంచి తీసివేశారు. అప్పుడు, ఈ రైలు బడిని తోత్తోచాన్ స్వయంగా ఎన్నుకుంది. ఆ ముందు స్కూల్లో తోత్తోచాన్ ఎన్నో కష్టాలు పడింది పాపం!! 'స్కూలుకి ప్రత్యేకమైన పాట లేకపోతే ప్రార్థనా సమయంలో అదేపాట రోజూ పాడాల్సిన బాధ తప్పుతుంది,' అనుకునేది తోత్తోచాన్.

ఈ రైలుబడిలో పిల్లల్ని ఎవరూ "ఏయ్! ఈ పని చేయవద్దు", "అల్లరి చేయొద్దు" అని అరిచి ఆపరు. ఎవరికి ఇష్టమైన పని వారు చేయవచ్చు.

తోత్తోచాన్‌కి అన్నిటికంటే విచిత్రం – ఈ బడిలో చేరడానికి వచ్చినపుడు, నాలుగు తోత్తోచాన్ చెప్పినదంతా శ్రద్ధగా నాలుగు గంటలపాటు విని, "ఇంకా చెప్పేందుకు ఏమన్నా ఉందా?" అని కొబయాషీ అడిగాడు. గంటలు, పీరియడ్‌లకి లోబడి ఇక్కడ చదువు ఉండదు. తమకి ఇష్టమైన, వీలైన విధంలో పిల్లలు తమ పని చేసుకుంటారు.

ఇక్కడ గురువు తనకి తెలిసినదంతా ఉపన్యాసం లాగా చెప్పేకంటే, పిల్లలు స్వయంగా తెలుసుకునే లాగా, అనుభవం పొందేందుకు ప్రోత్సహిస్తారు. విహారానికని పిల్లలని పొలాలకి తీసుకుని వెళతారు. వాళ్ల తప్పుల చిట్టాలు తల్లిదండ్రుల దగ్గరికి వెళ్లనే వెళ్లవు. కొబయాషీ నెత్తిన ఎక్కి పిల్లలు ఆటలు ఆడతారు. ఒడిలో, భుజాల మీద గంతులేస్తారు. అవసరం వచ్చినప్పుడు ఆయన దగ్గర డబ్బులు అప్పుగా కూడా అడిగి తీసుకుంటారు. వాళ్ల ఓటమిని ఆయన ఎన్నడూ గేలిచేయలేదు. ఎప్పుడూ తిట్టలేదు. అందుకే పిల్లలు సంతోషంగా రైలు బడికి వెళతారు.

✪

అసలైన శిక్షణ

పట్టణ ప్రాంత ప్రజలతో గాంధీజీ, "చీపురు, బక్కెటు మీ చేతుల్లోకి తీసుకునేంత వరకు మీ పట్టణాలు శుభ్రంగా ఉండవు," అనే వారు. ఒకసారి మండల బడిలో శిక్షకులతో మాట్లాడుతూ, "మీ పిల్లల చదువుతో పాటు భోజనం వండటం, మూత్రశాలలు శుభ్రం చేయటం లాంటివి నేర్పించినపుడే మీ బడి ఆదర్శంగా నిలుస్తుంది," అన్నారు గాంధీజీ.

గాంధీజీ ఆశ్రమంలో అన్ని కులాల వాళ్లు, మతాల వాళ్లు ఆశ్రమం

శుభ్రం చేయడానికి తలా ఒక చెయ్యి వేస్తారు. చెత్త అంతా ఒక గొయ్యిలో వేసి నింపుతారు. పారేసే అన్ని వస్తువులకీ మరొక మంచి ఉపయోగం ఉంటుంది. కూరగాయల తొక్కులు, మిగిలిపోయిన భోజనం, మూత్ర శాలల్లోని మలమూత్రాలు ఇలాంటి వాటితో పొలాలకి మంచి ఎరువు తయారవుతుంది. మురికి నీరు కూడా పొలాలకు నీరు పెట్టడానికి పనికి వస్తుంది.

గాంధీజీ శిక్షణా పద్ధతిని మౌలిక విద్య అన్న పేరుతో పిలుస్తుంటారు.

మనం రోజూ ఉపయోగించే వస్తువులను తయారు చేసుకోవడం, చేతి పనులు ఈ శిక్షణా పద్ధతిలో ముఖ్యమైనవి. ఇక్కడ స్కూల్లో పిల్లలు రాట్నం వడకడం, మగ్గాల మీద నేయడం, చర్మంతో చెప్పులు చేయడం లాంటి ఎన్నో కళలు నేర్చుకుంటారు. తమ అవసరాలకి ఉపయోగించే వస్తువులను సాధారణ ప్రజలు స్వయంగా చేసుకున్నప్పుడే ఆత్మవిశ్వాసంతో జీవించగలరని గాంధీజీ గట్టిగా నమ్మేవారు.

ప్రస్తుతానికి వస్తే, సాధారణ మానవుడు తన జీవితం మీదే నియంత్రణని పోగొట్టుకున్నాడు.

మనం ఇప్పుడు బట్టలు కత్తిరించడం, బట్టలు కుట్టడం, బట్టలు నేయడం, వంట వండటం, మొక్కలు నాటడం, శుభ్రంగా ఉంచుకోవడం లాంటి ప్రాథమిక నైపుణ్యాలను, గొప్ప కళలను మరచిపోతున్నాం. అందుకనే, ఈ కళలన్నింటినీ మన పిల్లల చదువులో ఒక అంశంగా చేయాలి.

✪

ఎలుకల కథ - పిల్లలకి వ్యథ

రాబర్ట్ రోజన్‌థాల్ అమెరికాలో మనోవైజ్ఞానిక ప్రొఫెసర్. పరిశోధన చేసే ఇద్దరు విద్యార్థులకి చెరొక ఎలుకని ఇచ్చి వాటికి చిక్కు మార్గాల్లోంచి బయటికి రావడం నేర్పించమన్నాడు. మొదటి విద్యార్థితో రహస్యంగా, "ఇది చాలా తెలివైన ఎలుక. తప్పకుండా గెలుస్తుంది," అన్నాడు. రెండవ విద్యార్థి చెవిలో గుసగుసగా, "ఇది కొంచెం తెలివితక్కువ ఎలుక. అయినా సరే, ప్రయత్నించు," అన్నాడు. ఈ ఎలుకల్లో తేడాలు కేవలం విద్యార్థుల మనసుల్లోనే ఉన్నాయి, నిజానికి ఎలుకలు ఒక లాంటివే. పరీక్ష పెట్టిన రోజున 'తెలివైన' ఎలుక చిటుక్కున ఆ కష్టమైన మార్గంలోంచి బయటికి వచ్చేసింది. కానీ, "మందబుద్ధి"గల ఎలుక తన స్థానంలోంచి కదలడానికి కూడా ప్రయత్నించలేదు.

ఆశ్చర్యపరిచే ఈ ఫలితాల తరవాత, రోజన్‌థాల్ ఈ ప్రయోగాన్ని ఒక స్కూలులో ప్రయత్నించారు. దీనికోసం మే 1964లో ఆయన తన బృందంతో శాన్ ఫ్రాన్సిస్కో పట్టణంలోని ఒక పేద ప్రాథమిక పాఠశాలకి వెళ్లారు. ఇక్కడికి పేద శ్రామికుల, అల్పసంఖ్యాక వర్గాల పిల్లలు వస్తుంటారు. రోజన్‌థాల్ తన బృందం హెూవార్డ్ విశ్వవిద్యాలయం నుంచి వచ్చిందని, ఈ పరిశోధన ప్రభుత్వ వైజ్ఞానిక సంస్థ కోసం చేస్తున్నామని చెప్పారు. అంత పెద్ద పేరు విని, ఆ బీద ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సంతోషంతో స్వాగత సత్కారాలు పలికారు.

పిల్లలందరికీ వాళ్ల తెలివిని తెలియచేసే ఒక ప్రామాణిక ఐ.క్యూ. పరీక్షను రోజన్‌థాల్ పెట్టారు. దాని ఫలితాలు ఏమిటో ఆ ఉపాధ్యాయులకి చెప్పలేదు. తరవాత, హాజరు పుస్తకం తీసుకుని, ఏ ఆధారం లేకుండానే, ప్రతీ మూడో విద్యార్థిని "మందబుద్ధి లేదా తెలివి తక్కువవాడనీ," ప్రతీ నాలుగో విద్యార్థినీ "తెలివి"గల వాడనీ నిర్ధారించారు. అప్పటి నుంచి ప్రతి పద్నాలుగు రోజులకి ఒకసారి ఆయన ఈ బడిలో పిల్లలకి ఒక ప్రామాణిక ఐ.క్యూ. పరీక్ష పెడుతుండే వారు. ఈ పరీక్షల పరంపర రెండు సంవత్సరాలు నడిచింది.

ఈ పరీక్షల ఫలితాలు ప్రపంచాన్ని అంతటినీ కుదిపేశాయి. తెలివిగల పిల్లలైనా, ఒకసారి రోజన్‌థాల్ 'మందబుద్ధి' కలవాడని చెప్పిన తరవాత ఐ.క్యూ.



మెల్లగా తగ్గిపోయింది. తెలివితక్కువ పిల్లలైనా రోజన్‌థాల్ భాషలో "తెలివి" కలవాడని ముద్రపడిన తరవాత వాళ్ల ఐ.క్యూ. ముందు కన్నా బాగా పెరిగింది. ఎందుకంటే, ఉపాధ్యాయులు వీళ్లని ఎక్కువగా ప్రశ్నలు అడిగి ప్రోత్సహించారు.

ఈ పరీక్షలు ఒక మంచి గుణపాఠాన్ని నేర్పాయి. పిల్లలు తప్పకుండా విజయం సాధిస్తారని గురువుకి నమ్మకమే ఉంటే, వాళ్లు తప్పకుండా గెలుపు సాధించి తీరతారు. అందుకనే పిల్లల విజయం మీద పూర్తి విశ్వాసాన్ని ఉంచాలి. విద్యలో ఇదే అన్నింటికంటే తేలికైన మార్పు!!

✪

సరదా చదువు



హిందీ మూలం : ఖుషియోంకా స్కూల్

(ఫూల్‌ఝుడీ నుండి వ్యాసాల సంకలనం)

అనువాదం : కె. మాధవి, యం. శ్రీనివాస్

1.	ఇంటి నుండి పత్రిక	(వి.ఐ. లెనిన్, 1870-1924)	29
2.	ప్రెస్టోలీ పాఠశాల	(టెడ్డీ ఓనీల్, 1890-1975)	30
3.	ఆనందానికి నిలయం ఆ బడి	(వి. సహ్లోమిన్‌స్కీ, 1918-1970)	31
4.	సంచార విద్యావేత్త	(జాన్ హోల్ట్, 1923-1985)	33
5.	మీరాంబికా	(ఢిల్లీలోని పాఠశాల, స్థాపితం: 1981)	34
6.	కళ్ళుండీ చూడలేనివారు	(హెలెన్ కెల్లర్, 1880-1968)	36
7.	వంట - శిక్షణ	(యం.కె. గాంధీ, 1869-1948)	37
8.	సృజన బడి	(నెల్లూరు పల్లిపాడులోని పాఠశాల)	39
9.	పిల్లల వైఫల్యాలకు కారణాలు	(జాన్ హోల్ట్, 1923-1985)	42
10.	పిల్లల సొంత పత్రిక	(భగత్‌సింగ్ గ్రంథాలయం, పిపరియా, మధ్యప్రదేశ్)	43
11.	ఇసుక రేణువు	(జవహర్ లాల్ నెహ్రూ, 1889-1964)	45
12.	విజ్ఞాన శాస్త్రం	(ఆంధ్రప్రదేశ్‌లోని ఒక టీచరు అనుభవం)	46
13.	పార్క్ స్కూల్	(ఇంగ్లాండులోని ఒక బడి)	47

ఇంటి నుండి పత్రిక

లెనిన్ పేరు మీలో చాలా మంది వినే ఉంటారు. ప్రపంచంలో పేరొందిన నాయకుల్లో ఆయన ఒకరు. 1917లో రష్యాలో జరిగిన విప్లవానికి ఆయన నాయకత్వం వహించారు. ఈ విప్లవం వల్ల ప్రపంచంలోని ఎన్నో కోట్ల మంది ప్రజలు బానిస సంకెళ్లను తెంచుకున్నారు. సంపన్నుల ఇంట్లో లెనిన్ జన్మించారు. అయినా కూడా ఆయన బీద రైతులకి, కార్మికులకి నాయకత్వం వహించారు. ఆయన చిన్నతనంలో వారి ఇంట్లో చక్కటి వాతావరణం నెలకొని ఉండేది. వాళ్ల నాన్న విద్యావిభాగంలో ఉన్నత పదవిలో ఉండేవారు. లెనిన్ అన్న అలెగ్జాండర్ భౌతిక శాస్త్ర విద్యార్థి. ఆయన చెల్లెలు బడికి వెళ్లేది. వాళ్ల అమ్మగారు ఇంటి పని చూసుకునేవారు.

లెనిన్ వాళ్ల ఇంట్లో ప్రతి వారం ఒక పత్రిక రాసేవారు. ఆ పత్రిక కోసం ఇంట్లో ప్రతి ఒక్కరూ ఏదో ఒక విషయం మీద వ్యాసం రాసేవారు. పాఠశాలలకి సంబంధించిన ఏదైనా ఆసక్తికరమైన విషయం మీద వాళ్ల నాన్న రాసేవారు. వాళ్ల అమ్మ ఏదైనా కవిత గానీ, వంటింటి విషయం గానీ రాసేవారు. లెనిన్ అన్న సైన్సు విద్యార్థి కావడం వల్ల కొత్త వైజ్ఞానిక విషయం మీద రాసేవారు. లెనిన్ తన బడి విషయం ఏదైనా అందులో కూర్చేవారు. వాళ్ల చెల్లెలు ఆ పత్రిక కోసం మంచి బొమ్మలు గీసేది.

ఈ నాలుగు కాగితాల పత్రిక చేత్తో రాసేవారు. ఆదివారం పొద్దున ఫలహారం

చేసేముందు ఆ పత్రికని పూర్తిగా చదివేవారు. చిన్నప్పటి ఈ అనుభవం లెనిన్ జీవితంలో చాలా బలంగా నాటుకుంది. చాలా సంవత్సరాలు విదేశాలలో ఉండి రష్యా వచ్చీ రాగానే ఆయన మొదట ఒక పత్రిక మొదలు పెట్టారు. ఆ పత్రిక పేరు "ఇస్కార్", అంటే దీపం అని అర్థం. రష్యాలోని వివిధ వర్గాల ప్రజలను ఈ పత్రిక ఒక త్రాటి కిందకు తీసుకుని వచ్చింది. ఈ విధంగా రష్యాలో జరిగిన విప్లవంలో ఒక విలువైన పాత్రని పోషించింది.

చిన్నప్పుడు నేర్చుకున్న మంచి విలువలే మనిషిలోని మానవత్వానికి పునాదిరాళ్లు. చిన్నపిల్లలకి ఇంటిలో ఆరోగ్యవంతమైన, ప్రశాంతమైన వాతావరణం లభిస్తే పెద్ద వాళ్లయినాక వాళ్లు ప్రతిభాశాలులు అవుతారు.

✪

ప్రెస్టోలీ పాఠశాల

టెడ్డీ ఓనీల్ 26 సంవత్సరాల యువకుడు. ఆయన ఉత్సాహం, పట్టుదల కలిగిన ఒక మంచి టీచరు. పిల్లలకి మంచి విద్యను అందించాలని కలలు కనేవాడు. 1930 సంవత్సరంలో ఆయనని ఇంగ్లాండులో "ప్రెస్టోలీ" అనే కార్మికవాడలో బడి టీచరుగా నియమించారు. ఆ బడిలో పరిస్థితి చాలా దయనీయంగా ఉండేది. అక్కడ ఎలాంటి పరికరాలు, పుస్తకాలు ఉండేవి కావు. పిల్లలకి కూర్చోవడానికి బల్లలు, కుర్చీలు కూడా ఉండేవి కావు. ఏదైనా నేర్చుకోవాలనే ఆసక్తి మచ్చుకైనా పిల్లల్లో కనిపించేది కాదు. మొత్తం మీద అదొక పనికిరాని బడి. టెడ్డీకి వడ్రంగి పని అంటే చాలా ఇష్టం. అక్కడికి వెళ్లిన మర్నాడే తన పనిముట్లని బయటకి తీసి ఒక పుస్తకాల బీరువా తయారు చేయడం మొదలుపెట్టాడు. అక్కడ ఒక గదిలో విరిగిన చెక్క సామాను పడేసి ఉండేది. ఆయన వాటికే మరమ్మతులు చేసి పిల్లలకి కుర్చీలు, బల్లలు తయారు చేశాడు. టెడ్డీ ఇలా పని చేయడం చూసిన పిల్లలు ఆయనతోపాటుగా రకరకాల వస్తువులు తయారుచేశారు. ఒకరు బొమ్మరిల్లు చేస్తే, ఇంకొకరు పంజరం, మరొకరు కుందేలుకి ఇల్లు తయారు చేశారు. పాఠాలు లేకుండా చాలా రోజులపాటు వడ్రంగం పనే నడిచింది. పుస్తకాల బీరువా తయారైన వెంటనే

అందులో పుస్తకాలు ఉండాలనే కోరిక కూడా పిల్లలకి కలిగింది. కొంతమంది పిల్లలు నిజంగానే కుందేలుని పెంచడం మొదలుపెట్టారు. దాని ఆహారం, ఇతర అలవాట్ల గురించి తెలుసుకోవాలనే ఉత్సాహం వారిలో పెరిగింది. పంజరంలో పక్షులని పెంచే పిల్లలు వాటి గురించి తెలుసుకోవడానికి ఆసక్తి కనబరిచారు. ఈ విషయాలన్నీ పుస్తకాలలో ఉంటాయి కాబట్టి, వాటిని చదవడం కూడ పిల్లలు మొదలుపెట్టారు. ఇలా చదువుతూ మెల్లమెల్లగా పుస్తకాలని చదవడం ఇష్టపడ్డారు.

బట్టీ పట్టే చదువు అన్నా, అలాంటి బడులన్నా టెడ్డీకి పరమ చిరాకు. ఆయన ఒక గొప్ప విద్యావేత్త. ముప్పై సంవత్సరాల పాటు 'ప్రెస్టోలీ బడి'లో ఆయన పాఠాలు చెప్పారు. ప్రపంచం నలుమూలల నుండి ఎంతో మంది ఈ బడిని చూడటానికి వచ్చేవారు. తన పని ద్వారా చేతిపనుల మీద ఆధారపడిన విద్యావిధానాన్ని ఆయన బలపరిచారు. తన అనుభవాలు అన్నిటిని "ఇడియట్ టీచర్" పుస్తకంలో రాశారు.

✪

ఆనందానికి నిలయం ఆ బడి

సోవియట్ రష్యాలోని ప్రముఖ విద్యావేత్తలలో వసీలీ సుహొమ్లిన్‌స్కీ ఒకరు. రెండవ ప్రపంచ యుద్ధం నాటికి 23 ఏళ్ల వసీలీ ఒక ప్రాథమిక పాఠశాలలో టీచరుగా ఉండేవారు. ఆయన సైనికుడిగా యుద్ధ రంగానికి వెళ్లాడు. ఆయన భార్య వేరా ఉన్న ప్రాంతాన్ని శత్రువులు ఆక్రమించుకున్నారు. శత్రువుల మీద

దాడి చేసేవారికి ఆమె సహాయపడేది. ఒక రోజున "ఫాసిస్టు దుర్మార్గులు" ఆమెను పట్టుకుని ఖైదు చేశారు. అక్కడే ఆమెకి ఒక కొడుకు పుట్టాడు. తమపై దాడులు జరుపుతున్న వారి పేర్లు చెప్పమని శత్రువులు ఆమెని చిత్రహింసలు పెట్టారు. కానీ ధైర్యవంతురాలైన వేరా నోరు విప్పలేదు. అప్పుడు ఆ రాక్షసులు ఆ తల్లి కళ్లముందే రోజులు పసిబిడ్డని చంపేశారు. ఆ తరవాత ఆమెని కూడా ప్రాణాలతో ఉంచలేదు. యుద్ధంలో గాయపడి వసీలీ తిరిగివచ్చాడు. ఆయన ఛాతీలో లోహపు ముక్కలు ఉండిపోయాయి. భార్యా బిడ్డల మరణంతో గుండె ఆవేదనతో నిండిపోయింది.

29 ఏళ్లపాటు తన ఊరిలో బడిని వసీలీ నడిపారు. యుద్ధం కారణంగా చాలా మంది పిల్లలు అనాథలయ్యారు. బాధతో కుంగిపోయారు. వారి జీవితాల్లో మళ్లీ ఆనందం నింపడానికి ఆయన ఎంతో కృషి చేశారు. ఆయన పిల్లల కుటుంబాల గురించి బాగా తెలుసుకునేవారు. ఆ బడికి ప్రిన్సిపాల్ అయి కూడా రోజంతా పిల్లలకి పాఠాలు చెప్పేవారు. పిల్లల సాంగత్యంలో ఆయనకి నూతన ఉత్సాహం, శక్తి లభించేవి. పిల్లల చదువుకి, వారి వ్యక్తిత్వ వికాసానికి దగ్గర సంబంధం ఉందని ప్రపంచం లోని చాలా మంది విద్యావేత్తలు నమ్మేవారు. ఈ సిద్ధాంతాన్ని ఆచరణలో నిరూపించారు వసీలీ. పిల్లలని యోగ్యులు, అయోగ్యులు అని నిర్ణయించకుండా మంచి చదువుని అందించ వచ్చు అని ఆయన నమ్మారు. సుహొమ్లిన్‌స్కీ ఎన్నో పుస్తకాలు రాశారు. వాటన్నిటిలో ప్రముఖమైనది "బాలల హృదయాంతరాలు". ఈ పుస్తకంలో ఆయన పిల్లల అంతరంగాల గురించి తల్లిదండ్రులకి, ఉపాధ్యాయులకి వివరించారు.



"బడికి వచ్చేముందు కొన్ని సంవత్సరాలు, బడిలో మొదటి కొన్ని సంవత్సరాలలోనే మనిషి భవిష్యత్తుకి పునాది పడుతుంది అని నా దృఢ విశ్వాసం," అని ఆయన తన పుస్తకంలో రాశారు.

కొత్తగా బడికి వచ్చినప్పుడు ఎన్నో ఆశలని, ఎంతో ఉత్సాహాన్ని పిల్లలు తీసుకుని వస్తారు. మనమందరం కలిసి పిల్లల్లోని ఈ జిజ్ఞాసని కాపాడితే వారు పెద్దయ్యాక మంచి వ్యక్తులుగా తయారవుతారు.

✪

సంచార విద్యావేత్త

జాన్ హోల్ట్ పేరుగాంచిన విద్యావేత్త. ఆయన ఎన్నో పుస్తకాలు రాశారు. ఆయన రాసిన పుస్తకం "పిల్లలు ఎలా విఫలమవుతారు" ప్రసిద్ధిగాంచింది. "బతకలేక బడిపంతులు" అవుతారనేది మనందరికీ తెలిసిన సూక్తి. తమకి నచ్చిన పని చేస్తూ జీవనాన్ని కొనసాగించగలిగే అదృష్టవంతులు ఈ లోకంలో కొద్దిమందే. వీరిలో జాన్ హోల్ట్ ఒకరు. ఆయన మూడు సంవత్సరాలపాటు అమెరికా నౌకాదళంలోని ఒక జలాంతర్గామిలో పనిచేశారు. ఆ తరవాత నాలుగు సంవత్సరాలు ఒక బడిలో పని చేశారు. ఆ బడిలో పని చేస్తుండగా రోజూ జరిగే సంఘటనలని తన డైరీలో రాసుకునేవారు. ఆయన మొదటి పుస్తకం "పిల్లలు ఎలా విఫలమవుతారు" (హౌ చిల్డ్రన్ ఫెయిల్) ఈ డైరీ ఆధారంగా రాసినదే. 1964లో ప్రచురించిన ఈ పుస్తకం విద్యారంగంలో అలజడిని రేపింది. ఈ పుస్తకాన్ని నిర్భయంగా, చక్కగా రాశారు. హోల్ట్ రచనాశైలి అద్భుతమైనది. జాన్ హోల్ట్ ఒక సీదా సాదా మనిషి. ఆయనకి అమెరికా సమాజంలోని



వినియోగదారీ వ్యవస్థ అంటే పరమ చిరాకు. పర్యావరణ సంరక్షణ అంటే చాలా ఆసక్తి. మిత వ్యయాన్ని ఆయన పాటించేవారు. తను స్నానం చేసిన నీటిని ఎరువు కోసం తయారు చేసిన ఒక గుంతలో పోసేవారు. ఆ ఎరువుని ఆయన తోటల్లోని మొక్కలకి వేసేవారు. తాను ఉండే న్యూయార్క్ నగరం అంటే ఆయనకి చాలా ఇష్టం. తను బయటికి వెళ్లినప్పుడల్లా ఒక ఖాళీ సంచిని తీసుకుని వెళ్లేవారు. రోడ్డు మీద పడి ఉన్న ప్లాస్టిక్, గాజు సీసాలని ఏరి అందులో వేసేవారు. కనిపించిన చెత్తకుండీలో పారేసేవారు. ఆయన 1985లో క్యాన్సరు వ్యాధితో మరణించారు.

✪

మీరాంబికా

"విద్య ఒకరు నేర్పేది కాదు. గురువు కేవలం దారి చూపటానికి మాత్రమే" అని అరవింద మహర్షి అన్నారు. ఆయన ఆదర్శాల ప్రకారమే ఢిల్లీలోని మీరాంబికా అనే బడి నడుస్తోంది. అరవిందో శిష్యులైన ఇద్దరు డచ్ దేశీయులు ఈ బడిని 1981లో స్థాపించారు. మిగతా బడులకంటే ఇది వేరుగా ఉంటుంది. ఈ బడి 8వ తరగతి వరకు ఉంది. ఒక్కొక్క తరగతిలో 12 నుండి 15 మంది పిల్లలు మాత్రమే ఉంటారు. వీరి కోసం ఇద్దరు, ముగ్గురు టీచర్లు ఉంటారు. ఎక్కువ మంది టీచర్లు ఆశ్రమంలోనే ఉంటారు. పిల్లల తల్లిదండ్రులు కూడా బడిలో ఎంతో సహాయం చేస్తారు. పాఠాలు వల్లించడానికంటే అనుభవాల నుంచి నేర్చుకోవటానికి ఈ బడిలో ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. ప్రశ్నలు అడగటాన్ని ప్రోత్సహిస్తారు. ఈ బడిలో మూసపోత విద్య ఉండదు. పిల్లలు తమకి ఇష్టమైన ప్రాజెక్ట్ లేదా విషయాన్ని ఎన్నుకుని, పని చేస్తారు.

ఉదాహరణకి 'పక్షులు' అనే ప్రాజెక్ట్‌లో పని చేసే పిల్లలు ముందుగా గ్రంథాలయానికి వెళ్లి పక్షుల మీద పుస్తకాలు చూస్తారు. ఆశ్రమానికి చెందిన 26 ఎకరాల స్థలంలో పక్షులని గమనిస్తారు. దాంతోపాటు పిల్లలు ఢిల్లీకి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న సుల్తాన్‌పూర్ అభయారణ్యానికి కూడా వెళ్లి చూస్తారు. ఈ పక్షుల ప్రాజెక్టులో భాష, లెక్కలు, విజ్ఞాన, భూగోళ శాస్త్రాలు, కళలు అన్నీ

ఇమిడి ఉంటాయి. పిల్లలు పక్షుల మీద కవితలు, వ్యాసాలు రాస్తారు. ఎన్నో పక్షులు ఎంతో దూరాల నుండి భారతదేశానికి వలస వస్తాయి. ఈ పక్షులు వచ్చే దారిని పిల్లలు గ్లోబు మీద గుర్తిస్తారు. వివిధ పటాలలో పక్షుల వనాలని గుర్తు పెడతారు. కాగితాలని మడిచి ఎన్నో రకాల పక్షుల బొమ్మలని తయారు చేస్తారు. ఈ విధంగా పక్షుల గురించి ఎన్నో ఆసక్తికరమైన విషయాలు నేర్చుకుంటారు. ఇలా నేర్చుకోవడంలో ఉన్న ఆనందమే వేరు!

✪

కళ్లుండీ చూడలేనివారు

నా స్నేహితులు ఏం చూస్తున్నారో తెలుసుకోవాలని అప్పుడప్పుడు నేను అనుకుంటాను. వారిని ప్రశ్నిస్తుంటాను. ఒకసారి ఒక స్నేహితురాలు అడవిలో షికారుకు వెళ్లి వచ్చింది. "అడవిలో నువ్వేం చూశావు," అని నేను ఆమెని అడిగితే అంత విశేషాలు ఏమీ లేవని జవాబు ఇచ్చింది. ఈ జవాబు నన్ను ఆశ్చర్య పరచలేదు. ఇలాంటి జవాబు ఎంతో మంది నుంచి విన్నాను. కళ్లు ఉండి చూడగలిగినవారు చాలా తక్కువ చూస్తారని నా నమ్మకం.

గంటల తరబడి అడవిలో తిరిగితే మరి విశేషాలు ఏమీ కనిపించవా? కంటికి ఏమీ కనిపించని నాకే స్పర్శ ద్వారా ఎన్నో విశేషాలు తెలుస్తాయి. కొండ రావిచెట్టు నునుపైన కాండాన్ని, జాజి కాయ చెట్టు గరుకుదనాన్ని స్పర్శతో గుర్తించగలను. వసంత కాలంలో చిగురుటాకుల మధ్య మొగ్గల కోసం తడుముతుంటాను. పూరెక్కలలోని పట్టులాంటి మెత్తదనం, ఆ పూరెక్కల అమరిక నాకు అపారమైన ఆనందాన్ని ఇస్తాయి. వీటితో నేను అద్భుతమైన ప్రకృతి అనుభూతిని పొందుతాను. కొన్నిసార్లు చిగురుటాకులని తాకగానే నా మదిలో పక్షుల కిలకిలారావాలు మెదులుతాయి. నా వేళ్ల సందుల నుండి పారే చల్లటి

సెలయేటి నీరు వింతైన అనుభూతిని కలుగజేస్తుంది. నేలపై పరుచుకున్న ఆకులు, గడ్డి మైదానాలు నాకు పట్టు తివాచీల కంటే ప్రియమైనవి. మారే రుతువులు నా జీవితంలో కొత్తదనాన్ని నింపి ఎంతో ఆనందాన్ని కలగజేస్తాయి.

ఈ మనోహర దృశ్యాలని చూసి ఆనందించడానికి కొన్నిసార్లు నా హృదయం పరితపిస్తుంది. వీటి స్పర్శతోనే నాకు ఇంత ఆనందం కలుగుతుంటే, వాటిని చూసి నా హృదయం ఎంత ఆనందభరితం అవుతుందో! కానీ నిజానికి చూపున్న వారు చూసేది చాలా తక్కువ. ప్రకృతిలోని అద్భుతమైన రంగులు వారి మనస్సుని తాకలేవు. వాటి భావాలని మనుషులు గుర్తించలేరు. వారి దగ్గర లేని వస్తువుల కోసం అశ్రులు చాస్తూ ఉంటారు. కన్నులతో ఇవన్నీ చూడగలిగే అదృష్టాన్ని ఎంతో సాధారణమైన విషయంగా భావించడం ఎంత దురదృష్టకరం. నిజానికి కంటి చూపుతో జీవితంలో రంగుల హరివిల్లు నింపుకోవచ్చు.

(హెలెన్ కెల్లర్ - అమెరికాకి చెందిన రచయిత్రి.
పుట్టుకతోనే కళ్లు కనపడవు, చెవులు వినపడవు)

✪

వంట - శిక్షణ

సేవాగ్రాంలోని 'నయీ తాలీమ్' బడిలో పనుల ద్వారా చదువు చెప్పేవారు. మా బడిలో రోజూ దాదాపు వందమంది భోజనం చేసే వారు. ఇంతమందికి వంటచేసే బాధ్యత వంతులవారీగా పిల్లలకి ఇచ్చేవారు. ఎనిమిది మంది ఒక జట్టుగా కూడి ఈ పని చేసేవాళ్లు. ఒక నెలలో వంటకి ఎంత ఖర్చు చేయవచ్చో ముందే చెప్పేవారు. పరిమిత ఖర్చుతో రుచిగా ఉండి, పోషక విలువలు కలిగిన ఆహారం అందించటం మాకు శక్తికి మించిన పనిగా ఉండేది. ఆలుగడ్డల ధర తక్కువగా ఉండేవి. కానీ పోషక విలువల దృష్ట్యా ఎక్కువగా పిండి పదార్థాలే ఉండటం వల్ల వాటిని వదిలేయవలసి వచ్చింది. ఐసిఎమ్ఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్) వాళ్లు చెప్పిన కనీస మాత్రం నూనె వాడితే పూర్తి నెలకి కేటాయించిన డబ్బు నూనెకే సరిపోయేది. తెలివైన గృహిణికున్న నేర్పు కూడా మాకు లేదు. ఈ అర్థశాస్త్రం, ఆహార శాస్త్రాలతో కుస్తీపడుతూ, ఏదో విధంగా

పని జరిపించటానికి ప్రయత్నించే వాళ్లం. చాలాసార్లు మేం అనుకున్నవి కాగితాల మీదనే సాధ్యపడేవి. నిజంగా అలా చేయలేకపోయేవాళ్లం. పప్పు ఉడకటానికి ఎంతసేపు పడుతుందో కూడా చాలాసార్లు మాకు తెలిసేది కాదు. చివరికి రాత్రికి మేం గిన్నెలని తోముతూ, కడుగుతూ ఉంటే యుద్ధంలో గాయపడిన సైనికుల లాగా అనిపించేది. అయినా, మరుసటి రోజు చేయ వలసిన వంటపనులు మా కళ్ల ముందర మెదులుతూనే ఉండేవి.

కానీ ఈ మొత్తం పనిలో మేం మూడు విషయాలు బాగా నేర్చుకున్నాం. అవి పోషక విలువల గురించి తెలిపే ఆహార శాస్త్రం, ఇంటికి సంబంధించిన ఆర్థిక శాస్త్రం, ఇంకా పాకశాస్త్రం. కొత్తిమీరలో 10,600 యూనిట్ల 'ఎ' విటమిన్ ఉంటుందనే విషయం నాకు ఇప్పటికీ గుర్తుంది. నేను వంటింట్లో పనిచేస్తూ కొద్ది రోజుల్లో నేర్చుకున్న విషయాలు పది సంవత్సరాలపాటు చదివిన మెడికల్ కాలేజీలో కూడా నేర్చుకోలేదు. రోజువారీ జీవితంలోని విషయాల నుంచి కూడా మనం చాలా నేర్చుకోగలం.

సృజన బడి

చదువుని ఆసక్తికరంగాను, పిల్లలు ఇష్టపడేటట్లు చేయాలని మేం కొత్తగా ఒక బడిని మొదలుపెట్టాం. పిల్లలకి చదువు నీరసం గాను, భారంగాను అనిపించకూడదు. చదువు వారి జీవితాలకి దగ్గరగా, భవిష్యత్తులో ఉపయోగ పడేటట్లు ఉండాలనేది మా ఉద్దేశం. బడి మొదలైనపుడు పదిహేనుమంది పిల్లలు మాత్రమే ఉన్నారు. అందరూ దాదాపు తొమ్మిది సంవత్సరాల పిల్లలే. మా బడి నెల్లూరు జిల్లాలో ఉంది.

మా దృష్టిలో "నేర్చుకోవటం" అంటే ఆలోచించడం, అర్థం చేసుకోవడం. ఈ "నేర్చుకోవటం" అనే ప్రక్రియకు పరీక్షలు ఏవిధం గాను సహాయపడవని మా గట్టి నమ్మకం. అందుకే మా బడిలో పదవ తరగతి వరకు ఎలాంటి పరీక్షలు పెట్టలేదు. చాలా బడులలో పిల్లలు పరీక్షలు కోసం బట్టీ పడతారు. "మంట మండటానికి ఆక్సిజన్ అవసరం" లాంటివి పూర్తిగా అర్థం చేసుకోకపోవడం వల్ల ఈ విషయాలని త్వరలోనే మరిచిపోతారు. ఇదే విషయాన్ని చెప్పటానికి ఒక వెలుగుతున్న కొవ్వొత్తి మీద ఒక గాజు సీసాని బోర్లిస్తే ఆ కొవ్వొత్తి కొంతసేపు వెలిగి, ఆరిపోతుంది. ఈ చిన్న ప్రయోగం ద్వారా నేర్చుకున్న అదే విషయాన్ని పిల్లలు ఎప్పటికీ మరిచిపోరు.

పిల్లల జీవితాలకి, వారి సమాజానికి అనుగుణంగా చదువు ఉండాలనేది మా కోరిక. ఆ విధంగానే మా బడిలోని పాఠ్యాంశాలని తయారుచేశాం. ఉదాహరణకి విజ్ఞానశాస్త్రంలో మా ఊళ్లోని ఇళ్ల గురించి పిల్లలు తెలుసుకుంటారు. ఆ ఇళ్లు నిర్మించటానికి ఏమేమీ ఉపయోగించారు, వాటి నిర్మాణం ఎలా ఉంది, ఇళ్ల కప్పులు ఏటవాలుగా ఎందుకున్నాయి, వాటి గోడలు పొట్టిగా ఎందుకు ఉన్నాయి, ఇంటి వాళ్లు పశువులని ఎక్కడ కట్టేస్తారు, వాళ్లు ఎక్కడ పని చేస్తారు లాంటి ఎన్నో ప్రశ్నలకి జవాబులు తెలుసుకుంటారు. గుడి, బడి, తపాలా కార్యాలయం (పోస్టాఫీసు), పంచాయితీ ఆఫీస్ వంటి వాటి గురించి కూడా మేం వివరంగా చర్చిస్తాం.

మా బడిలో పిల్లలందరికి తెలుగు మాతృభాష. అందుకని మేం మొదటి

సంవత్సరం పిల్లలకి ఇంగ్లీషులో మాట్లాడటం మాత్రమే నేర్పిస్తాం. ఇంగ్లీషు చదవటం, రాయడం ఉండదు. పిల్లలు తాము ఇష్టపడే ఆటల ద్వారా ఇంగ్లీషు భాషని చాలా సహజంగా నేర్చుకుంటారు. పిల్లలకి ఎన్నో పాటలు, నృత్యాలు కూడా నేర్పిస్తాం. వీటి ద్వారా అర్థాలే కాకుండా భావభంగిమలు కూడా పిల్లలు నేర్చుకుంటారు. భాషలోని లయ కూడా నేర్చుకుంటారు. చిన్న చిన్న నాటికలు, అనుకరణ కూడా ఇంగ్లీషు నేర్చుకోవడానికి ఉపయోగపడతాయి. పిల్లలు ఆలోచించడానికి, ఆలోచనలని వ్యక్తపరచడానికి మాతృభాషే అనువైనది. కాని దౌర్భాగ్యం ఏంటంటే మనలో చాలా మంది తెలుగుకంటే ఇంగ్లీషు ఉత్తమమైనదని అనుకుంటారు. వారి అభిప్రాయం ఏంటంటే -

1. పిల్లల కోసం తెలుగుకంటే ఇంగ్లీషులో ఎక్కువ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.
2. ముందు నుంచే ఇంగ్లీషు నేర్చుకుంటే ముున్ముందు పిల్లలు ఎంతో మంచి ఇంగ్లీషు పుస్తకాలు చదవగలుగుతారు.

మా బడిలో పిల్లలు కూడికలు, తీసివేతలు కూడా అనుభవం ద్వారానే

నేర్చుకుంటారు. పిల్లలకి నిజమైన డబ్బు ఇచ్చి దాని వాడకం నేర్పుతాం. తరగతి గదిలోనే ఒక దుకాణం తెరిచి అందులో గ్లాసు, చెంబు, బంతి, బట్టలు వగైరా పెడతాం. పిల్లలు తమ వద్ద ఉన్న డబ్బుతో ఈ వస్తువులని కొనుక్కోవచ్చు. పిల్లల్లోనే ఒకరు ఈ దుకాణాన్ని నడుపుతారు. వారు పిల్లలని మోసం చేయడానికి ప్రయత్నిస్తారు. పిల్లలు ఆ మోసాన్ని గుర్తించి తెలివిగా ప్రవర్తిస్తారు. ఒకవేళ ఎవరైనా మోసపోతే అందుకు వారెంతో సిగ్గుపడతారు. ఆ తరవాత నుండి జాగ్రత్తగా ఉంటారు. ఈ విధంగా కూడికలు, తీసివేతలు పిల్లలు ఎంతో సులువుగా నేర్చుకోవడమే కాక, ఎప్పటికీ మరిచిపోరు. పిల్లలు తమ చేతులతో పని చేయడాన్ని మేం ప్రోత్సహిస్తాం. దీనికి ముఖ్యంగా రెండు కారణాలు ఉన్నాయి:

1. పిల్లలు తాము చేసే పనిని చక్కగా, అందంగా పూర్తి చేయాలన్న కోరికతో ప్రయత్నిస్తారు.
2. ఈ పనుల ద్వారా వాటికి సంబంధించిన విషయాలు కూడా పిల్లలు ఇష్టపడేటట్లు చేయగలుగుతాం.

ఉదాహరణకి అట్టముక్కలతో చేసిన త్రిభుజం, వృత్తం, చతురస్రం వంటి ఆకారాలతో గణితాన్ని ఎంతో ఆసక్తికరంగా చేయవచ్చు. పిల్లలు రకరకాల వస్తువులతో పని చేస్తారు. రంగులు వేయడం, మట్టితో వస్తువులు చేయడం, చిత్రకళ, అద్దకం, పేపర్ కటింగ్ లాంటివి పిల్లలకి ఎంతో ఇష్టం. మేం వడ్రంగి పని కూడా పిల్లకి నేర్పించాలని అనుకున్నాం. కాని దానికి కావలసిన పరికరాలు చాలా ఖరీదైనవి కాబట్టి పిల్లలకి దానిని నేర్పించలేకపోయాం.



వ్యవసాయం గురించి మా బడి పిల్లలదరికీ ఎంతో కొంత తెలుసు. ఏదైనా కొత్త పంట వేసినప్పుడు మేమందరం దాని గురించి చర్చిస్తాం – ఆ పంటకి ఏ ఎరువు వేయాలి? ఎక్కువ రాబడి కోసం ఏం చేయాలి?

మా బడిలో పిల్లలందరికి ఎంతోకొంత భూమి ఉంది. పిల్లలు వారి పొలానికి సంబంధించిన పూర్తి వివరాలతో రికార్డులు తయారు చేస్తారు.

పిల్లలు క్రమం తప్పకుండా బడికి రావాలని మేం ఆశిస్తాం. కానీ పేద కుటుంబాలలోని పిల్లలు ఇలా రాలేకపోతారు. నాట్లు వేయడం, పంట నూర్చడం వంటి పనులు ఉన్నప్పుడు ఈ పిల్లలు ఇంట్లో ఉండిపోతారు. చిన్న పిల్లలను చూసుకోవడం, ఇంట్లోని మిగతా పనుల బాధ్యత వీరి మీద పడుతుంది. పాఠాలు జరిగేటప్పుడు పిల్లలందరూ బడికి రావాలని మేం కోరుకుంటాం. అయితే నిజానికి ఇలా జరగదు. కొంతమంది పిల్లలు మధ్యలోనే బడి వదిలేస్తారు. వాస్తవికతకి మనం దూరంగా ఎలా ఉండగలం?

- ఎలినార్ వాట్స్, శివరాం

✪

పిల్లల వైఫల్యాలకు కారణాలు

విద్యాలయాలలో ఎక్కువ శాతం పిల్లలు విఫలమౌతారు. వీరిలో చాలా మంది పూర్తిగా విఫలమౌతారు. బడిలో చేరిన పిల్లల్లో సుమారు నలభై శాతం మంది వారి చదువుని ముగించలేరు. కాలేజీల్లో ప్రతి ముగ్గురిలో ఒకరు మధ్యలోనే చదువు ఆపేస్తారు.

పై తరగతిలోకి నెట్టబడిన పిల్లలకి ఎంత తెలుసో చెప్పడం చాలా కష్టం.



పిల్లలు పుట్టుకతోనే నేర్చుకోవడం, అర్థం చేసు కోవడం, నిర్మించడం వంటి విషయాలలో అపారమైన సామర్థ్యం కలిగి ఉంటారు. మొదటి రెండు, మూడు సంవత్సరాలలో పిల్లలు ఈ శక్తిని అద్భుతంగా ఉపయోగించుకుంటారు. బడిలో చాలా మంది పిల్లలు ఈ శక్తిలో చాలా చిన్న భాగాన్ని మాత్రమే ఉపయోగించు కుంటారు. పిల్లలు ఎందుకు విఫలమౌతారు?

బడిలో పిల్లలు భయపడతారు, విసుగు చెందుతారు, కలవరపడతారు కాబట్టే విఫలమౌతారు. తల్లితండ్రులని, టీచర్లని నిరాశ పరుస్తామన్న భయం చాలా ఎక్కువ. ఈ భయం వారిని ఎల్లప్పుడు వెన్నంటి ఉంటుంది.

బడిలో చెప్పే విషయాలు, చేసే పనులు ఎంతో నీరసంగా ఉంటాయి. పిల్లల తెలివితేటలని, శక్తిని ఇవి ఏమాత్రం ఉత్తేజ పరచవు. అందుకే పిల్లలు బడిలో ఎంతో విసుగుచెందుతారు. బడిలో చెప్పే చాలా విషయాలు ఉప్పెనలా పిల్లలని ముంచెత్తుతాయి. ఈ విషయాలు పిల్లల నమ్మకాలకి ఎంతో విరుద్ధంగా, పిల్లల మనసులోని ఊహలకి ఎంతో దూరంగా ఉంటాయి. దీనితోటి పిల్లలు ఎంతో కలవరపడతారు.

మంచి బడులు రెండు విశేషాలను కలిగి ఉంటాయి:

1. పిల్లలు బడిలో ఏమీ నేర్చుకోలేకపోతే అందుకు బడి పూర్తి బాధ్యత వహిస్తుంది. పిల్లల మీద, వారి తల్లిదండ్రుల మీద లేనిపోని కారణాలను నెట్టదు.
2. తరగతులలో ఉపయోగించే పద్ధతులని క్రమం తప్పకుండా సమీక్షించు కుంటారు. ఏదైనా పద్ధతి పిల్లలకి తగినట్లుగా లేకపోతే, దానిని వదిలేసి కొత్త పద్ధతులని ప్రయత్నిస్తారు. ఇలాంటి మంచి బడుల్లో ఒకవేళ విఫలమంటూ జరిగితే అది పద్ధతులదే కాని పిల్లలది కాదు.

- జాన్ హోల్ట్

✪

పిల్లల సొంత పత్రిక

స్థలం: షహీద్ భగత్‌సింగ్ గ్రంథాలయం, పిపరియా గ్రామం, మధ్య ప్రదేశ్.

ఆ రోజు ఆదివారం. గ్రంథాలయం పిల్లలతో కిక్కిరిసి ఉంది. గోడ మీద ఒక పెద్ద బూడిదరంగు కాగితం అతికించి ఉంది. దాని మీద "పిల్లల పత్రిక" అని రాసి ఉంది. పిల్లలని వాళ్లకి ఇష్టమైన విషయం ఏదైనా రాసి, లేదా ఏదైనా చిత్రం గీసి ఆ కాగితం మీద అతికించమని చెప్పారు.

మొదట్లో పిల్లలు వాళ్ల పుస్తకాలలోని విషయాలను రాశారు. కొన్ని బొమ్మలని చూసి గీశారు. చాలాసేపు చర్చించిన తరవాత పిల్లలకి వారు సొంతంగా రాయాలని, గీయాలనీ అర్థమైంది. "బావిలో పడ్డ మేక", "కాలవలో పడ్డ కుక్క" - ఇవి రెండూ మొదటి వార్తలు.

ఒక రోజు సాయంత్రం ఆ ఊరిలోని సినిమా హాలులో గొడవ జరిగింది. కొంతసేపటికి గ్రంథాలయానికి వచ్చిన పిల్లలు పత్రికలో ఆ గొడవ గురించి చదివి చాలా ఆశ్చర్యపోయారు. ఆ రోజు నుండి పిల్లలు ఆ పత్రికలో అన్ని రకాల వార్తలు రాయడం మొదలుపెట్టారు. వారి ఆటపాటలు, సెలవులు, వారి కలలు, సమస్యల గురించి రాయసాగారు.

తొందరలోనే ఈ పత్రిక 'చిన్నారి పక్షులు' అనే పేరుతో ముద్రించబడింది. 1989-90లో ఈ పత్రిక దాదాపు 1000 కాపీలు ముద్రించారు. దీనిని పిల్లలు 25 పైసలకి కొనుక్కునేవారు. తమ బడుల్లోని లోటుపాట్లని ఈ పత్రిక ద్వారా పిల్లలు ఎత్తిచూపడం మొదలుపెట్టారు. బడికిరాని మాష్టారు, తరగతిలో నిద్రపోయే మాష్టారు, డబ్బులు ఇవ్వకుండా పిల్లలతో కూరగాయలు తెప్పించుకునే హెడ్మాష్టరు వంటి వారందరి గురించి పిల్లలు ఈ పత్రికలో రాశారు. ఈ వార్తల మూలంగా పిల్లలు అప్పుడప్పుడు దెబ్బలు తినాల్సి వచ్చేది. అయితే ఈ పత్రిక పట్ల ప్రజల ఆసక్తి పెరుగుతూనే ఉంది. చాలామంది పిల్లలు వారి మాతృభాష అయిన 'బుందేలీ'లో వార్తలు రాసేవారు. వారి తల్లితండ్రులకి ఈ వార్తలని చదివి వినిపించే వారు. మీ బడిలో ఒక పెద్ద బూడిదరంగు కాగితాన్ని అతికించి మీరు కూడా ఇటువంటి పత్రికని తేలికగా మొదలుపెట్టవచ్చు. రాయడానికి, బొమ్మలు గీయడానికి పిల్లలని ప్రోత్సహించవచ్చు. ఈ విధంగా వారి అనుభవాల గురించి పిల్లలు రాసినప్పుడు వారి రచనా శక్తి పెరుగుతుంది. వారి చుట్టూ జరిగే విషయాలని క్షుణ్ణంగా పరిశీలించడం పిల్లలు నేర్చుకుంటారు. పిల్లలలో దాగి

ఉన్న ప్రతిభని బయటికి తీయడానికి ఇటువంటి పత్రికలు ఒక మంచి మార్గం. ✪

ఇసుక రేణువు

తెలుగు, హిందీ, ఉర్దూ వంటి భాషలు నేర్చుకోవాలంటే ముందు వాటి అక్షరాలు నేర్చుకోవాలి. అలాగే ప్రకృతిలోని వర్ణమాల నేర్చుకోవాలి. ప్రకృతిని చదవడం ప్రతి ఒక్కరికి ఎంతో కొంత వచ్చే ఉంటుంది.

మీకు కనిపించిన గుండ్రటి, నున్నటి రాయి మీకేం చెబుతుంది? అది అంత నున్నగా, గుండ్రంగా ఎలా తయారయ్యింది? దాని గరుకుదనం, అంచులు ఏమయ్యాయి? ఏదైనా ఒక రాయిని విరగ్గొడితే దాని ముక్కలు ఎగుడు దిగుడుగా, గరుకుగా ఉంటాయి. ఆ రాళ్లు చూడటానికి అస్సలు గుండ్రంగా, నున్నగా ఉండవు. మరి అటువంటి రాయి ఇంత నున్నగా, గుండ్రంగా ఎలా అయింది?

ఒకవేళ మీరు కళ్లు, చెవులు తెరుచుకుని చూడగలిగితే, విన గలిగితే ఈ రాయి తన ఆత్మకథని మీకు చెబుతుంది. కోట్ల సంవత్సరాల క్రితం అది కూడా ఇప్పుడు మీరు పగలగొట్టిన రాయి లాగానే గరుకుగా, కొనదేరిన అంచులతో

ఉండేది. అది ఏదో ఒక కొండ మీద ఉండేది. జోరుగా కురిసిన వాన దానిని సెలయేరులోకి తోసింది. ఆ సెలయేరు దానిని ఒక ఉపనదిలోకి తీసుకునివెళ్ళింది. ఉపనది దానిని పెద్ద నదిలో కలిపింది. అప్పటి నుంచి ఆ రాయి నదిలోని నీళ్లతోపాటే ప్రవహించింది. దాని అంచులు అరిగిపోయి ఆ రాయి గుండ్రంగా, నున్నగా తయారయింది.

అదే మీరిప్పుడు చూసే నున్నటి, మెరిసే రాయి. నదిలో అలా ప్రవహిస్తూ ఉంటే క్రమంగా ఆ రాయి చిన్నదిగా అయిపోతుంది. ఆఖరికి ఇసుక రేణువుగా మిగిలిపోతుంది. ఈ ఇసుకతోనే పిల్లలు ఆడుకుంటారు, కోటలు కడతారు. ప్రకృతి అందరికంటే గొప్ప టీచరు.

– జవహర్ లాల్ నెహ్రూ

✪

విజ్ఞాన శాస్త్రం

మామూలుగా విజ్ఞాన శాస్త్రం అంటే పిల్లలు కొన్ని సూత్రాలు, మరికొన్ని సంకేతాలు బట్టీపట్టి పరీక్షల్లో రాయడం వరకే పరిమితం అవుతుంది. కానీ నిజానికి ఈ శాస్త్రానికి ప్రజల జీవితంతో దగ్గరి సంబంధం ఉండాలి.

ఆంధ్ర ప్రదేశ్‌లోని ఒక పాఠశాలకి చెందిన టీచరు ఒక వినూత్న ప్రయోగాన్ని చేశారు. పిల్లల సహాయంతో ఇనుపతీగని గుండ్రంగా చుట్టి దానికి దోమతెరని కట్టి ఒక సంచిలాగా తయారుచేశారు. దానికి ఒక వెదురు కట్టెను పిడిగా అమర్చారు. పురుగులను పట్టుకోవడానికి అనువుగా అది తయారయింది. పిల్లలందరికి తలొక 'నెట్' తయారు చేశారు.

పిల్లలందరికి తలా కొంత పొలాన్ని కేటాయించారు. ప్రతి రోజు ఉదయం బడికి వచ్చేముందు తమకి కేటాయించిన పొలానికి వెళ్లి ఆ జాలీలో చిక్కిన పురుగులను పిల్లలు బడికి తీసుకుని వచ్చేవారు.

బడిలో పిల్లలు ఈ పురుగులను వర్గీకరించేవారు. వాటి పేర్లు, మిగతా వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేసేవారు. ఈ పురుగులలో ఏవి పైరుకి మిత్రులు, ఏవి పైరుకి శత్రువులు అనే విషయం మీద చర్చ జరిగేది. అనుభవం

గల రైతులని కూడా అడిగి తెలుసు కునేవారు. పిల్లలు ప్రతి రోజు పురుగులని లెక్కబెట్టి వాటి గ్రాఫు తయారు చేసేవారు. దీనివల్ల పురుగుల సంఖ్యలో పెరుగుదల గురించి స్పష్టమైన అవగాహన లభించేది. ఎక్కువ పురుగులు ఎప్పుడు ఉన్నాయి? క్రిమి సంహారక మందులు చల్లడానికి ఎప్పుడు అనువైన సమయం? ఏ రసాయనిక మందుల వల్ల పైరుకి మిత్రులైన పురుగులు కూడా నశిస్తున్నాయా? వేపాకు కషాయం, పొగాకు కషాయం వంటివి పని చేస్తాయా?

పిల్లలు ఈ ప్రశ్నలన్నింటి గురించి చర్చించేవారు. కొత్త కొత్త ప్రయోగాలు చేసేవారు. అన్ని విషయాలు తెలుసుకునేవారు. ఈ విజ్ఞానం పిల్లలకి ఇష్టంగాను, ఉపయోగకరంగాను ఉండేది.

✪

పార్క్ స్కూల్

కొన్ని దశాబ్దాల క్రితం వరకు బడుల్లో పిల్లలని బాగా కొట్టేవారు. ఇప్పుడు దీనిలో కొంత మార్పు వచ్చింది. పిల్లలకి అనుగుణంగా చదువు మారింది. ఎన్నో ప్రగతిశీల విద్యాలయాలు తెరిచారు. పిల్లల మెదడులో జ్ఞానాన్ని నింపడం కాకుండా పిల్లలకు సంపూర్ణ వికాసం మీద ఈ బడులలోని అధ్యాపకులు దృష్టి పెడతారు.

పిల్లలకి మాట్లాడటం ఎవరూ నేర్పించరు. పిల్లలు తమంతట తామే మాట్లాడటం నేర్చుకుంటారు. బహుశా పిల్లలు మిగతా విషయాలలో నైపుణ్యం కూడా ఇలాగే పొందగలరేమో? ఇంగ్లాండులో 'పార్క్ స్కూల్' అనే ఒక బడి ఉంది. ఇక్కడ పదకొండు సంవత్సరాల లోపు పిల్లలు చదువుకుంటారు. ఈ పిల్లలు ఆనందంగా ఉంటారు. వారి చురుకైన మెదడు ఎల్లప్పుడూ కొత్త విషయాల కోసం వెతుకుతూ ఉంటుంది. ఈ బడిలోని టీచర్లు ఎంతో నైపుణ్యం కలిగి ఉంటారు. పిల్లల్ని ఎంతగానో ప్రేమిస్తారు. వీరి లీడరు క్రిస్ నికోల్ ఇలా అంటారు: "పిల్లలందరు ఆనందకరమైన బాల్యాన్ని పొందాలి. పరిశీలించి తెలుసుకోవడానికి ఇక్కడి పిల్లలకు పూర్తి స్వాతంత్రం ఉంది. స్వేచ్ఛగల పిల్లలు ఎల్లప్పుడు కొత్త విషయాల కోసం వెతుకుతుంటారు. వీరు ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి ఉత్సాహం చూపిస్తారు. ఈ మారుతున్న ప్రపంచంలో వారి స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉంటారు." అనుభవం గల మార్గదర్శకునిగా టీచరు వ్యవహరించాలి. నేర్చుకోవాలి అన్న కోరికను పిల్లలు కోల్పోయేలా టీచర్లు అడ్డంకులు కల్పించకూడదు. మామూలు బడులలోని విధానాలతో ఎంతో మంది పిల్లలకు గణితం పట్ల, శారీరక వ్యాయామం పట్ల ద్వేషం కలిగింది. చదువుని పిల్లలకి అనుగుణంగా చేయడానికని మామూలు బడుల కంటే భిన్నంగా పార్క్ స్కూల్లో పని చేస్తారు. ఈ బడి వాతావరణం చాలా సహజంగా ఉంటుంది. పిల్లలు ఎంతో సంతోషంగా ఉంటారు. టీచర్లని వారి పేర్లతోనే పిల్లలు పిలుస్తారు. బడి పిల్లలకి యూనిఫారం ఉండదు. ఇక్కడ అన్ని వయస్సుల పిల్లలు కలసి ఆడుకుంటారు. ఆట వస్తువులు చాలా ఉన్నాయి. అక్కడున్న కూరగాయల తోటని పూర్తిగా పిల్లలే చూసుకుంటారు.

✪

నీల్‌బాగ్ డేవిడ్



ఎస్. ఆనందలక్ష్మి
రోజాలిండ్ విల్సన్

అనువాదం : టి. నరసింహులు

1.	పిల్లల పూదోట - నీల్‌బాగ్	(అరవింద గుప్త)	51
2.	ఒక మంచి ఉపాధ్యాయుని ప్రయోగాలు	(ఎస్. ఆనందలక్ష్మి ది హిందూ దినపత్రికలో 1997 సెప్టెంబరు 14, 21 తారీకులలో ప్రచురితమైన వ్యాసం)	54
3.	పాఠశాల విద్య - ఒక కొత్త దృష్టి కోణం	(డేవిడ్ హార్స్‌బరోతో రోజాలిండ్ విల్సన్ ఇంటర్వ్యూ ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్ క్వార్టర్లీ 10వ సంచిక, 1వ సంపుటి, 1983లో ప్రచురితం)	64

పిల్లల పూదోట - నీల్‌బాగ్

పిల్లలకు స్కూళ్లు జైళ్ల లాంటివి. నిజం చెప్పాలంటే బడికి వెళ్లడానికి పిల్లలు బొత్తిగా ఇష్టపడరు. కాని తల్లిదండ్రులు వారిని బడులలోకి బలవంతంగా నెడుతూ ఉంటారు. బడికి వెళ్లడం లేదా మానేయడం అన్న నిర్ణయం పిల్లల చేతుల్లో లేదు. ప్రభుత్వం నేడు పల్లె-పల్లెలో బడులు ప్రారంభిస్తోంది. కాని ఈ బోర్ కొట్టించే బడులకు వెళ్లడం కన్నా బయట ప్రపంచంలోనే పిల్లలు ఎక్కువగా మజా చేస్తుంటారు.

నా జీవితంలో 1200కు పైగా బడులను చూసే అవకాశం దొరికింది. వాటిల్లో నీల్‌బాగ్ చాలా అరుదైనది. దాని జ్ఞాపకాల సువాసనలు ఇంకా నన్ను అంటి పెట్టుకుని ఉన్నాయి. వేరువేరు పనులపై మూడు సార్లు ఈ బడిని చూశాను. ఆ జ్ఞాపకాలు నా మదిలో నేటికీ తాజాగా ఉన్నాయి.

నీల్‌బాగ్ పల్లె పిల్లల కోసం ఉద్దేశించినది. బహుశా ప్రపంచంలోకెల్లా తమ బడి చాలా ఆసక్తికరమైన ప్రదేశం అయినందు వల్ల పిల్లలు ఇక్కడకు ఆనందంగా వస్తూ ఉంటారు. బడి మొదలు కావడానికి గంట ముందే పిల్లలు వచ్చి తమ స్థానాల్లో కూర్చుని ఉంటారు. పిల్లలు తమ గ్రామాలలోనే ఉండాలని డేవిడ్ (డేవిడ్ హార్స్‌బరో, 1923-1984) కోరిక. బహుశా అందుకేనేమో ఆయన పిల్లల కోసం నీల్‌బాగ్ హాస్టలు తెరవ లేదు. హాస్టలులో ఉన్నట్లైతే పిల్లలు పల్లెకు దూరం అయ్యే అవకాశం ఉంది. సాయంత్రం బడి అయిన తరవాత కూడా పిల్లలు ఇంటికి వెళ్లేవారు కాదు. వాళ్లు బడిలోనే ఉండేవారు. చాలా రాత్రైన తరవాత డేవిడ్ వాళ్లను ప్రేమగా, “పగలంతా నా మెదడు తినేశారు. కనీసం ఇప్పుడైనా ప్రశాంతంగా ఉండనివ్వండిరా బడుద్ధాయిల్లారా,” అని మందలించే వారు. ఆ తరవాత ప్రైడ్- పైపర్‌లా పాట పాడుతూ ఆ చీకటిలోనే పిల్లలను గ్రామం వరకు తీసుకుని వెళ్లి విడిచి వచ్చేవాడు డేవిడ్.

నీల్‌బాగ్ బడి ఒక పొడవాటి గదిలో నడుస్తుండేది. గదిలోని ఒక గోడకు

రాళ్లతో చేసిన, తలుపు లేని అలమరా ఉంది. అలమర అరలలో రకరకాల పుస్తకాలు, ఇతర శిక్షణ సామగ్రి ఉన్నాయి. దీనిలో చాలా వరకు పిల్లలు, అధ్యాపకులు తయారు చేసినవే. ఒకటి నుండి 10వ తరగతి వరకు పిల్లలు ఒకే చోట చదువుకుంటూ ఉండేవారు. తరగతిలో ఎటువంటి ఉపన్యాసం (లెక్చర్) ఉండేది కాదు. తమ స్థాయికి తగిన భిన్న-భిన్న విషయాలకు సంబంధించిన పుస్తకాలను పిల్లలు ఎంపిక చేసుకుని వాటిని తమకు నచ్చిన రీతిలో చదువుతూ ఉండేవారు. ఏదైనా పుస్తకం చదవడం పూర్తయిన తరవాత అదే విషయానికి సంబంధించిన ఇంకో పుస్తకం అర నుండి తీసుకుని పని మొదలు పెడతారు. ఏదైనా కుటుంబంలో పెద్ద పిల్లలు తమ తమ్ముళ్లు, చెల్లెళ్లకు ఏ విధంగా నేర్పిస్తారో బడిలో కూడా అదే విధంగా ఉంటుంది. ఒక వేళ ఎవరైనా పిల్లవాళ్లకు అర్థం కానపుడు వారు తమ కంటే పెద్ద పిల్లల నుంచి ఆ విషయం గురించి తెలుసుకుంటారు. వాస్తవానికి తరగతిలో పిల్లలకు సహాయం చేయడం కోసం ఎవరో ఒక అధ్యాపకుడు ఉండే ఉంటాడు. తమకు నచ్చిన రీతిలో చదువుకునే స్వేచ్ఛ పిల్లలకు ఉంది. ఇక్కడ ఏదైనా పిల్లవాడికి ఒక సమయంలో మూడవ తరగతి తెలుగు, ఎనిమిదవ తరగతి గణితం, ఆరవ తరగతి ఇంగ్లీషు చదివేందుకు వీలుండేది.

నీలాబాగ్ ఒక విలక్షణమైన బడి. ఇక్కడ గ్రామీణ ప్రాంత పిల్లలకు కన్నడ, తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీషు భాషలు తెలుసు. ప్రపంచంలోని 10 భాషలకు చెందిన 150 పాటలు ఈ బడి పిల్లలు పాడగలరు. వీరి అభివ్యక్తి, ఆత్మ విశ్వాసం రెండూ చూడదగ్గవి. ఎపుడైనా, ఎవరైనా అతిథి నీల్‌బాగ్ సందర్శించినప్పుడు పిల్లలు వారిని పాటలు పాడమని అభ్యర్థిస్తారు. కనీసం రెండు పాటలైనా పాడకుండా అతిథులను వారు అక్కడ నుంచి వెళ్లనివ్వరు. ఈ పిల్లల్లో ఎంతో మంది తరవాత డాక్టర్లు, ఇంజనీర్లు అయ్యారు. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత గ్రామీణ ప్రాంత పిల్లలకు ప్రపంచ స్థాయి విద్యను అందించే క్రమంలో నీల్‌బాగ్ ప్రయత్నం అద్భుతమైనది. గ్రామీణ పిల్లల్లో కూడా అద్భుతమైన ప్రతిభ ఉందనే విషయం ఈ ప్రయోగం చాలా స్పష్టంగా నిరూపిస్తుంది. సరైన అవకాశం, పరిస్థితులు అందుబాటులోకి తీసుకువస్తే విద్యలో ప్రపంచంలో ఎవరికీ

వాళ్లు తీసిపోరు.

నీల్‌బాగ్ బడిని డేవిడ్ ప్రారంభించారు. 1984 సంవత్సరంలో ఆయన చనిపోయిన తరవాత బహుశా నీల్‌బాగ్ ఆత్మ కూడా అంతరించిపోయిందని అనిపిస్తుంది. డేవిడ్ తరవాత ఆయన కొడుకు నికోలస్, భార్య డోరిన్ రెండు మూడేళ్లు నీల్‌బాగ్‌ను ఆపారు. కాని చివరకు వాళ్లు ఈ బడిని కృష్ణమూర్తి ఫౌండేషన్‌కు ఏడులక్షల రూపాయలకు అమ్మి తిరిగి ఇంగ్లండు వెళ్లిపోయారు. కృష్ణమూర్తి ఫౌండేషన్ వారు నీల్‌బాగ్ వైభవాన్ని పునరుద్ధరించడానికి ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ వారు విజయం సాధించలేకపోయారు. వారు డేవిడ్‌కు ఎటువంటి ప్రత్యామ్నాయం కనుక్కోలేకపోయారు. డేవిడ్ వ్యక్తిగత పుస్తక సంకలనం చాలా అద్భుతమైనది. ప్రపంచానికి సంబంధించిన అన్ని విషయాలపై దాదాపు 7000 వరకు ఎంపిక చేసిన పుస్తకాలు ఆయన దగ్గర ఉండేవి.

డేవిడ్ తనకు నచ్చిన విధంగానే జీవితం గడిపాడు. ఆయన ఒక అద్భుత ప్రతిభా సంపన్నుడు. డేవిడ్ తన చిరకాల స్వప్నమైన నీల్‌బాగ్‌ను నడపగలగడానికి కారణం బహుశా, డబ్బు కోసం ఆయన ఎవరినీ యాచించకపోవడమే. డేవిడ్, నికొలస్‌లు కలసి రాసిన వందకు పైగా పుస్తకాలలో చాలా వాటిని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్, ఓరియంట్ లాంగ్‌మెన్ లాంటి సంస్థలు ప్రచురించాయి. ప్రతి సంవత్సరం ఈ పుస్తకాలపై వారికి భారీ రాయల్టీ లభిస్తుండేది. ఈ రాయల్టీతో బడి ఖర్చులు చాలా వరకు జరిగేవి. ఈనాటికీ నీల్‌బాగ్ ట్రస్ట్‌కు వస్తున్న రాయల్టీతో ఎన్నో బడులకు సహాయం అందుతోంది.

ఈ మధ్యనే కొన్ని సంవత్సరాల క్రితం కృష్ణమూర్తి ఫౌండేషన్ వారు నీల్‌బాగ్‌ను బెంగుళూర్‌కు చెందిన ఒక సంస్థకు అప్పగించారు. ఈ సంస్థ వికలాంగులకు సంబంధించిన సహాయ కార్యక్రమాలలో పాలుపంచుకుంటోంది.

- అరవింద గుప్త

ఒక మంచి ఉపాధ్యాయుని ప్రయోగాలు

గడచిన దశకంలో బడికి వెళ్లే వయసు ఉన్న పిల్లలందరినీ బడిలో చేర్చడానికి విస్తృత ప్రచారం జరిగింది. 'అందరికీ చదువు' అనే ప్రభుత్వ నినాదాలను కూడా ఈ ప్రచారంలో భాగంగా వాడుకున్నారు. పిల్లలందరికీ తప్పనిసరిగా అక్షర జ్ఞానం, గణిత జ్ఞానం, వృత్తిపరమైన దక్షత అందించాలనే ప్రయత్నానికి పెద్ద ఎత్తున ప్రజా మద్దతు లభించింది. 'అందరికీ విద్య అందుబాటులో ఉండాలి' అనే విషయంలో అందరిదీ ఏకాభిప్రాయమే అయినప్పటికీ దీనిని అమలుపరిచే విధానాలలో చాలామందికి అభిప్రాయ బేధాలున్నాయి.

ప్రస్తుతం ఉన్న అన్ని పాఠ్య ప్రణాళికలు గ్రామీణ విద్యార్థుల దృష్టిలో చాలా వరకు పరిచయం లేని (పరాయి), అసందర్భమైన, ఉపయోగంలేనివనే అభిప్రాయం ఉంది. వాళ్లు చదివే పుస్తకాలు, లేదా వాళ్లను ఏదైనా వ్యాసం రాయమన్నప్పుడు వారి జీవిత అనుభవాలు ఎక్కడా ప్రతిబింబించవు. ఇటువంటి పరిస్థితుల్లో గ్రామీణ పిల్లలు ప్రాథమిక స్థాయి పరీక్ష ఉత్తీర్ణులై మొదటి గండం గట్టెక్కినప్పుడు తమ కుటుంబం నుండి, సమాజం నుండి వేరుపడిపోతారు. చాలా మంది అధ్యాపకులు నగర వాసులైనందున గ్రామీణ పిల్లల పట్ల వారిలో ప్రేమ, వాత్సల్యం, ఆదర భావాలు ఉండవు. ఇటువంటి స్థితిలో గ్రామీణ విద్యార్థుల విద్యా అనుభవాలు ఆనందంగా ఉండే అవకాశాలు చాలా తక్కువ. గ్రామీణ విద్యాలయాల కోసం పాఠ్య ప్రణాళికలు రూపొందిస్తున్నపుడు వారి రోజువారీ జీవితంలో పనికొచ్చే సామెతలను ఉపయోగించాల్సి ఉంటుంది. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఉంటూనే మెరుగైన జీవితాన్వేషణకు అవసరమైన యోగ్యతలను వారిలో పెంపొందించాలి.

పిల్లలకు రోజువారీ జీవితంలో అర్థం కాని విషయాలను తెలియజేయడం విద్య ప్రాథమిక ఉద్దేశమనే దృక్పథం ఒకటి ఉంది. తక్కువ వసతులు, అవకాశాలు ఉన్న గ్రామీణ విద్యార్థిని ముందుకు తీసుకుపోవడంలో సహాయం చేకూర్చేదిగా చదువు ఉండాలి. సౌకర్యాలు ఉన్న, లేని విద్యార్థులకు సమాన అవకాశాన్ని

కలిగించేదిగా విద్య ఉండాలని ఈ ఆలోచనను సమర్థించే వాళ్ల అభిప్రాయం. మంచి విద్య ద్వారానే సమాజంలో వ్యాపించి ఉన్న అసమానతల నుండి ముక్తిని పొందగలం. డేవిడ్ హార్స్‌బరో నడిపిన నీల్‌బాగ్ ఈ ఉద్దేశానికి అంకితమైంది. ఇటువంటి స్థితిలో సెప్టెంబర్ 5 అధ్యాపక దినం సందర్భంగా అనన్య సామాన్యుడైన అధ్యాపకుడు ఈ డేవిడ్ హార్స్‌బరోను స్మరించడం కన్నా గొప్ప విషయం ఏముంటుంది?

డేవిడ్ హార్స్‌బరో చనిపోయి 14 సంవత్సరాలు గడిచిపోయాయి (1984లో డేవిడ్ చనిపోయారు). ఆయన పేరు, గొప్పతనాలను మరచిపోవడం అంత సులభం కాదు. 'ఇన్ని సంవత్సరాల తరవాత కూడా ఎవరైనా డేవిడ్ విద్య గురించి కాల్పనిక తర్కం చేయగలరా?' అని నన్ను నేనే ప్రశ్నించుకుంటుంటాను. కాని ఇది కేవలం మాటల గారడీ మాత్రమేనని నాకు తెలుసు. దీని జవాబు నా దగ్గర ఎప్పటి నుంచో ఉంది.

డేవిడ్ హార్స్‌బరో అత్యుత్సాహం నిండిన పట్టుదల, సృజనాత్మకత, చాతుర్యం గల అద్భుత వ్యక్తి. అధ్యాపన పట్ల విపరీతమైన మోజు ఉన్నప్పటికీ ప్రస్తుతం భారత దేశంలో ఉన్న అన్ని విద్యావిధానాలపై ఆయనకు నిరాశ ఎదురయ్యింది. ఈ నిరాశాపూరిత స్థితే నీల్‌బాగ్ గురించి ఆలోచించడానికి, దానికి సాకారం చేసే దిశగా ముందడుగు వేయటానికి ఆయనను ప్రోత్సహించింది. ఈ బడికి మూల సిద్ధాంతాన్ని, విశిష్ట రూపాన్ని ఇచ్చింది సాటిలేని డేవిడ్ హార్స్‌బరో వ్యక్తిత్వమే.



విభిన్న సందర్భాలను అర్థం చేసుకోడానికి డేవిడ్ జీవిత సంక్షిప్త సమాచారం సహాయ పడుతుంది. డేవిడ్ హార్స్‌బరో పుట్టుకతో బ్రిటిష్ జాతీయుడు, వర్ణం ప్రకారం భారతీయుడు, స్వభావరీత్యా ప్రపంచ పౌరుడు. 40వ దశకంలో హైస్కూల్ చదువు పూర్తి చేసిన తరవాత, రెండవ ప్రపంచ యుద్ధం చివరి దశలో డేవిడ్ రాయల్ వైమానిక దళానికి

ఎంపిక అయి భారత దేశం వచ్చాడు. అప్పట్లో ఆయన భారత్‌లో ఇప్పటి బంగ్లాదేశ్ ప్రాంతంలో ఉండేవాడు. భారత గ్రామీణ జీవనం, ప్రజలు, సంగీతం పట్ల ఆయన ప్రేమానురాగాలు ఆగస్టు 1984లో ఆయన చనిపోయే వరకు కొనసాగాయి.

యుద్ధం ముగిసిన తరవాత డేవిడ్ లండన్ విశ్వవిద్యాలయంలోని భారతీయ చరిత్ర, సంస్కృతికి సంబంధించిన చదువులో ప్రవేశం పొందాడు. భారత దేశం తిరిగి రావాలన్న తన లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని సంస్కృతం, హిందీ, ఉర్దూ భాషలను నేర్చుకున్నాడు. లండన్ విశ్వవిద్యాలయం నుండి పట్టా పొందిన తరవాత డేవిడ్ తిరిగి భారత దేశం వచ్చాడు. అధ్యాపకుడు కావాలని ఆయనకున్న ప్రబలమైన కోరిక ఆయన్ని జిడ్డు కృష్ణమూర్తి స్థాపించిన రుషి వ్యాలీ స్కూల్ వైపు నెట్టింది. కొన్ని సంవత్సరాలు అక్కడ పని చేసిన తరవాత నీలగిరి, మౌంటేన్ తదితర బడులకు డేవిడ్ వెళ్లాడు. తరవాత మైసూర్ వచ్చి క్షేత్రీయ ఆంగ్ల మహా విద్యాలయాన్ని స్థాపించడమే కాక కొంతకాలం పాటు దాని అత్యున్నత బాధ్యతలను కూడా చేపట్టాడు.

తరవాత ఆయన ఇంగ్లిష్‌ను ద్వితీయ భాషగా బోధించాలనే బ్రిటిష్ కౌన్సిల్ లోని దళంలో చేరాడు. ఈ దళంలో ఈయనకు మద్రాసు కార్పొరేషన్‌లోని ఒక బడిలో పేద పిల్లలకు పుస్తకాలు తయారు చేసే బాధ్యత అప్పగించారు. ఇక్కడ ఆయనకు భారతీయ విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా పుస్తకాలను, కార్య-పుస్తకాల (వర్క్ బుక్స్)ను తయారు చేసే అవకాశం లభించింది. నిరాడంబరత, చలోక్తులతో కూడిన ఆయన స్వభావం ఈ పుస్తకాల్లోని ప్రతి పేజీలోనూ గమనించవచ్చు. అంతేగాక ఆయన వేసిన బొమ్మల కారణంగానే ఈ పుస్తకాలు పిల్లలందరికీ అత్యంత ప్రీతి పాత్రమయ్యాయి.

బ్రిటిష్ హై కమిషన్ అంగమైన బ్రిటిష్ కౌన్సిల్‌లో ట్రాన్స్‌ఫర్‌కు సంబంధించి ఒక నియమం ఉంది. ఈ నియమంలో భాగంగా ఏ వ్యక్తి అయినా ఒకేచోట 15 సంవత్సరాలు మాత్రమే ఉండాలి. తరవాత నియామకం కోసం భారత్ వదిలిపెట్టాల్సి వచ్చినప్పుడు డేవిడ్ వాలంటరీ రిటైర్మెంట్ తీసుకోవడమే మేలని భావించాడు. కర్నాటకలోని కోలారు జిల్లాలో ఎనిమిది ఎకరాల స్థలం తీసుకుని

తన చిరకాల స్వప్నమైన నీల్‌బాగ్‌ను సాకారం చేసే ప్రయత్నాలు ప్రారంభించాడు. డేవిడ్ హార్స్‌బరో చేసిన నీల్‌బాగ్ ప్రయోగం కొత్త పంథాలో నడిచే ఆయన జీవిత కథ లాంటిదే. స్వతంత్ర భారతంలో గ్రామీణ విద్యార్థులకు ప్రపంచస్థాయి, నాణ్యమైన విద్యను అందించడంలో బహుశా ఇదే మొదటి ప్రయత్నమేమో!

డేవిడ్ ఒక సంపూర్ణ వ్యక్తి. పని, జీవన శైలి, గీతాలు, బోధన మొదలైన అన్ని విషయాలలో ఆయన తత్వం కనిపిస్తుంది. ఈ విషయాలన్నీ ఒక దానికొకటి ముడిపడి ఉన్నాయి. నీల్‌బాగ్ ప్రారంభించిన తరవాత ఆయన 'ఒకవేళ నేను అలా చేయ గలిగి ఉంటే' అనే ఆలోచనను వదిలిపెట్టాడు.

తాను చేయాలని అనుకున్నదే చేయడం మొదలు పెట్టాడు. తన అద్భుత ప్రతిభ ఆధారంగా ఆయన ఎన్నో విషయాలను చాలా గొప్ప రీతిలో చేసి చూపించాడు.

అన్నిటికంటే ముందు మొక్కలు నాటాడు. తరవాత వాటి చుట్టూ స్వయంగా తయారు చేసిన డిజైన్‌తో లారీ బేకర్ సలహాలతో గుడిసెలు కట్టాడు. స్వయంగా డేవిడ్ పనితనం గల వడ్రంగి. తరగతుల కోసం గదులు, కార్యశాల డిజైన్ తయారు చేయడమేగాక వాటి నిర్మాణంలో కూడా పాల్గొనేవాడు. మిగిలిన భవనాలను పాఠ్యక్రమంలో భాగంగా కట్టారు. కొద్ది నెలల తరవాత పిల్లలు ఆ ప్రాంతంలో సాంప్రదాయమైన గుండ్రని గదులు కట్టారు.

నీలాబాగ్ భావన (concept), అధ్యయనం, అవలోకనం, ఆలోచనలు, శిక్షా వ్యూహం అన్నీ డేవిడ్ దీర్ఘకాల అనుభవాలను వడపోత పోసుకుని రూపుదిద్దుకున్నాయి. నీల్‌బాగ్‌ను సందర్శించే వాళ్లు తరచుగా మిగతా వాటికంటే బడి ఏ విధంగా భిన్నమైంది, ఈ బడి తత్వం ఏమిటి, అలాగే నీల్‌బాగ్ సిద్ధాంతాన్ని ఇతర బడులలో ఇదే రూపంలో అమలుపరచ వచ్చా వంటి ప్రశ్నలు అడుగుతూ ఉంటారు. వీటికి డేవిడ్ స్వయంగా ఉత్సాహం, ఛలోక్తులతో సమాధానం ఇస్తూ ఉండేవాడు.

1980వ సంవత్సరంలో ఒక పని దినం. నేను ఉదయం 9 గంటలకు నీల్‌బాగ్ చేరుకున్నాను. రెల్లుగడ్డి కప్పిన ఒక గుడిసె (ఇందులో 3 నుండి 18 సంవత్సరాల వయస్సు గల 25 మంది విద్యార్థులు ఒకేసారి కూర్చోవచ్చు)లో

ఒక స్వచ్ఛమైన వాతావరణంలో చాలా మధురమైన స్వరంలో కొంత మంది పాడుతూ ఉన్నారు. ముందు డేవిడ్ పాడుతూ ఉండగా ముగ్గురు అధ్యాపకులు ఆయనను అనుసరిస్తున్నారు. ఈ పాటల్లో అదరగొట్టే ఒక వైవిధ్యం ఉంది. గుజరాతీ భజనలు, అస్సామీ నావికుల గీతాలు, కేరళ మత్స్యకారుల సంగీతం, ఇంగ్లిష్ ప్రేమ గీతాలు, ఫ్రెంచ్, జర్మన్ జానపద గేయాల తోపాటు తెలుగు భక్తి సంగీతం లాంటివి అన్నీ ఒకేలా ప్రభావితమై ఉన్నాయి. ఇక్కడ మిగిలిన బడులలో లాగా ఏ ఒక్క పిల్లవాడు తన ఒక్కడి గొంతే పెద్దగా వినిపించే ప్రయత్నం చేయటం లేదు. ప్రతి ఒక్కరూ ఒకే లయ, ఒకే స్వరంతో ఇతరుల స్వరంలో కలిసిపోయి పాడుతున్నారు.

ఇక్కడ ప్రతి రోజూ ఉదయం ఒక గంట సంగీతం ఉంటుంది. ఇందులో అందరు పిల్లలు ఒకేచోట ఉంటారు. దీని వల్ల అందరికీ ఒకరితో ఒకరు స్నేహంగా మెలగడానికి అవకాశం లభిస్తుంది. ఎవరైనా పిల్లవాడు స్పష్టంగా పాడటానికి ముందు స్పష్టంగా వినడం నేర్చుకోవాలనేది డేవిడ్ అభిప్రాయం. ప్రశాంతత గొప్పతనం తెలుసు కోవడం ద్వారానే ఎవరైనా ధ్వని గొప్పతనాన్ని తెలుసుకోగలరనే విషయం పాఠ్యక్రమంలో కూడా పొందుపరిచారు. సంగీత జ్ఞానం ఉన్న ప్రతి ఆగంతకుడిని పిల్లలు కనీసం ఒక కొత్త పాటనైనా పాడమని ప్రాధేయపడటం వల్ల పాటల జాబితా పెరుగుతూ ఉంటుంది. సంగీతం తరవాత పిల్లలు స్వయంగా తామే అలమరాలలో ఉన్న పాఠ్యసామగ్రిని తీసుకుంటారు. పిల్లలే తమకు తాము లేదా తమకంటే పెద్దవారైన పిల్లల సహాయంతో చదివేందుకు, అర్థం చేసుకునేందుకు వీలుగా ఈ సామగ్రిని సరళంగా రూపొందించారు. అధ్యాపకులు పాఠం మొదలు పెట్టే వారుగా కాకుండా పిల్లలకు సహకారం అందించడానికీ, పని పట్ల ధ్యాస కలిగించడానికీ ఎల్లప్పుడు వారికి అందుబాటులో ఉంటారు.

తెలుగు, ఇంగ్లిష్‌లో తయారుచేసిన ఈ సామగ్రిలో ఎక్కువ భాగం పొడుపు కథలు, స్థానాలు, ఇతర ప్రక్రియలలో ముడిపడి ఉన్న పదకేళి ఉంటుంది. డేవిడ్, ఇతర అధ్యాపకులు బొమ్మలు వేసి వీటిని రాశారు. వీటిని తయారు చేయడంలో ఎంతో శ్రద్ధ తీసుకున్నారు. అంశాల క్లిష్టత ఆధారంగా వీటిని వర్గీకరిస్తారు. దీని కారణంగా పిల్లలు ప్రతి అభ్యాసాన్ని పూర్తి చేస్తూ ఒక నిశ్చిత మార్గంలో

ముందుకు వెళ్ల గలుగుతారు. సాధారణంగా పెద్ద పిల్లలకు మధ్యాహ్న భోజనం తరవాత గణిత తరగతులు ఉంటాయి. విద్యావిధానం ఆసక్తి రేకెత్తించేదిగా ఉంటే ఏ సమయమైనా నేర్చుకునేందుకు ఉపకరిస్తుందనే విషయం నిరూపించడానికి ఇలా చేస్తుంటారు.

బాల - బాలికలకు సంగీతం నేర్పించడం, దాన్ని క్యాసెట్ల ద్వారా వినిపించడం, మట్టిపని, కుమ్మరి చక్రంపై పాత్రలు తయారు చేయడం, వడ్రంగి పని చేయడం, వస్తువులను తయారుచేయడం, ఎంబ్రాయిడింగ్, క్రేయాన్లతో, రంగులతో చిత్రాలు వేయడం లాంటివి ప్రధానంగా నేర్పిస్తుంటారు. లింగ వివక్షత లేని ఈ పాఠ్యక్రమం ఒక అద్భుత నమూనా. ఇది మానసిక, శారీరక శ్రమల మధ్య అంతరాలను తొలగించే ప్రయత్నం చేస్తుంది. పాఠశాల కార్య ప్రణాళికలో చేతి పనులకు అతి ముఖ్యమైన స్థానం ఉంది. చేతితో పని చేయడం, దానిలో దక్షతను, అమోఘమైన నైపుణ్యాన్ని తీసుకు రావడం, ఒకసారి మట్టిని చేతిలోకి తీసుకున్న తరవాత ఒక కళాత్మక రూపాన్ని తయారు చేయాలనే పట్టుదల, చిన్న రంపం చేతిలో ఉన్నట్లయితే జాగ్రత్తగా కొయ్యను కోయడం మొదలైన వాటికి కూడా పాఠ్యక్రమంలో భాష లేదా గణితానికి ఇచ్చినట్లు ప్రాముఖ్యత నిచ్చారు.

విద్య కేవలం మస్తిష్కంలో జరిగే ప్రక్రియ మాత్రమేగాక అది మనిషి పూర్తి వ్యక్తిత్వానికి జన్మని ఇస్తుంది. సహ పాఠకులు, అధ్యాపకులతో స్నేహబలం ఆధారంగా ఆత్మ గౌరవం పెంపొందించుకునే అవకాశం లభించినప్పుడే పిల్లలకు అత్యుత్తమ విద్య లభించే అవకాశం ఉంటుంది. అధ్యాపకుడు, విద్యార్థి మధ్య ఇటువంటి అవగాహన, నమ్మకం ఏ కుటుంబం లోనైనా దొరకడం కష్టమే.

క్రమశిక్షణకు సంబంధించి తన దగ్గరకి ఎటువంటి సమస్యా రాదని దానికి కారణం క్రమశిక్షణ గురించి ఎప్పుడూ బలవంతం చేయకపోవడమేనని డేవిడ్ చెబుతూ ఉండేవారు. నీల్‌బాగ్‌లో ఎటువంటి నియమాలు లేవు. ఒక నియమావళి ఉండేది కాని దాన్ని పాటించాలని ఆదేశించరు. ఆచరణ ద్వారానే ఈ నియమాలను ఆదర్శంగా నిలిపేవారు. ఇందులో అధ్యాపకునికి ఎన్నో సవాళ్లు, బాధ్యతలు ఉంటాయి. శనివారం ఉదయం 11 గంటలకు బడిని పరిశుభ్రంగా

ఉంచాలనే నియమం ఉంది. ఇది అందరి విద్యార్థులు, అధ్యాపకుల ఉమ్మడి బాధ్యత. ప్రతి ఒక్కరికి పనిచేసే వంతు రావాలని అందరి మధ్య పనులు విభజించారు. అంతేగాక ఆ బాధ్యతలు మారుతూ ఉంటాయి. చీపురుతో ఊడ్చడం, ఉతకటం, చెత్తా - చెదారం కాల్చడం, బ్లాక్ బోర్డుపై నల్ల రంగు వేయడం లాంటి పనులన్నీ నిర్ణయించిన క్రమంలోనే జరుగుతాయి. శనివారం రోజు ఇక్కడ అందరూ చీమల దండులా తమ తమ పనులలో మునిగి పోతారు. డేవిడ్ తన లుంగీని మోకాళ్ల వరకు మడత పెట్టుకుని ఈల వేస్తూ, ఎక్కడైనా తన వంతు భాగం పని మిగిలి ఉంటే దాన్ని పూర్తి చేయడంలో నిమగ్నం అవుతారు.

మొత్తం మీద అక్కడ పనికిమాలిన, నీచమైన పని అంటూ ఏదీ లేదు. బడిలో ఏ పీరియడ్ కూడా విసుగు పుట్టించదు. అలాగే ఏ పాఠం కూడా ఉపయోగం లేనిది కాదు. చేయదలచిన ఏ పనినైనా పూర్తి పట్టుదల, మంచి పద్ధతిలో చేయాలనేది డేవిడ్ సిద్ధాంతం.

నీల్‌బాగ్ అమలుపరుస్తున్న మరో శాస్త్రీయ సిద్ధాంతం ఉంది. చాలా స్కూళ్లలో వయసు ప్రకారం తరగతులు ఉంటాయి. ఒకే వయస్సు ఉన్న పిల్లలను ఒకే గదిలో కూర్చుని చదివించడం తేలికగా ఉంటుందనే అభిప్రాయం ఉంది. కాని డేవిడ్‌కి ఇటువంటి బోధనా పద్ధతులపై నమ్మకం లేదు. నేర్చుకునేందుకు అనువైన వాతావరణం ఎంతో ముఖ్యమైనదని ఆయన చెబుతుంటారు. చాలా సార్లు ఆయన పిల్లలతో ఒంటరిగా మాట్లాడేవాడు. అలాగే పిల్లల బృందానికి అంతటికీ కలిపి పాఠాలు చెప్పేవాడు.

ఒకే గ్రూపులో అన్ని వయస్సుల వారిని కలిపినట్లయితే ఒకరి నుంచి ఇంకొకరు నేర్చుకునే లక్షణం పెరుగుతుందనీ, అలాగే వాళ్ల మధ్య స్పర్థలు తగ్గుతాయని ఆయన అభిప్రాయం. ప్రతిభ మెరుగుపడాలంటే పోటీ ఉండాలి అనే దానికి నీలాబాగ్ విద్యలో ఏ మాత్రం స్థానం లేదు. సమర్థులు కావాలనే కోరిక కలిగి ఉండటం, తరగతిలో ఇతరుల కంటే ముందుండాలనే కోరిక కలిగి ఉండటం రెండూ భిన్న విషయాలని చెబుతూ డేవిడ్ మొదటి విషయాన్నే సమర్థిస్తూ ఉండేవాడు.

నీలాబాగ్‌లో ఒకేసారి 30కి మించి పిల్లలు ఎప్పుడూ ఉండేవారు కాదు.

రాశి మీద డేవిడ్‌కు నమ్మకం లేదన్నది స్పష్టంగా తెలిసిందే. దీన్నే లక్ష్యంగా పెట్టుకుని ఆయన ఒకేసారి నలుగురు అధ్యాపకులకు శిక్షణ ఇచ్చే ఒక టీచర్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు.

వీరు శిక్షణ సమయంలో నీల్‌బాగ్ విద్యార్థులకు బోధించాల్సి ఉంటుంది. దీని అర్థం వారికి సిద్ధాంతాలు కాక పద్ధతులు మాత్రమే నేర్పిస్తారని కాదు. ప్రతి ఒక్కరూ విద్యా తత్వం, మనో విజ్ఞానం, విద్యకు సంబంధించిన ఎన్నో పనులు చేయాల్సి ఉంటుంది. వాటిలో వారు చదివిన పుస్తకాలను చర్చించడం ఒకటి. అధ్యాపకులు తమ ఆలోచనా ప్రక్రియ పెంచుకోవడానికి, జ్ఞానాన్ని పంచుకోడానికి సెమినార్లు, చర్చా గోష్ఠులు వంటి అనేక అవకాశాలు కల్పించే వారు.

అధ్యాపకులను ఆలోచింప చేయడమేకాక తమ జ్ఞాన పరిధులను అభివృద్ధి పరచుకునేందుకు ఇవన్నీ అవసరం. మొదట్లో శిక్షణా కాలం ఒక సంవత్సరంగా నిర్ణయించినప్పటికీ ఈ సిద్ధాంతాన్ని అవగాహన చేసుకోవడం, అన్ని పుస్తకాలను విమర్శనాత్మకంగా అధ్యయనం చేయడం, శిక్షణలో పరిపూర్ణ ఆత్మ విశ్వాసం, దక్షత కలిగి ఉండటానికి కనీసం రెండు సంవత్సరాలైనా ఉండాలని డేవిడ్ భావించారు.

కవిత్వం జీవితంలో అనివార్యమని, దీని వల్ల అంతర్ దృష్టి పదును ఎక్కుతుందని, ఇది మానవీయ ఆవేదనను విస్తృతపరుస్తుందని డేవిడ్ అభిప్రాయం.

విద్యాపరమైన సిద్ధాంతాల ఆధారంగా డేవిడ్ పిల్లలతో విలువైనదిగా భావించే ప్రతి విషయం గురించి చర్చిస్తుంటారు. వారంలో రెండు, మూడుసార్లు ఆయన

ఇంగ్లీష్ కవితలను, అప్పుడప్పుడూ స్వంత కవితలనూ వినిపిస్తూ ఉంటారు. సందర్భం వచ్చినపుడు సామెతల తళుకు - బెళుకుల (గూడార్థాల)ను వివరిస్తూ ఉంటారు. మెల్ల - మెల్లగా పిల్లలు స్వయంగా డేవిడ్ స్వంత లైబ్రరీ నుండి కవితలను ఎంపిక చేసుకుని చదువుతుంటారు. తరవాతి కాలంలో చాలా మంది పిల్లలు స్వయంగా ఇంగ్లీష్‌లో కవితలు రాయడం కూడా మొదలుపెట్టారు. చాలావరకు పిల్లల కవితలు స్పష్టంగానే ఉండేవి. పిల్లలు తమ అభిరుచికి తగ్గ విషయాల గురించి తెలుగులో కూడా రాస్తున్నప్పుడు తాను నాటిన మొక్క ఇప్పుడు ఫలాలని ఇస్తోందని డేవిడ్‌కు విశ్వాసం కలిగేది.

సెకండరీ స్థాయికి చేరుకున్న పిల్లలు ఆంధ్రప్రదేశ్ సెకండరీ పరీక్షలకు హాజరవుతారు. ప్రభుత్వ గుర్తింపు ఉన్న స్కూళ్లలో చదవని విద్యార్థులు ప్రైవేటు విద్యార్థులుగా పరీక్షలు రాయవచ్చు. పరీక్షా భోర్డు నుండి నీలాబాగ్‌కు గుర్తింపు లభించలేదు. ఆంగ్ల (సాహిత్య) చరిత్ర, పౌర శాస్త్రాలను నీల్‌బాగ్‌లోని అధ్యాపకుల సహకారంతో చదివి ఉన్నందున విద్యార్థులు వాటినే పరీక్షా విషయాలుగా ఎంపిక చేసుకుంటారు. ఇటువంటి స్థితిలో కూడా పిల్లలు పూర్తి సమయంలో కనీసం మూడవ వంతు సమయాన్ని పరీక్షేతర వ్యవహారాలలో గడపవలసి ఉంటుంది. ఆయనకి సంస్కృతం అంటే ఇష్టం. బడిలో సంస్కృత బోధన అవసరమని భావిస్తూ ఉంటారు. పిల్లలు తరచుగా సంస్కృతంలో చర్చలు నిర్వహించేవారు. కవితలు లేదా లఘు నాటికలను చదివే ప్రయత్నం చేస్తుంటారు.

రంగస్థలానికి సంబంధించిన కార్యక్రమాలు కూడా పాఠ్యక్రమంలో భాగమే. సంవత్సరానికి ఒకటి లేక రెండుసార్లు పిల్లలు షేక్స్పియర్ నాటకాలలోని ఏదో ఒక దృశ్యాన్ని అభినయిస్తారు. నాటకానికి సంబంధించిన వేష భూషణలు, ఇతర సామగ్రిని అంతటిని పిల్లలే స్వయంగా తయారు చేసుకుంటారు. వేదిక మీదకు టార్చ్ ద్వారా కాంతి (లైటింగ్)ని పంపే బాధ్యతని చుట్టుపక్కలున్న చెట్లపై కూర్చుని పిల్లలే నిర్వహిస్తుంటారు. వేదిక మీదకు కాంతి ప్రసరింప చేయడానికి డేవిడ్ ఆస్టిన్ కారు హెడ్‌లైట్‌ను కూడా ఎన్నోసార్లు ఉపయోగించే వారు. ఈ మొత్తం కార్యక్రమం అందరికీ మజాగా ఉంటుంది. వారు అందరూ ఈ పనులలో పూర్తిగా లీనమై కలసికట్టుగా, క్రమశిక్షణ కలిగిన బృందంగా వేషభూషణలు తయారు

చేస్తారు. అలంకరణ లోనే గాక పాత్ర పోషణలో నటులకు సహాయపడుతూ ఉంటారు. బెంగుళూరు, మద్రాసులలో ఉన్న బ్రిటిష్ కౌన్సిల్ లేదా డేవిడ్ మిత్రుల ఇళ్లలోనూ నాటక ప్రదర్శనలు ఇవ్వడానికి వెళుతూ ఉండేవారు.

పిల్లలకు ఇంటి పని (Home Work) ఇచ్చేవారు. కానీ దాన్ని పూర్తి చేయడానికి కావలసినంత సమయం ఉండేది. చాలా మంది పిల్లలు తమ తల్లిదండ్రులతో పాటు ఒకే గుడిసెలో ఉండటం వల్ల అక్కడ వారికి హోమ్‌వర్క్ చేసుకోడానికి కావలసినంత చోటు, సమయం దొరకడం అసంభవమే. అందుకనే పిల్లలు సాయంత్రం పూట బడికి వచ్చి ఇక్కడి గదులలో పెద్ద వారి సహాయం లేకుండానే తమ హోమ్‌వర్క్ పూర్తి చేస్తారు. రాత్రి 9.30 గంటలకు డేవిడ్ అక్కడకు వచ్చి పిల్లలతోపాటు వాళ్ల ఇళ్లవరకు వెళ్లి అక్కడ వారిని వదలి వచ్చేవారు.

నీల్‌బాగ్‌కి సంబంధించి ఇటువంటి ఎన్నో సంగతుల గురించి చెప్పుకోవచ్చు. వాటి సంఖ్య ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉంటుంది. కాని మనం దాని కేంద్రీయ విషయాన్నే చూడాలి. ఎవరైనా అధ్యాపకుడు ముఖ్యమని భావించిన విషయాన్నే అన్నిటికంటే బాగా నేర్పించగలడు. కేవలం ఆజ్ఞాపించడమే శిక్షణ కాదు. నేర్చుకునే వాళ్ల వద్దకు ఏదైనా విలువైన విషయాన్ని తీసుకుని వెళ్లడమే శిక్షణ. మేధావులుగా, ఉత్సాహవంతులుగా విద్యార్థులను గుర్తించినప్పుడు వారి నుంచి ఆశించినవన్నీ పూర్తి చేస్తారు. ప్రతి విద్యార్థికి కొన్ని ప్రత్యేక ప్రతిభలు, సామర్థ్యాలు లేదా బలహీనతలు ఉండవచ్చు.

ఏ విద్యార్థికైనా వారి అభిరుచులు, సామర్థ్యాల సంపూర్ణ వికాసంలో ఒక మంచి ప్రణాళిక సహాయకారిగా ఉంటుంది. విద్యార్థి నేర్చుకునే సామర్థ్యంపై నమ్మకం ఉంచి అధ్యాపకులు ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. అప్పుడే ప్రతి విద్యార్థి తన యోగ్యత ఆధారంగా స్వయంగా తనదైన రీతిలో విషయాలను అవగతం చేసుకుంటారు. ఇటువంటి సంవేదనాశీలురైన మనుషులు, కళాకారులూ అయిన అద్భుత అధ్యాపకుల పర్యవేక్షణలో ఒక పిల్లవాని వ్యక్తిత్వం అనంతంగా వికసిస్తుంది.

ఎస్. ఆనందలక్ష్మి

ది హిందూ దినపత్రికలో 1997 సెప్టెంబరు 14, 21 తారీకులలో ప్రచురితం

హిందీ అనువాదం: దేవయాని

పాఠశాల విద్య - ఒక కొత్త దృష్టి కోణం

డేవిడ్ హార్స్‌బరోతో రోజాలిండ్ విల్సన్ ఇంటర్వ్యూ

ఈ ఇంటర్వ్యూ తోపాటు 'ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్ క్వార్టర్లీ' (10వ సంచిక, 1వ సంపుటి, 1983) పత్రిక సంపాదకుని వివరణ అచ్చయింది. పిల్లల పుస్తకాల రచయితగా డేవిడ్ పేరు సుపరిచితమే. భారత దేశంలో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ ద్వారా అచ్చయిన ఆయన పుస్తకాలలో గణితం మొదలు పర్యావరణం వరకు అన్ని విషయాలకు సంబంధించి ఉన్నాయి.

డేవిడ్‌కు చెందిన నీల్‌బాగ్ బడిలో ఇప్పుడు రెండు సంవత్సరాల నుంచి 21 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు ఉన్నారు. సాధారణంగా ఉండే క్లాస్‌రూమ్ పద్ధతిని ఇక్కడ అనుసరించరు. విద్యార్థులు అందరూ ఇక్కడ ఒకే చోట కూర్చుంటారు. పరీక్షలు అసలే జరగవు. బడిలోని ప్రతి విద్యార్థి తమ సామర్థ్యాన్ని అనుసరించి విషయాలను తెలుసుకుంటారు, నేర్చుకుంటారు. ఇక్కడ అధ్యాపకుడికీ, విద్యార్థికీ నేర్చుకోవడం అనేది ఒక నిరంతర ప్రక్రియ.

దీని ఫలితాలు ఏ విధంగా ఉన్నాయి? డేవిడ్ ఢిల్లీ వచ్చినపుడు ఆయన కోసం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశాం. పేరొందిన పిల్లల పత్రిక 'టార్గెట్' సంపాదకురాలు రోజాలిండ్ విల్సన్ ఆయనను ఇంటర్వ్యూ చేశారు.

రోజాలిండ్: డేవిడ్! మీరు బ్రిటిష్ కౌన్సిల్ అధికారిగా ఉన్నారు. అలాగే

ఒక గొప్ప అధ్యాపకునిగా, రచయితగా ఎంతో కాలంగా భారత దేశంలో ఉంటున్నారు. నీల్‌బాగ్ స్కూల్ ప్రారంభించడానికి మీకు ప్రేరణను ఇచ్చిన విషయం ఏమిటి?

డేవిడ్: భారత దేశ యాత్రకు రావడం నాకు ఇదే మొదటిసారి అనిపిస్తోంది. రెండవ ప్రపంచ యుద్ధం సందర్భంగా రాయల్ వైమానిక దళంలో భాగంగా నేను మొదటిసారి భారత దేశం వచ్చాను. ఆ రోజుల్లో భారత్‌లో అంతర్భాగమైన నేటి బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ఆ రోజుల్లో నేను నా సెలవుల్లో కొంత సమయాన్ని చిట్టగాంగ్‌కు ఇరవై మైళ్ల దూరంలో ఉన్న టాపూనుమా గ్రామంలో గడుపుతుండేవాడిని. వరి పొలాలతో నిండిన ఆ గ్రామంలో రెండే కుటుంబాలు ఉండేవి. ఒకటి హిందూ, మరొకటి ముస్లిం కుటుంబం. రహదారులు ఉండేవి కావు. కేవలం జలమార్గాలే ఉండేవి. జీవితంలో పని అంటూ చేస్తే ఏదైనా గ్రామీణ పాఠశాలలో పని చేయాలన్న కోరిక నాకు ఇక్కడ స్కూల్‌ను చూసినప్పుడే కలిగింది.

యుద్ధం తరవాత నేను తిరిగి ఇంగ్లండుకు వెళ్లాను. అక్కడ నేను డిగ్రీ తీసుకుని 1950లో భారత దేశం రావడంతో నా జీవితం మళ్లీ ప్రారంభం అయ్యింది. మైసూర్‌లో నేను ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా బోధన మొదలు పెట్టిన తరవాత కొన్నేళ్లు రుషి వ్యాలీలో పని చేశాను. 1959లో బ్రిటిష్ కౌన్సిల్‌లో ఉద్యోగంలో చేరాను. స్వంత స్కూలు ప్రారంభించాలని 1972లో ఆ ఉద్యోగం మానేశాను. ఏదో ఒక రూపంలో ఈ సమయాన్నంతా నేను శిక్షణలోనే గడిపాను. పూర్వ ప్రాథమిక స్థాయి మొదలు బి.ఎ. వరకు గల అన్ని స్థాయిల్లో బోధించే అవకాశం కలగడం నిజంగా నా అదృష్టమే.

రోజాలిండ్: ఈ మీ అనుభవాలు మీ బడిలో ప్రతిబింబిస్తున్నాయా?

డేవిడ్: అవును. నా ఆలోచన ముఖ్యంగా గ్రామీణ బడికి సంబంధించింది. ఈ బడిపై ఇవాన్ ఇలిచ్ మొదలు ఎ.ఎస్. నీల్ వరకు అందరి ప్రభావాలను చూడవచ్చు. ప్రస్తుతం ఉన్న బడులకు పూర్తి భిన్నమైన బడులను చూడాలని నా కోరిక.

రోజాలిండ్: అంటే ప్రస్తుతం ఉన్న బడులు సరిగ్గా పని చేయడం లేదనా

మీ అభిప్రాయం?

డేవిడ్: అవును. కొంత మేరకు అవి సరిగ్గా పని చేయడం లేదనే చెప్పగలను.

రోజాలిండ్: అయితే మీరు నీల్‌బాగ్ ప్రారంభించారు కదా! ఈ బడికి సంబంధించి ఎటువంటి విషయాలు పిల్లలను ఆకర్షిస్తున్నాయని అనుకుంటున్నారు?

డేవిడ్: అన్ని స్కూళ్లు జైళ్లు, తప్పనిసరి పరిస్థితుల్లో పిల్లలు అక్కడికి వెళతుంటారని నీల్ చెప్పిన విషయాన్ని మీరు దృష్టిలో ఉంచుకోవాలి. బడికి వెళ్లాలా, వెళ్లకూడదా అన్న మీమాంస ఎదురుకాని ఒక స్కూలును నేను స్థాపించాలని అనుకున్నాను. ఇక్కడికి రావడమా, రాకపోవడమా అన్నది పిల్లలే ఆలోచించుకుని నిర్ణయం తీసుకుంటారు. ఎటువంటి బలవంతమూ ఉండదు. శిక్ష అనే పదం లేని స్కూలును నేను స్థాపించాలని అనుకునేవాడిని.

రోజాలిండ్: మీరు చెప్పిన విషయాలు ఎ.ఎస్. నీల్ చెప్పినట్లు ఉంది?

డేవిడ్: అవును. అయితే, ఏ.ఎస్. నీల్ చెప్పిన కొన్ని విషయాలను నేను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాను. ఏ రకమైన శిక్షనూ విధించడానికి ఇష్టపడనప్పుడు ఎటువంటి నియమాన్ని కూడా విధించలేరు. మీరు ఏవైనా నియమాలను విధించాలని అనుకున్నప్పుడు వాటిని అమలుపరచడానికి ఏదో ఒక రకమైన ఒత్తిడి తేవాల్సి ఉంటుంది. చివరకు 'మా జీవన శైలిలో మిమ్మల్ని మీరు మరల్చుకోలేక పోతే, క్షమించండి మీరు మాతో ఉండటానికి వీల్లేదు' అని అంటారు. అన్ని స్కూళ్ల పాఠ్య ప్రణాళిక చాలా లోపభూయిష్టంగా ఉందని నాకు అనిపించింది. 12-13 ఏళ్ల వయస్సులో పిల్లవాళ్లలో సృజనాత్మక శక్తి తారస్థాయిలో ఉన్నపుడు పరీక్షల ఒత్తిడి కారణంగా వారి సృజనాత్మక మార్గాలన్నీ మూసుకు పోతాయి. పరీక్షను అనివార్యంగా భావించడమే దీనికి కారణం. ఈ సందర్భంగా పిల్లలపై పరీక్షల ఒత్తిడి ఉండకూడదనే నిర్ణయం నేను తీసుకున్నాను. స్కూల్ ప్రారంభమై ఏడేళ్లు అయినప్పటికీ ఎప్పుడూ మేం పరీక్షలు నిర్వహించలేదు. తరగతుల విభజనే పిల్లలు బడి మానివేయడానికి లేదా తప్పడానికి ప్రథమ కారణం అని నేను భావిస్తున్నాను. అందుకే మేము ఒకటవ తరగతి, రెండవ తరగతి అని క్లాసులు ఏర్పాటు చేయలేదు. దీని వల్ల పిల్లలు తమ సామర్థ్యాన్నిబట్టి చదవడానికి, వికాసం చెందడానికి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం తామున్న

స్థితి కంటే మెరుగైన స్థితికి పిల్లలు చేరుకోగలుగుతారు.

రోజాలిండ్: అటువంటప్పుడు పిల్లల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని అధ్యాపకుల సంఖ్యను పెంచాల్సి ఉండదా?

డేవిడ్: నాకు అలా అనిపించడం లేదు. 25 మంది విద్యార్థులకు నేను ఒక్కడినే ఇంగ్లిష్ బోధించగలను. కాని చాలావరకు గ్రామీణ స్కూళ్లతో పోల్చినప్పుడు ఇక్కడి విద్యార్థులు, అధ్యాపకుల నిష్పత్తి చాలా తక్కువ.

రోజాలిండ్: అటువంటప్పుడు మీ విద్యాస్థాయి కూడా మెరుగ్గా ఉండాలి.

డేవిడ్: చదువు గురించి నా భావన భిన్నమైంది. కేవలం బోధించడమే అధ్యాపకుని బాధ్యత కాదు. దీనితోపాటు ప్రతి విద్యార్థి తన స్థాయిలో విషయాలను నేర్చుకునేందుకు అవసరమైన వాతావరణాన్ని కలగచేయడం కూడా అధ్యాపకుని పనే. "చూడు మిత్రమా! ఒక వేళ నీకు రాజనీతి గురించి ఏమీ తెలియకపోతే విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్రాన్ని ఎలా బోధించగలవు?" అని కొంత మంది నాతో అంటుంటారు. కాని ఎవరికో ఎంతో కొంత నేర్పించడం, లేదా బోధించడం నా విధి కాదు. ఒక అధ్యాపకుడిని అన్నీ తెలిసిన వ్యక్తిగా సాధారణంగా మనం ఊహిస్తుంటాం. ఇతరులకు జ్ఞానాన్ని కలగచేయడం అతని పని. రాజనీతి శాస్త్రంలో పట్టా పొందిన వ్యక్తి రాజనీతి శాస్త్రాన్ని, సాహిత్యంలో ఎం.ఏ. చేసిన

వ్యక్తి సాహిత్యం, అలాగే చరిత్రలో డిగ్రీ పొందిన అధ్యాపకుడు చరిత్రను బోధిస్తారనే విషయం మనందరికీ తెలిసిందే. వాస్తవానికి పిల్లలకు బోధించడం కన్నా వారిని నేర్చుకునే ప్రక్రియలో భాగస్వామిగా చేయడం అనేది మూల విషయం.

రోజాలిండ్: మళ్లీ ఒకసారి మీ బడి స్థాపన గురించి మాట్లాడుకుందాం. బడిలో ఎటువంటి నియమమూ ఉండదని, ఎవరికీ శిక్ష విధింప బడదని, అలాగే బడికి రావడం, పోవడంలో పిల్లలు స్వతంత్రులని మీరు నిర్ణయించారు కదా! అలాంటప్పుడు వారు బడికి రావాలంటే చాలా ప్రబలమైన ప్రేరణగాని, కారణం గాని ఉందంటారా? బడిలో బోధించే అంశాలు, వాటిని ఉపయోగించే పద్ధతులు, ఉపకరణాలు గురించి మీకు ఆలోచించాల్సిన అవసరం ఏర్పడిందా?

డేవిడ్: అవును. దీనికి ప్రబలమైన ప్రేరణ అవసరం. నేర్చుకోడానికి పిల్లలను ప్రేరేపించే అంశం గురించి నేను తీవ్రంగా ఆలోచించాను. పిల్లల్లో నేర్చుకోవడం, చదువుకోవడం అనేది ముఖ్యమైన విషయం. మా బడిలో పోటీకీ ఎటువంటి స్థానం లేదు. మేం మార్కులు, గ్రేడు, లేక ప్రమోషన్ లాంటివి ఇవ్వం. మా దగ్గర శిక్షకు సంబంధించి ఎటువంటి ఆలోచనా లేదు. పతకాలుగాని, బహుమతులు గాని ఇవ్వం. వీటన్నింటినీ మించి పిల్లలను ప్రోత్సహించడానికి కూడా కొత్త పద్ధతులను అనుసరిస్తాం. విద్యార్థుల తమ ప్రయత్నంలో విజయం సాధించగలిగినప్పుడు అదే వారికి అన్నింటినీ మించిన ప్రోత్సాహం. ఎలాంటి స్థాయి, తరగతి, గ్రేడు, వ్యవస్థాలేని నా ప్రణాళికలో ప్రతి పిల్లవాడు తన సహజమైన పద్ధతిలో విజయాన్ని సాధించగలడు. అతను విజయం సాధిస్తుండటం అతన్ని ఇంకా నేర్చుకోడానికి, తెలుసుకోడానికి ప్రేరేపిస్తూ ఉంటుంది.

తరగతిలో 35 మంది పిల్లలు ఉంటే 60 నుండి 70 శాతానికి అనువైన గతిని అధ్యాపకుడు అవలంబించాల్సి ఉంటుంది. ఇది కొంత మంది పిల్లలకు చాలా వేగంగా ఉందనిపిస్తే కొంత మంది తెలివైన పిల్లలకు తాబేలు నడకలా అనిపించవచ్చు. అటువంటి స్థితిలో ఈ రెండు రకాల పిల్లల మనస్సు విరక్తికి లోనవుతుంది. ఈ విధంగా మందగతిలో ఉన్న పిల్లలు ఏమీ నేర్చుకో లేకపోతున్నారు. అలాగే చురుగ్గా ఉన్న పిల్లలు హతాశులవుతారు.

అధ్యాపకుడు మొదటి నుండి తనకు తెలిసిన విషయాలనే పునరావృత్తం చేయడమే దీనికి కారణం. మా ప్రణాళికలో తెలివైన పిల్లవాడు నాలుగేళ్ల సామగ్రిని ఒక సంవత్సరంలోనే చదవగలుగుతాడు. ఇక్కడి ఒక విద్యార్థి నాలుగు సంవత్సరాలకు ఉద్దేశించిన ఇంగ్లీష్ పుస్తకాలను ఒకే సంవత్సరంలో చదివాడు. అదే సమయంలో ఎవరైనా పిల్లవాడు విభిన్న కారణాలవల్ల ఏదైనా విషయాన్ని నేర్చుకోవడం కఠినంగా భావిస్తున్నప్పుడు ఒక సంవత్సరానికి బదులు ఒకటిన్నర లేదా రెండు లేదా ఎంత సమయంలో అతను నేర్చుకోగలుగుతాడో అంత సమయం తీసుకుంటాడు. కాని మందగతిలో నేర్చుకున్నప్పటికీ వారిని కూడా విజయం వరిస్తుంది. అంటే దీని అర్థం కొంత మంది పిల్లలు తెలివిగా లేక చురుకుగా ఉండరని కాదు. నిస్సందేహంగా అలాంటి వాళ్లూ ఉంటారు.

రోజాలిండ్: వ్యావహారిక విద్య గొప్పతనం గురించి, దాని పట్ల వారు ఆకర్షితులయ్యేలా ప్రోత్సహించే ఏ అంశమూ మీకు కనిపించలేదా?

డేవిడ్: కనిపించలేదు. పిల్లలతో ఆ విధంగా ఏమాత్రం ప్రవర్తించకూడదు. విద్యావంతులు కానంతవరకు మీరు దాని గొప్పతనాన్ని తెలుసుకోలేరు అనేది విద్యకు సంబంధించిన ఒక పచ్చి నిజం. ఎవరైనా గ్రామీణునికి విద్య చాలా అవసరం అని చెప్పాల్సిన అవసరం లేదు. "ఒకవేళ నేను 10వ తరగతి వరకు చదవగలిగితే నేను ఏదైనా ప్రభుత్వ ఆఫీసులో బంట్రోతు కాగలను," అనే విధంగానే దాని గొప్పతనాన్ని అర్థం చేసుకుంటాడు. అయితే విద్య అంటే కేవలం ఇదే

కాదు. విద్యావంతుడు కాని ఏ వ్యక్తి అయినా విద్య వాస్తవిక ప్రయోజనాన్ని తెలుసుకోలేదు.

రోజాలిండ్: ఆనందం కలిగించే పనిగా విద్యను భావిస్తున్నారా?

డేవిడ్: అవును. పిల్లలకు ఆనందం కలగడమే మొదటి అంశం. వాస్తవంగా కూడా ఇందులో పిల్లలకు చాలా మజా కలుగుతుంటుంది. వారు మంచి జిజ్ఞాసువులు కావటం వల్ల ఆటలంటే వారికి చాలా ఇష్టం ఉంటుంది. అంతేగాక వారు తమ సామర్థ్యాలను గుర్తించగలిగినప్పుడు కొత్త నేర్పును సొంతం చేసుకునే ప్రయత్నంలో మునిగిపోతారు.

రోజాలిండ్: కానీ పిల్లలతో శారీరక శ్రమ చేయించడానికి మీరు కొన్ని ప్రయత్నాలు చేయవలసి వచ్చింది కదూ? మీకు ఒక ఖచ్చితమైన టైమ్‌టేబుల్ ఉందా? తరగతుల నిర్మాణం పిల్లలే స్వయంగా చేసినట్లు మీరు ఎక్కడో రాసినట్లు ఉంది?

డేవిడ్: మాకు టైం టేబుల్ ఉంది. కాని ఇది చాలా ఖచ్చితమైనది కూడా కాదు. అయితే తరగతికి రావడం, రాకపోవడంలో విద్యార్థులు స్వతంత్రులు. గాంధీజీ ఆశించిన విధంగా ఇక్కడ శారీరక శ్రమ చేయించలేదు. పిల్లలు తమ తరగతుల నిర్మాణం చేపట్టారు. కాని ఇది కూడా వారి విద్యలో ఒక సాధారణ భాగమే.

మా పాఠ్య ప్రణాళిక చాలా విశాలమైనది. పిల్లల మాతృభాష తెలుగు కాగా, రెండవ భాషగా ఇంగ్లిషు నేర్చుకుంటారు. అంతేకాక పాఠ్య ప్రణాళికలో గణితం, విజ్ఞాన శాస్త్రం, పర్యావరణ విద్య, కళ, హస్తకళ (శిల్పం), మట్టిపనితోపాటు కొయ్యపని మొదలైనవి కూడా ఉన్నాయి.

రోజాలిండ్: పాఠ్య ప్రణాళిక ఇలా ఉండాలని ఎలా నిర్ణయించారు?

డేవిడ్: మా విచక్షణ ప్రకారమే చేశాం. వాటిని రూపొందించే వారి వివేకానికి కార్యక్రమాలు అద్దంపడతాయి. ఇది పాఠ్య ప్రణాళిక రూపొందించే వారి ఇష్టం అని కూడా చెప్పవచ్చు. ఉదాహరణకు తత్వశాస్త్రం కూడా బోధిస్తాం. పిల్లలకు తత్వశాస్త్రం అనేక విధాలుగా ఉపయోగపడగలదని నా అభిప్రాయం. కాని బహుశా మీరు అలా భావించరేమో. అలాగే ఇతర బడులు పాఠ్య ప్రణాళికలో

తత్వశాస్త్రానికి చోటు లభించలేదు. కొంతమందికి దాని అవసరం ఉండక పోవచ్చేమో. మేం సౌందర్య శాస్త్రం (ఈస్తటిక్స్) కూడా బోధిస్తాం. అలాగే సంగీతాన్ని ఆస్వాదించడం తోపాటు తర్క వితర్కానికి సంబంధించిన మెలకువలు కూడా నేర్పుతాం. ఇప్పుడు ఈ విషయాలన్నీ పిల్లలకు అత్యవసరమని నాకు అనిపిస్తుంది. కానీ మీకు ఈ విషయాలన్నీ సాధారణ పాఠ్య ప్రణాళికలలో కనిపించవు.

ఇదే విధంగా మేం మట్టి పాత్రలను తయారుచేయడం కూడా నేర్పుతాం. అప్పుడప్పుడూ సందర్శకులు మా కుమ్మరం పని చేసే విభాగాన్ని చూసి, "చదువు పూర్తి అయిన తరవాత జీవనోపాధి కోసం పిల్లలకు కుమ్మరిపని కూడా నేర్పిస్తున్నారా? చాలా బాగుంది," అని వ్యంగ్యంగా అంటుంటారు. నాకు ఇలాంటి ఉద్దేశం ఏదీ లేదు. పనిలో భాగంగా నేర్చుకోవడం అవసరమని నాకు అనిపిస్తుంది. మీరు ఎరిక్ గిల్ (1882–1940) అనే శిల్పి గురించి వినే ఉంటారు. విద్య గురించి ఆయన ఎంతో రాశారు. ఒక విషయం గురించి ఆయన ఈ విధంగా చెప్పారు : 'వనరుల వినియోగం గురించి మనం పిల్లలకు ఎప్పుడూ బోధించం. ఆలోచన, అభ్యాసం, ఆటలు, ఇంకా ఎన్నో, ఎన్నో బోధిస్తాం. కాని వనరుల వినియోగం గురించి ఎప్పుడూ బోధించం. ఏదైనా పదార్థం తనను ఉపయోగించే వారిలో ఎలాంటి స్వభావాన్ని కలగచేస్తుంది అనే విషయం పిల్లలు తెలుసుకోవాలని నా అభిప్రాయం. ఇది గొప్పవారు చెప్పిన దానికి భిన్నంగా ఉంటుంది. ఒకవేళ

నేను ఇంగ్లిష్‌లో పొరపాట్లు చేసినట్లయితే మీరు నన్ను సరిదిద్దవచ్చు. అలాగే నా పొరపాటు పునరావృతం కాకుండా చేయవచ్చు. కాని ఒకవేళ నేను కుమ్మరి చక్రం మీద కూర్చుని పని చేస్తూ తప్పుచేస్తే ఆ మట్టే స్వయంగా 'నువ్వు సరిగ్గా పనిచేయడం లేదు చూడు' అని చెబుతుంది. ఒకవేళ చిత్రిక గుల్లను కొయ్యమీద తప్పుగా ఉపయోగించినట్లయితే అది నున్నగా కాకుండా మరింత గరుకుగా తయారవుతుంది. ఈ విధంగా కొయ్య స్వయంగా పిల్లవాడిని తన స్వభావానికి అనుగుణంగా మార్చుకుంటుంది. నిజంగా ఇదొక అద్భుత విషయం. దీని కోసం బయటి నుండి రుద్దే క్రమశిక్షణ అవసరం లేదు, ఎందుకంటే ప్రతి వస్తువుకు తనదైన ఒక ప్రకృతి, గుణం ఉంటాయి.'

రోజాలిండ్: బడి చదువులు పూర్తి చేసిన తరవాత ప్రధాన జీవన స్రవంతిలో కలిసిపోవాలనే కాంక్ష మీ విద్యార్థులలో ఉంటుందా?

డేవిడ్: ఇప్పటివరకూ పూర్తిగా మా బడినుండి సుశిక్షితుడై ఏ విద్యార్థి బయటకు రాలేదు. మా దగ్గర ఇటీవలే ఒక కుర్రవాడు బి.ఏ. పూర్తిచేశాడు. పి.యు.సి. పరీక్షలో తప్పినందు వల్ల బడి మానేసిన గ్రామీణ యువతలో ఇతడు ఒకడు. డిగ్రీలో ఉత్తీర్ణుడు కావడంలో మద్దతిస్తామని చెప్పాను.

మా దగ్గర ఒక పిల్లవాడు ఉన్నాడు. అతను ఐ.ఎ.ఎస్. చేయాలని అనుకుంటున్నాడు. ప్రతి వారం మేం ఒక మాటా మంతి కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తాం. ఇందులో వారి భవిష్యత్తు ప్రణాళికల గురించి పిల్లలను అడుగుతాం. వారిలో చాలా మంది ఇప్పటికి ఏదీ నిర్ణయించుకుని ఉండరు. పిల్లలకు ఉన్నత స్థాయిలో విద్యను అందచేస్తున్నామని, వారి ఇంగ్లిష్ చాలా బాగుందని (12-13 ఏళ్ల వయసున్న మా పిల్లలు షేక్స్పియర్ ఏడో నాటకాన్ని చదువుతున్నారు) అని అంటుంటారు. ఇది ఇంగ్లిష్ మాధ్యమం పాఠశాల మాత్రం కాదు. కానీ రెండు భాషలు నేర్పించే బడుల దృష్ట్యా చూస్తే ఇది చాలా ఉన్నత స్థాయిలో ఉంది. షేక్స్పియర్ అంటే పిల్లలకు మహా పిచ్చి. ఆయన రచించిన ఒథెల్లో వారికి ప్రపంచ ప్రసిద్ధ నాటకం. ఈ మధ్య వారు దాన్నే చదువుతున్నారు.

మీరు పిల్లలను గ్రామాలకు దూరం చేస్తున్నారంటూ ప్రజలు నన్ను విమర్శిస్తూ ఉంటారు. పట్టణవాసులే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తూ ఉంటారు. వాళ్లను

మోసం, దగా చేయడానికి మాత్రం ఇక్కడకు రాలేదని మాత్రమే చెప్పగలను. వారి సామర్థ్యాన్ని అనుసరించి వాళ్లకు మెరుగైన విద్యను అందించడం, తద్వారా వారి మొత్తం సత్తా, ఊహలను మెరుగుపరుచుకునే అవకాశం లభించాలని, దీంతోపాటూ వాళ్లూ ఆలోచించాలని, అనుభవం కలవాళ్లు కావాలని, స్నేహపూర్వక సంబంధాలు కలిగి ఉండాలని, విషయాలను అర్థం చేసుకోవాలని, తమని తాము అభివ్యక్త పరచుకోవడం, వస్తువుల ఉపయోగం తెలుసుకోవడం, పర్యావరణాన్ని అర్థం చేసుకోవడం, ఇలాంటి ఎన్నో విషయాలను తెలుసుకోవాలనే ఒకే ఒక ఉద్దేశంతో నేను ఇక్కడ ఉన్నాను. అటు తరవాత వాళ్లు ఏం చేయాలనుకుంటున్నారనే విషయం గురించి నేను పట్టించుకోను. గ్రామాల్లో ఉంటూ ఇతరులకు సహకరించాలని నేను వారితో చెప్పను. ఒకవేళ వారు స్వయంగానే అలా చేయాలనుకుంటే మనస్ఫూర్తిగా చేయవచ్చు. లేదా ఒకవేళ వారు ఏదైనా పెద్ద నగరానికి వెళ్లి చిత్రకారులు కావాలనుకుంటే అదీ మంచిదే. వాళ్లు ఏమి చేయాలో చెప్పడానికి నేను లేను.

రోజాలిండ్: గ్రామీణ పిల్లల కోసం ఒక మంచి పాఠ్య ప్రణాళికను తయారు చేయడం వెనక మీ ఉద్దేశం వారికి మంచి ఉపాధి లభించాలనా?

డేవిడ్: గ్రామీణ పాఠ్య ప్రణాళికకి సంబంధించినంత వరకు నాకే ఉద్దేశం లేదు. ఇదంతా వ్యర్థ ప్రేలాపన. దీన్ని 5 శాతం ఉన్నత విద్యావంతులు, పేరు, ప్రఖ్యాతులు ఉన్నవారు, దేశ రాజకీయ అధికారంపై పట్టున్న వారు, నగర వాసులు చేశారు. వీరికి విద్యా ప్రణాళికలపై నియంత్రణ ఉంది. అంతేకాక వీరే గ్రామీణ జనాభాను విద్యకు దూరం చేస్తున్నారని నేను ఖచ్చితంగా చెప్పగలను. మూడు నెలల కిందట ఢిల్లీ నుండి ఒక సర్వే ప్రచురితం అయ్యింది. దాని ప్రకారం దేశం మొత్తం మీద 65 శాతం పిల్లలు 5వ తరగతి తరవాత చదువు మానేస్తున్నారు.

ఈ సంఖ్య పెరుగుతూ ఉండవచ్చని నాకు అనిపిస్తుంది. పేరు ప్రఖ్యాతులు ఉన్న 5 శాతం నగర వర్గాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యా-పాఠ్య ప్రణాళిక తయారు అవుతోంది. అంతేకాక అన్ని వనరులు ఈ వర్గానికే కేటాయిస్తున్నారు. గ్రామీణ ప్రాంత బడులలో రెండు వందల మంది పిల్లలకు ఒక అధ్యాపకుడు ఉంటున్నాడు. స్థానిక హైస్కూల్లో కేవలం 4 శాతం మాత్రమే ఉత్తీర్ణులు కావడం ఎంత

హాస్యాస్పదం. పదేళ్ల పాటు దాదాపు మూడుమైళ్ల చొప్పున నడిచి వస్తున్న పిల్లలు చివరికి తప్పుతున్నారు.

రోజాలిండ్: కాని మీరు ప్రతి గ్రామంలో ఒక డేవిడ్ హార్స్‌బరోను ఊహించలేరు కదా? మీరు రూపొందించిన వ్యవస్థను అమలు పరచాలంటే చాలా అసాధారణమైన, అర్హులైన వారి అవసరం ఏర్పడుతుంది కదా?

డేవిడ్: ఈ బడి తోపాటు మేం పిల్లల కోసం ఇంకో నాలుగు బడులను నడుపుతున్నాం. అక్కడ నేను ఒక చిన్న అధ్యాపక శిక్షణా విద్యాలయం నడుపుతున్నాను. నిబద్ధత కలిగిన యువకులు స్కూలును స్థాపించాలని ఉత్సాహ పడుతుంటే బి.ఏ., లేదా ఎం.ఏ. (కనీసం బి.ఏ. ఉండాలని అనుకుంటాను) చేసిన తరవాత వారికి రెండేళ్ల శిక్షణ ఇస్తాను. కనీసం 10వ తరగతి వరకు అన్ని విషయాలను బోధించే స్థాయికి వారు చేరుకోవాలని దీని ఉద్దేశం. తరవాత వాళ్లు తమ స్వంత బడులను ప్రారంభిస్తారు. ప్రస్తుతం అలా నాలుగు బడులు నడుస్తున్నాయి. అన్నీ గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. ప్రతి దాంట్లో 15 నుండి 20 వరకు పిల్లలు ఉన్నారు. ఈ విధంగా సుశిక్షితులైన వారు నడిపే బడులు బాగా పని చేస్తున్నాయి. అందువల్లనే, ఈ విద్య అంతా నేర్చుకుని, నేర్పించే ప్రక్రియ అని నాకు అనిపిస్తుంది.

రోజాలిండ్: నిజమే! మొబైల్-క్రెచ్ ద్వారా రూపొందించిన కార్యక్రమాలను చూసిన అనుభవం నాకు ఉంది. అక్కడ చాలా తక్కువగా చదివిన వారిని ఎంపిక చేసి చక్కటి శిక్షణ ఇస్తారు. ఈ మొత్తం పనిలోను, పర్యవేక్షణలోనూ వారు చాలా శ్రమ పడవలసి వస్తుంది.

డేవిడ్: తమ పనికి సంబంధించి సిద్ధాంత మూలాల గురించి తెలియని అశిక్షితులను తీసుకోవడం వల్ల ఇలా జరుగుతోంది. అందుకనే వారిపై సదా పర్యవేక్షణ అవసరం అవుతోంది. వారు కేవలం టెక్నిక్ మాత్రమే నేర్చుకున్న తరవాత మళ్లీ అది ఉపకరిస్తుందా, లేదా అనే తేడాను గమనించే ప్రయత్నం చేయకుండా ఆ టెక్నిక్‌నే ఉపయోగిస్తూ ఉంటారు. వారు దాని మూలాన్ని కూడా గ్రహించలేక పోతున్నారు. టెక్నిక్ వరకే పరిమితమై చిక్కుల్లో పడిపోతారు. దీనికి కారణం వారికి కేవలం టెక్నిక్ మాత్రం లభ్యం కావడం, ముందు చూపు లేకపోవడం.

రోజాలిండ్: ఈ విధమైన శిక్షణ ఇవ్వడానికి విశేషమైన, అద్భుత ప్రతిభా సంపన్నులైన వారి అవసరం ఉంటుందని మీరు భావిస్తున్నారా?

డేవిడ్: తప్పకుండా భావిస్తాను. అందుకే కనీస విద్యార్హతగా బి.ఏ. (అలాగని బి.ఏ. చేసిన వాళ్లను విద్యావంతులనీ అనలేం) ఉంచాం. ఎలా బోధించాలో తెలుసుకునేందుకు అనువైన వాతావరణం అప్పుడే మేం కల్పించగలం. ఏ విధంగా బోధించాలి అనేది బోధించడమే మా లక్ష్యం. అందుకే స్వయంగా బోధించడానికి వారికి అందుబాటులో ఒక స్కూలు ఉండి తీరాలి.

స్కూలు లేకుండా టీచర్ - ట్రైనింగ్ అంటే హాస్యాస్పదమే కాక అవహేళన కూడా. కుమ్మరి ఉపయోగించే చక్రం లేకుండా మట్టిపాత్రలను తయారు చేయడం నేర్పించే ప్రయత్నం లాంటిది ఇది. కాని మన దేశంలో అన్ని టీచర్ - ట్రైనింగ్ కాలేజీలు స్కూళ్ళు లేకుండానే నడుస్తున్నాయి. ఇటువంటి శిక్షణా సంస్థల విజయంపై ఎల్లప్పుడూ అనుమానపు నీడలు వ్యాపిస్తూ ఉంటాయి. ఒకవేళ మీరు అధ్యాపకులకు శిక్షణ ఇస్తూ ఉన్నట్లయితే అందు కోసం పిల్లల అవసరం తప్పనిసరిగా ఉంటుంది. ఈ స్కూలులో శిక్షణ తీసుకుంటున్న టీచర్లు దాదాపు 800 గంటలు బోధన అనుభవాన్ని గడిస్తారు. ఈ విధంగా జరిగినప్పుడే ఎంతో కొంత మంచి ఫలితాలు వస్తాయి. కనీసం వారు తరగతిని నియంత్రించగలిగి, పిల్లల్లో అభిరుచిని పెంపొందించగలరు. ఇదేకాక వారు కార్యశాలకు వెళతారు. చదువుకోవడానికి వారికి ఒక అద్భుతమైన గ్రంథాలయం ఉంది. ఇక్కడి కార్యశాల



కూడా చాలా మహత్వ పూర్వమైనది. అధిక శాతం భారతీయ యువతకు హస్తకళా నైపుణ్యం గల పనులకు సంబంధించిన అభ్యాసం లేకపోవడంతో వారికి వడ్రంగానికి సంబంధించి కొయ్యను ఎలా కోయాలి, ఎలా అతికించాలి అనే కనీస పరిజ్ఞానం కూడా ఉండదు. అన్ని రకాల పనుల్లోనూ ఇదే తంతు. చాలామంది అమ్మాయిలకైతే పనిముట్లు ఉపయోగించే అనుభవం కూడా లేదు. వారు బొమ్మలు బాగా వేయగలరు. అలాగే చాలా బాగా చదువుతారు కూడా. కావాల్సినంత సైద్ధాంతిక జ్ఞానాన్ని (సమాచారం) వారు సొంతం చేసుకుని ఉంటారు. ప్రతివారం దానికి సంబంధించిన నాలుగు పనులు వారికి అప్పగిస్తాను. వారంలో రెండుసార్లు సెమినార్లు ఉంటాయి. అందులో విద్యా తత్వశాస్త్రం గురించి చర్చిస్తాం. లేక చదువుతున్నపుడు వారికి ఎదురయ్యే ఇబ్బందుల గురించి చర్చిస్తాం. సామాన్య మనోవిజ్ఞానం, విద్యా మనోవిజ్ఞానం, విద్యాతత్వశాస్త్రం కూడా వారి పాఠ్య ప్రణాళికలో భాగమే.

రోజాలిండ్: విద్యా ప్రణాళికలు రూపొందించే విద్యావేత్త దృష్టితో సమస్యను చూడటం లేదని నాకు అనిపిస్తోంది. సమాజానికి ఏది అవసరం అనే విశ్లేషణతో ప్రారంభించి ఆ తరవాతే ఆయా అవసరాలకు అనుగుణంగా విద్యా యంత్రాంగాన్ని మార్చే ప్రయత్నం వారు చేస్తారు. ఉదాహరణకు దేశానికి ఎక్కువ క్లర్కులు అవసరం అనుకుంటే వారు ఎక్కువ మంది క్లర్కులను తయారు చేస్తారు. ఒకవేళ ఇంజనీర్లు అవసరమైతే ఇంజనీర్లను తయారుచేస్తారు. ఈ విధంగా ప్రక్రియ కొనసాగుతూ ఉంటుంది.

డేవిడ్: నిజమే. మన దగ్గర విద్యకు సంబంధించి వ్యూహాలు రూపొందించే వారి కొరత ఏమాత్రం లేదు. భారత దేశంలో ఎన్నో ఏళ్ల నుండి విద్యావంతులైన వారు క్లర్కులుగా తయారవుతున్నారు. నేటికీ విద్యా వేత్తలు ఇటువంటి వారినే తయారు చేయడం విచారించదగ్గ విషయం.

మీకు ఎక్కువ మంది శాస్త్రవేత్తలు కావలసివస్తే ఎక్కువ డబ్బు ఇచ్చి చూడండి. ఎంత మంది శాస్త్రవేత్తలు కావాలని అనుకుంటున్నారో తెలుస్తుంది.

రోజాలిండ్: సార్వజనీన విద్య అంటే ప్రజలను మోసం చేయడం లాంటిది కాదా?

డేవిడ్: ఈనాడు మనం 95 శాతం జనాభాను ఈ విధంగానే మోస పుచ్చుతున్నాం. 5 శాతం ఉన్న ఉన్నత, సంపన్న వర్గాన్ని దృష్టిలో ఉంచుకుని వారి పిల్లలకు చాలా ప్రయోజనం చేకూర్చేందుకు మనం పాఠ్య ప్రణాళికని రూపొందించడమే దీనికి ప్రబల నిదర్శనం. విశ్వవిద్యాలయ స్థాయిని చేరుకునే అతి తక్కువ మందిని దృష్టిలో ఉంచుకుని మొత్తం విద్యా ప్రణాళిక తయారవుతోంది. ప్రాథమిక విజ్ఞాన శాస్త్రం పుస్తకం చూస్తే ఇది తెలుస్తుంది. సగటు గ్రామీణ అధ్యాపకుడు దాన్ని చదవాలంటే చాలా కష్టపడాల్సి వస్తుంది. గ్రామీణ విద్యార్థులది కూడా ఇదే పరిస్థితి. అందుకే వారు మధ్యలోనే చదువు మానేస్తారు. ఇదే వ్యవస్థలో వారు ఎల్లప్పుడూ మనతోపాటు కలసి రావడం మనకు ఇష్టం లేకపోవడం వల్ల ఇది మనకీ సౌకర్యంగానే ఉంటుంది.

రోజాలిండ్: చదువును మధ్యలోనే వదిలేసేవారు అలా చేయకుండా ఉండటానికి గల సార్వజనీన విద్యను మీరు ఏ విధంగా ఊహిస్తారు? మీరు మీ స్కూలునే తీసుకోండి. దీన్ని విశేష ప్రతిభా సంపన్నులైన వారు నడుపుతున్నారు. ఆచరణలో ఈ ప్రణాళిక సాధ్యం కాదని అనిపించటం లేదా?

డేవిడ్: లేదు. మా బడి ఆచరణాత్మకమైనది. ఈ మధ్యనే నేను నా మిత్రుని పత్రికకు ఒక వ్యాసం రాశాను. విద్యా విధానం రూపొందించే వాళ్లు ఈ సమస్యలను గురించి సరిగ్గా ఊహించనంతవరకు ఏమీ చేయలేమని నేను అందులో చాలా స్పష్టంగా పేర్కొన్నాను. ఒక రకంగా అక్కడ ద్వంద్వాలోచన ఉన్నట్లు మనకి అనిపిస్తుంది. ఉన్నతమైన హోదాలలో ఉన్న వారు చాలా పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతోందని భావిస్తుంటారు. కాని వాస్తవానికి అలాంటిదేమీ జరగడం లేదు. పాఠ్య ప్రణాళిక చాలా బాగుంది కానీ దాన్ని ఆచరణలో పెట్టడం లేదని వాళ్లు భావిస్తుంటారు.

మా స్థానిక కళాశాలకు మీరు వచ్చినట్లు అయితే అక్కడ కొంతమంది విద్యార్థులు ఆప్షనల్ విషయంగా ఇంగ్లీష్ తీసుకున్న విషయాన్ని గమనిస్తారు. 'రిచర్డ్ థర్డ్' లేదా 'టెయిల్ ఆఫ్ టు సిటీస్' లాంటి పుస్తకాలు వారి పాఠ్య ప్రణాళికలో ఉంటాయి. అయితే ఏ విద్యార్థి ఈ పుస్తకాలను చదవడు. చదవడం అటుంచి వాటిని కొనడు కూడా.

వాళ్లు ఆ పుస్తకాలకు సంబంధించి కొన్ని వ్యాసాలు జ్ఞాపకం ఉంచుకుని వాటినే పరీక్షలో రాస్తారు. విద్యార్థులు సాహిత్యం చదువుతున్నందుకు పాఠ్య ప్రణాళికను రూపొందించే వాళ్లు, పరీక్షలు నిర్వహించే వాళ్లు, బోధించేవాళ్లు అందరూ ఆనందిస్తూ ఉంటారు. కాని వాస్తవానికి ఇలాంటిది ఏమీ జరగడం లేదు (నవ్వుతూ).

రోజాలిండ్: విద్యావిధానాన్ని రూపొందించే వాళ్లు ఏం చేయాలని మీరు భావిస్తున్నారు?

డేవిడ్: అందరికీ తెలిసిన ఎన్నో విషయాల గురించి మనం ఆలోచించాల్సి ఉంది. ఉదాహరణకు 10వ తరగతి పరీక్షలో ఎంతో మంది తప్పుతున్నారు. ఈ పరిస్థితి నుండి బయట పడటానికి ఒక పద్ధతి ఉంది. విభిన్న స్థాయిల్లో, కావలసిన విషయాలను స్వేచ్ఛగా స్వీకరించడానికి విద్యార్థికి స్వతంత్రత ఉండాలి. వాళ్ల ఇష్ట ప్రకారం ప్రాథమిక గణితమైనా, అడ్వాన్స్‌డ్ గణితమైనా తీసుకోవచ్చు. ఈ విషయాలలో గ్రేడ్లు ఇవ్వవచ్చు. అంతేగాక ఎవరైనా విద్యార్థి బడి చదువు పూర్తిచేసిన తరవాత 3 లేదా 5 లేదా 2 విషయాలను తీసుకోవచ్చు. అంటే ఒకవేళ ఎవరైనా విద్యార్థి విశ్వవిద్యాలయ స్థాయిలో భౌతిక, రసాయన శాస్త్రాలు, గణితం లాంటి విషయాలు చదవదల్చుకుంటే సెకండరీ స్థాయిలో వారు అడ్వాన్స్‌డ్ గణితం, భౌతిక, రసాయన విషయాలను తీసుకోవచ్చు. ఒకవేళ ఎవరైనా విద్యార్థికి ఇటువంటి కోరిక లేనట్లయితే, అతను ప్రతిభాశాలి కూడా కానట్లయితే అతను

ప్రాథమిక ఆంగ్లం, ప్రాథమిక తెలుగు, ప్రాథమిక గణితం, అలాగే ప్రాథమిక పర్యావరణ విజ్ఞానం లాంటి విషయాలను ఎంపిక చేసుకోవచ్చు. అటువంటి స్థితిలో అతనికి 4 'సి' గ్రేడ్లు లభిస్తాయి. ఒకవేళ ప్రభుత్వానికి గుమాస్తాలు అవసరమైతే దానికి కావల్సిన అర్హత 4 'సి' గ్రేడ్లు అవుతుంది. ఏదైనా పనికి 4 'బి' గ్రేడ్లు, యూనివర్సిటీలో పనికైతే మూడు, ఐదు, పది ఏ గ్రేడ్లు గల వాళ్లు అవసరం అవుతారు. అంటే అందరూ ఉత్తీర్ణులు అవుతారు, కాని వేరే స్థాయిల్లో. ఇటువంటి పరిస్థితిలో ఎవరినైనా 'నువ్వు 10వ తరగతి పాస్ అయ్యావా?' అని అడగరు. మీరు అతన్ని 'ఏ గ్రేడులో పాస్ అయ్యావు?' అని మాత్రమే అడుగుతారు. నేను చదవగలను, రాయగలను, తెలుగు, గణితాలలో నాకు 'బి' గ్రేడ్లు వచ్చాయని ఉద్యోగార్థి అంటాడు. అప్పుడు 'చాలా మంచిది. మా సంస్థలో ఒక క్లర్క్ పని చేయవచ్చు," అని మీ నుండి జవాబు వస్తుంది. అటెండర్ కోసం ప్రభుత్వం త్వరలోనే ప్రకటన ఇస్తుంది. దాని ప్రకారం 10వ తరగతి ఉత్తీర్ణుడై చదవడం, రాయడం వచ్చినవాడు వారికి అవసరం. అపుడు మీకు చదివే అర్హత ఉన్నవారు లభ్యం అవుతారు. కాని వాళ్లకి విజ్ఞాన శాస్త్రం తెలిసి ఉండాలని కోరకండి.

నా మనుమరాలు హేస్టింగ్స్ కాలేజీకి వెళ్లాలని అనుకుంటోంది. ఇక్కడ చేరడానికి కావల్సిన అర్హత 4 'సి' గ్రేడ్లు. ఇపుడు 4 'సి' గ్రేడ్లు అంటే ఏవైనా నాలుగు విషయాల్లో ఉత్తీర్ణత అని మీరు గమనించాలి. ఒకవేళ ఇప్పుడు ఆమె విశ్వవిద్యాలయంలో చేరాలనుకుంటే దీనికంటే మెరుగైన గ్రేడ్లు అవసరం అవుతాయి. అది కూడా ప్రత్యేకమైన విషయాల్లో. కాని మన దగ్గర ప్రతి పిల్లవాడు పదవ తరగతిలో అన్ని విషయాల్లో ఒకేసారి ఉత్తీర్ణుడు కావాలి. అంతేగాక ఈ విషయాలన్నీ చాలా పెద్ద స్థాయిలో ఉంటాయి. పియుసి (స్థాయి)ని దృష్టిలో పెట్టుకుని వీటిని తయారుచేశారు. విశ్వవిద్యాలయ స్థాయిని దృష్టిలో ఉంచుకోవడం వల్ల పియుసి స్థాయి ఉన్నతంగా ఉంటుంది. ఈ కారణం వల్లనే చాలా మంది పిల్లలు తప్పుతున్నారు.

రోజాలిండ్: మీ గ్రామంలో బడినే కాక వయోజన విద్యా కేంద్రాన్ని కూడా నడిపారా?

డేవిడ్: లేదు. ఒకప్పుడు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా విద్య నేర్చుకోవడం

కోసం అలాంటి ప్రయత్నం చేశాం. కాని ఎన్నో కారణాల వల్ల అది సాధ్యం కాలేదు. ఎంతోమంది తల్లిదండ్రులకు ఇక్కడకు రావడం అసందర్భం, అహేతుకం అనిపించడం వల్ల వారు మధ్యలోనే మానేశారు. అందరూ అన్ని పనులు వదులుకుని ఇక్కడకు రావడానికి ఒక ఖచ్చితమైన సమయం ఎంచుకోవడం కూడా మాకు ఇబ్బందికర పరిస్థితిగా మారింది. చివరికి మేం ఈ ప్రయత్నాన్ని వదిలివేశాం.

వయోజన విద్యపై నాకు ఎక్కువ ఆశలేదు. వయోజన విద్యతో సంబంధం ఉన్న వారిని కలసినప్పుడు వారిని, "ఇదేంటి? దీనిని ఎందుకు చేస్తున్నారు? దీనికి గల కారణం ఏమిటి?" అని అడుగుతుంటాను. అతి కష్టం మీద నాకు జవాబు లభిస్తుంది, "మేము గ్రామాలకు వెళ్లి వయోజనులకు బోధిస్తుంటాం." "ఎందుకు?" "ఎందుకంటే చదవడం వల్ల వారికి మేలు జరుగుతుంది," అంటారు.

రోజాలిండ్: దీని వల్ల తమ పరిస్థితిపై అదుపు కలిగి ఉండటంలో కొంతమేర సహకారం లభిస్తుందని భావించి ఉండవచ్చు. గాల్‌బ్రెత్ అభిప్రాయం కూడా ఇదే.

డేవిడ్: కేవలం చదవగలిగే సామర్థ్యాన్ని పొందడం నా దృష్టిలో గొప్ప విషయం కాదు. విద్యావంతులు కావటం గొప్ప విషయం. అప్పుడే వయోజన విద్యకు విలువ ఉంటుంది.

'ఎవరు, ఎవరికి, ఎక్కడ, ఎందుకు బోధించడానికి వెళతారు' అనే విషయం మీకు బాగా తెలుసు. మరీ ముఖ్యంగా గ్రామీణ వయోజనులకు సంబంధించి విద్య సుదీర్ఘకాలం పాటు సాగే ఒక క్రియ.

రోజాలిండ్: ఢిల్లీలో 'ఓపెన్ విశ్వవిద్యాలయం' ప్రారంభించారు. మధ్యలోనే విద్య మానేసిన వారి కోసం దీనిని స్థాపించారు.

డేవిడ్: దీనికి సంబంధించి నా దగ్గర సమాచారం లేదు. కాని నేను ఎక్కువ వయసున్న వారి గురించి ఆలోచిస్తున్నాను. వారిని విద్యావంతులను చేసినట్లయితే అందులో అక్షరాస్యత కూడా ఇమిడి ఉంది. ఇటువంటి పరిస్థితిలో "వారు ఏం చదవాలి?" అనే ప్రశ్న నాకు ఎదురవుతుంది. ప్రజా ప్రసారాలకు సంబంధించి రెండు ప్రముఖ మాధ్యమాలు ఉన్నాయి. అవి పత్రికలు, రేడియో. అప్పుడు మళ్లీ మనం అదే చట్రంలో బిగుసుకుపోతాం. ఒక సగటు గ్రామీణ వ్యక్తికి రేడియో

ద్వారా సమాచారం అందినప్పటికీ దాన్ని అతడు అర్థం చేసుకోలేడు. చదవగలిగినప్పటికీ పత్రికను కూడా అర్థం చేసుకోలేడు. ఒకవేళ కన్నడ, తెలుగు లేక హిందీలో అయినా సరే వార్తలు విన్నప్పటికీ అర్థం చేసుకోలేరు. మన దేశంలో రేడియో ఉన్నవారందరూ సినిమా పాటలు వింటారేకాని వార్తలు ఏమాత్రం అర్థం చేసుకోలేరు. ఇదే పరిస్థితి సమాచార పత్రికలది కూడా. ఒకవేళ నేను తెలుగులో ఒక వార్త చదివి వినిపిస్తే మా వంటావిడ ఒక్క మాట కూడా అర్థం చేసుకోలేదు.

రోజాలిండ్: మీ పిల్లలు తమ చుట్టుపక్కల పరిసరాలను అర్థం చేసుకోవడంలో చాలా జాగరూకత కలిగి ఉంటారని మీకు అనిపిస్తుందా? అలాగే వారు దీనిలో పరివర్తన తీసుకురావడంలో తమ పాత్ర గురించి ఆలోచించ గలుగుతారా?

డేవిడ్: నిస్సందేహంగా. ఎందుకంటే వారు దోపిడీ వ్యవస్థ గురించి చాలా ఎక్కువగా తెలుసుకుంటున్నారు. దీనిని ఒక ఉదాహరణ ద్వారా అర్థం చేసుకోవచ్చు. ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం కొంత అప్పు ఇస్తుంది. కాని అప్పులో దాదాపు 20 శాతం అప్పు ఇప్పించే వారికి ఇవ్వాల్సి వస్తుంది. 1000 రూపాయల రుణంలో 200 రూపాయలు చూస్తుండగానే చేతులు మారతాయి. ఇటువంటి విషయాలు ఎంత సాధారణం అయ్యాయో అందరికీ తెలుసు. కాని పిల్లలు ఇటువంటి విషయాలపై అప్రమత్తం అవుతున్నారు. పాత తరం గ్రామీణులు ఏదైనా విషయాన్ని అర్థం చేసుకోవడంలో మత ప్రభావం ఎక్కువగా ఉండేది. కాని కొత్త తరం ఈ ప్రభావం నుండి బయటపడుతోంది.

రోజాలిండ్: ఇటువంటి విషయాల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు మధ్య ఏవైనా ఇబ్బందులు ఉత్పన్నం అవుతున్నాయా?

డేవిడ్: అవి కూడా ఎదురయ్యేవే. పిల్లవాడిని విద్యావంతునిగా తీర్చిదిద్దడం మొదలుపెట్టడంతో అతను తన గ్రామమే పూర్తి ప్రపంచం అనుకునే తన సమాజానికి, తల్లిదండ్రులకు దూరం అవుతూ ఉంటాడు. విద్యార్థి ప్రపంచం గడచిన కాలంలో హరప్పా, మహంజొదారో అయితే, అదే వర్తమాన కాలంలో అమెరికా, గ్రీన్‌ల్యాండ్. ప్రపంచం అంతా విస్తృతం అవుతూ ఉంటుంది. వాని ప్రపంచం తన తల్లిదండ్రుల ప్రపంచానికి భిన్నంగా ఉంటుంది. కాబట్టి పిల్లలు

మతం, లింగ (స్త్రీ-పురుష) వివక్ష, రాజనీతి తోపాటు మొత్తం అన్ని విషయాల మీద (స్కూలులో) ఏ విధంగా మాట్లాడుతుంటారో అదే విధంగా వారు గ్రామంలో ప్రచారంలో ఉన్న అనేక నమ్మకాలు, విశ్వాసాలు, మతాచారాలు మొదలైన వాటిపై సందేహం వ్యక్తం చేస్తుంటారు. అందువల్ల పిల్లలు, వారి తల్లిదండ్రుల మధ్య వివాదాస్పద పరిస్థితులు ఉత్పన్నం అవుతాయి.

రోజాలిండ్: పిల్లలు బడికి రాకుండా వారిలో ఎవరైనా ఆపారా?

డేవిడ్: లేదు. ఇప్పటి వరకు ఎవరూ అలా చేయలేదు. పిల్లలను నా దగ్గర ఎంత ఎక్కువ సమయం తల్లిదండ్రులు ఉండనిస్తారో పిల్లలు ఏదైనా చేస్తున్నపుడు వారిని ఆపడం వాళ్లకి అంత కష్టం అవుతుంది. వివాహాన్ని ఆలస్యం చేయడంలో అమ్మాయిలు విజయం సాధిస్తున్నారు. మూడేళ్ల క్రితమే వివాహమైన 18-19 సంవత్సరాల అమ్మాయిలు ఇక్కడ కొంతమంది ఉన్నారు. కాని వీరంతా డిగ్రీ తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. చాలా త్వరగా మార్పులు రావడం వల్ల తమ కోసం ఈ విజయాన్ని వారు సొంతం చేసుకున్నారు. ఏ విధమైన మార్పు వస్తోందో ఒక ఉదాహరణ ద్వారా మీరు అర్థం చేసుకోవచ్చు. నేను బడి ప్రారంభించిన కొత్తలో తల్లిదండ్రులు ప్రతి రోజూ తమ పిల్లలను కొడుతూ ఉండేవారు. కాని ఇప్పుడు కేవలం ఒక తండ్రి మాత్రం, అది కూడా చాలా మత్తులో ఉన్నప్పుడు పిల్లలను కొడుతూ ఉంటాడు. ఈ మార్పు సరైనదనీ, సరికాదనీ వేరు వేరు అభిప్రాయాలు ఉండవచ్చు. కాని మార్పులు మాత్రం జరుగుతూ ఉంటాయి. సగటు 15 సంవత్సరాల పిల్ల వానికంటే కుటుంబంలో ఈ పిల్లల మాటకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. తల్లిదండ్రులు వీరి నుండి చాలా బాధ్యతాయుతమైన, జవాబు దారితనం గల సలహా ఆశించడం మొదలు పెట్టారు. అలాగే పిల్లలు తమ తల్లిదండ్రులు పొదుపు చేయాలని, మద్యం తక్కువ తాగాలని, వారు భూమి, గ్రామ సంబంధ సమస్యలపై దృష్టి సారించాలని ప్రయత్నిస్తూ ఉంటారు.

రోజాలిండ్: భౌతికంగా లాభం లేనంత వరకు విద్యార్థులు బడికి వెళ్లడానికి కూడా ఇష్టపడరని అంటుంటారు. మీ స్కూలు పిల్లల అనుభవంలో ఇది సరైనదని అనిపిస్తుందా?

డేవిడ్: దీన్ని నేను అంగీకరిస్తున్నాను. తమ పిల్లలను మేకలు మేపడానికి

పంపేందుకు ఇష్టపడే తల్లిదండ్రులకు నచ్చజెప్పటానికి మీ పిల్లవాడు స్కూలుకు వెళితే అతనికి మంచి ఉద్యోగం దొరుకుతుంది, అప్పుడు మీకు ఇంత కష్టపడవలసిన అవసరం ఉండదనే ప్రలోభం చూపించాల్సివస్తుంది. ఈ రకమైన కొన్ని ప్రలోభాలు నేను కూడా ఇవ్వాల్సి వచ్చింది. నిరక్షరాస్యులు కావటం వల్ల కేవలం విద్య మాత్రమే మెరుగైన జీవన స్థాయిని అందించే మాధ్యమమని వారికి అనిపిస్తుందని నా అభిప్రాయం.

రోజాలిండ్: కాని వాళ్లకు ఒక మెరుగైన జీవితం సాధ్యమేనని అనిపిస్తుందా? పిల్లలు ఈ విధంగా ఆలోచించడం మొదలు పెట్టారా?

డేవిడ్: ఇది సాధ్యమేనని పిల్లలకు అనిపిస్తుంది. మీ ప్రశ్న తల్లిదండ్రులకు సంబంధించిందని నా అభిప్రాయం. ఈ విషయం వారి మొత్తం వ్యవహారాలను ప్రతిబింబిస్తుంటుంది. కళకు సంబంధించి ఏ రూపాన్ని తీసుకున్నా దాని గురించి, షేక్స్పియర్ గురించి లేదా కొయ్య, లేదా మట్టికి సంబంధించిన పని, నాటకం లేదా విభిన్న విషయాలపై చర్చించడం, భౌతికమైన కొత్త-కొత్త అనుభవాలు గడించటం మొదలైన వాటి గురించి తల్లిదండ్రులు విని ఉండరు. ఇవన్నీ వారిని చాలా తీవ్రంగా ప్రభావితం చేస్తాయని నాకు అనిపిస్తుంది.

రోజాలిండ్: ప్రారంభం నుండే భాషలను నేర్చుకోవడం, తెలుసుకోవడం లాంటివి మీరు సమర్థిస్తున్నారా?

డేవిడ్: అవును. నా దృష్టిలో చర్చ అనేది విద్యలో మహత్వపూర్వమైన అంగం. ఒక పిల్లవానికి చదువు నేర్పించినప్పుడే విషయాలను ఎలా అర్థం చేసుకోవాలో కూడా నేర్పించగలిగితే మీ పని పూర్తయినట్లే. ఇక మిగిలిన మూడవ పని- పిల్లవాడు వీలైనంత ఎక్కువగా తెలుసుకోవడానికై అతడిని ఉత్సాహపరుస్తూ ఉండాలి. ఎవరైనా ఈడొచ్చిన పిల్లవాడు ఒకవేళ చదవడం తెలిసి, ఇంకా ఎంతో ఎక్కువగా చదవాలనే పట్టుదల అతనిలో ఉన్నట్లయితే అతను ఏది కావాలంటే అది నేర్చుకోగలుగుతాడు. అసలు రహస్యం ఇదే.

రోజాలిండ్: అందుకే వాళ్లకు మీరు ఇంగ్లిష్ నేర్పిస్తున్నారా?

డేవిడ్: కొంత మేరకు అవును. ఎక్కువగా మాతృభాషా మాధ్యమం గల స్కూళ్లు ఇంగ్లిష్‌ను బోధిస్తున్నాయి. కాని పిల్లలు విశేషంగా ఏమీ నేర్చుకోలేక పోతున్నారు. కారణం, వారంలో కేవలం ఒకే క్లాసు ఇంగ్లిషు ఉంటుంది. ఇంగ్లిష్‌లో భూగోళం, చరిత్ర, జీవజ్ఞానం, ఎలక్ట్రానిక్స్ లేక ఏ విషయానికి సంబంధించినవైనా సరే వందలకొద్దీ పుస్తకాలు దొరుకుతాయి. కాని కన్నడ, తెలుగు భాషల్లో అవి దొరకవు. అందువల్లే, ఇంగ్లిష్ సులభంగా చదవలేని పిల్లవాడు ఉన్నతమైన, గొప్పవిద్యను పొందలేడని అనుకుంటున్నాను. అందుకే పిల్లలు ఇంగ్లిష్ తప్పక నేర్చుకోవాలని నాకు అనిపిస్తుంది.

ఇంకోవైపు ఇంగ్లిష్ మాధ్యమం గల స్కూళ్లలో ఏ భారతీయ భాషలోనూ పిల్లల సామర్థ్యం వికాసం చెందదు. కాబట్టి ఈ పిల్లలు భారతీయ సంస్కృతి ప్రధాన ప్రవంతి నుండి వేరవుతున్నారు. అంతేగాక హాస్యాస్పదమైన సంస్కృతి (ఎనిడ్ బ్లైటన్ నవలలు, పాప్ సంగీతం మొదలైన వాటి)లో జారుతూ పోవడం తప్ప ఏమీ చేయలేకపోతున్నారు.

భిన్న సంస్కృతులు ఇచ్చిపుచ్చుకునే విధానంలో భాష ఒక ప్రముఖమైన భూమికను పోషిస్తుంది. ఏదైనా భారతీయ భాషను నేర్చుకోనంత వరకు భారతీయ సంస్కృతిని విద్యార్థి అర్థం చేసుకోలేడు.

రోజాలిండ్: మీ ఇంగ్లిష్ పుస్తకాలు ఒక రకమైన మూస లాగా మీకు అనిపించవా?

డేవిడ్: వీటికి సంబంధించినంత వరకు మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకోవాలి. లేనట్లయితే ప్రచురణకర్తలు వాటిని మార్కెట్‌లో ఉంచరు. నా పుస్తకాలు కూడా

ఒక రకమైన ఒప్పందానికి సంబంధించినవే. మీరు రాయాలని అనుకుంటున్న విధంగా పుస్తకాలు రాయలేరు. ఎందుకంటే వాటిని ఎవ్వరూ కొనరు. ఒకసారి నాకు నచ్చిన విధంగా విజ్ఞాన శాస్త్ర పుస్తకాలను రాశాను. విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన సాధారణ పుస్తకాలకు ఇవి చాలా భిన్నమైనవని. అందుకే వాటికి మార్కెట్‌లో డిమాండ్ లేదు.

రోజాలిండ్: ఎలా?

డేవిడ్: ఉదాహరణకు వాటిలో ఎన్నో ప్రశ్నలు అలాగే వదిలివేశాను. సాధారణ విజ్ఞాన శాస్త్ర పుస్తకాలలో ఒక వైపు కప్ప బొమ్మ ఉండి రెండవ వైపు కప్పకు నాలుగు కాళ్లు, ఒక నాలుక ఉండి అది కీటకాలు, మిడతలు మొదలైన వాటిని తింటుందన్న వివరణ ఉంటుంది. అలాగే పేజీకి వెనక వైపు ఒక కప్పకు ఎన్ని కాళ్లు ఉంటాయి? లాంటి ప్రశ్నలు ఉంటాయి. ఇటువంటి స్థితిలో పిల్లవాడు ఖాళీ స్థానాన్ని పూర్తిచేసి ఏదో ఘనకార్యం చేసినట్లు సంబరపడుతూ ఉంటాడు. ఆ తరవాత వాడు తరవాత పేజీలకు వెళతాడు. కాని నా పుస్తకాలు వీటికి భిన్నంగా ఉంటాయి. వాటిలో పిల్లలు విషయాలు వెదికి వాటిని పరిశీలిస్తారు, తాము చూసినదంతా రాస్తారు. విజ్ఞాన శాస్త్రానికి సంబంధించి ఎన్నో అంశాలు చెప్పి, వాటికి సరైన సమాధానాలు ఇచ్చి అది చాలా గొప్ప విషయంగా భావిస్తున్నారు. నా పుస్తకాలు కొంచెం వేరుగా ఉంటాయి. వాటిలో ప్రశ్నలను వేసి, సరైన సమాధానాలకంటే చర్చను ప్రోత్సహించడానికి ప్రాముఖ్యత ఉంటుంది.

రోజాలిండ్: కాని ఈ విధంగా మాట్లాడటానికి, చర్చించడానికి చాలా తెలివైన పిల్లల అవసరం ఉంటుంది కదూ?

దేవిడ్: పిల్లలు చాలా తెలివైనవాళ్లు. వీటి గురించి మీరు పిల్లలతో మాట్లాడవచ్చు.

రోజాలిండ్: అటువంటప్పుడు ఈ సందర్భంలో అధ్యాపకులు చాలా సంవేదనాశీలురుగా ఉండాల్సి వస్తుందా?

దేవిడ్: తప్పనిసరిగా. అధ్యాపకుడు తప్పనిసరిగా సంవేదనాశీలుడై ఉండి తీరాలి. అధ్యాపకుడు కూడా విద్యావంతుడై ఉండాలని చెప్పాను. వారు విద్యావంతులు కాదు కాబట్టే విద్య సరిగ్గా కొనసాగడం లేదు.

రోజాలిండ్: రేడియో గురించి మీ అభిప్రాయం ఏమిటి?

దేవిడ్: ఈ బడులలో కాని లేక పిల్లల దగ్గరకాని రేడియో లేదు. ఒకసారి నేను దేశంలోనే బాగా పేరున్న ఒక పెద్ద సంస్థలో టీ.వీ. ప్రాముఖ్యతపై ఏర్పాటు చేసిన సెమినార్‌లో పాల్గొన్నాను. 'మనకు ఢిల్లీ స్టేషన్ మాత్రమే అందు బాటులో ఉన్నపుడు విద్యకు సంబంధించి టీ.వి. ఏ రకంగా సహాయక పాత్ర నిర్వహించగలదు,' అని నేను తీవ్రమైన వ్యాఖ్యలు చేశాను. ఒకవేళ మనం ప్రతిదినం ఒక్కో తరగతికి ఒక గంట టీ.వి. ఉంచినట్లయితే రోజుకు కనీసం 10 గంటలు కేటాయించవలసి వస్తుంది. అటువంటప్పుడు పిల్లలేం చేస్తారు? మీరు టీ.వి.లో ఆర్కిటిక్, అంటార్కిటిక్ ధృవాలు చూపించడం వరకూ బాగానే ఉంది. అలాగే దీన్ని మీరు గొప్ప విషయంగా కూడా భావించవచ్చు. కాని మీరు వాటి ద్వారా ఏమీ నేర్చుకోలేరు. ఇదంతా ఒక పక్షం అయితే నేర్చుకోవడం రెండవ పక్షం (ఇందులో విద్యార్థికి కూడా భాగస్వామ్యం ఉంటుంది).

రోజాలిండ్: దేవిడ్! పర్యావరణానికి సంబంధించి మీ సిద్ధాంతాలు కూడా ఇతరుల భావన కంటే ఎంతో విస్తృతమైనవని నాకు అనిపిస్తుంది. పర్యావరణ అధ్యయనం మీద మీరు పుస్తకాలు రాశారా?

దేవిడ్: పర్యావరణానికి సంబంధించి పిల్లల కోసం నేను కూడా కొన్ని పుస్తకాలు రాశాను. కాని వాటికి కూడా మార్కెట్‌లో డిమాండు లేదు. వాటిల్లో పర్యావరణ అధ్యయనాన్ని పిల్లలు తప్పనిసరిగా చెయ్యాలి. కాని పిల్లలు పర్యావరణ అధ్యయనం చేయడం అధ్యాపకులు ఇష్టపడరు. మొత్తం మీద విద్యార్థులు పూర్తి

ఏకాగ్రతతో చదివినది గుర్తుపెట్టుకోవడమే అధ్యాపకులకు కావాలి. ఇంకా చెప్పాలంటే చాలా మంచి అధ్యాపకులుగా భావించేవారు కూడా పాఠ్య పుస్తకాన్ని ఖూనీ చేస్తూ ఉంటారు. రెండేళ్ల క్రితం నేను ఢిల్లీ వచ్చినపుడు నా మిత్రుడు ఒకాయన తన మిత్రురాలు ఒకరు స్కూలులో బోధిస్తోందని అక్కడ నా పుస్తకాలే ఉన్నాయని ఆమె నన్ను కలవాలని అనుకుంటోందని నాతో చెప్పాడు. నేను వారిని తీసుకుని రమ్మనాను. బడిలో ఏం చేస్తున్నారో చెప్పండి అని ఆమెను అడిగాను.

నా పుస్తకంలో చెట్ల గురించి ఒక అధ్యాయం ఉంది. అందులో స్కూలు దారిలో మీరు ఎన్ని రకాల చెట్లు చూస్తున్నారు అనే ప్రశ్న ఉంది. వాటిలో మీకు ఏదైనా చెట్టు పేరు తెలుసా, వాటిపై మీకు ఆకులేమైనా కన్పిస్తున్నాయా, మీరు ఆ ఆకుల చిత్రాలను మీ కాపీ పుస్తకంలో వేసిచూడండి అని ఉంటుంది. ఆమె ఈ విధంగా జవాబు ఇచ్చింది: నేను పుస్తకం తీసుకుని 'చెట్టు' అని చదువుతాను. మీరు ఎన్ని రకాల చెట్లు చూస్తుంటారు అని అడుగుతాను. దీని తరవాత నేను బ్లాక్ బోర్డు మీద చెట్ల పేర్లను రాస్తాను. వాటిని పిల్లలు తమ కాపీ పుస్తకాల్లోకి ఎక్కించుకుంటారు. ఆ మరునాడు నేను వారిని మీరు ఏ ఏ చెట్లు చూశారు అని అడుగుతాను.

ఢీల్లీలోని ఒక ప్రతిష్ఠాత్మక స్కూలుది ఈ పరిస్థితి అని చెబితే నమ్మకం కలగదు. ఇక వేరే స్కూళ్ల గురించి మీరే ఊహించవచ్చు. పరిసరాల విజ్ఞానం



చాలా అవసరం. కాని నగరాలలో ఎవరూ దీనిని అధ్యయనం చేయడం లేదు. రిక్షాలో వెళుతూ మీరు ఏ ఏ దుకాణాలు చూశారు అని ఎవరినైనా అడిగితే బహుశా వారు జవాబు చెప్పలేరు. నగర వాతావరణం గురించి గానీ, ఏదైనా విషయం గురించి గానీ లేదా గ్రామీణ వాతావరణం గురించి గానీ వారికి ఏమీ తెలియదు.

రోజాలిండ్: మొత్తం మీద పరిస్థితులు చాలా భయావహంగా కనిపిస్తున్నాయి. మార్పు గురించి మీరు ఏం ఊహిస్తున్నారు?

డేవిడ్: దీనికి సమాధానం నాకు కూడా తెలియదు. నేను కేవలం నా చిన్న గ్రామంలో కూర్చుని మంచి విద్యగా భావించే దాని కోసం ప్రయత్నం చేస్తూ ఉన్నాను.

అపురూపమైన బడి

(వార్ధా, సేవాగ్రామ్‌లో నయీ తాలీమ్ బడి)



డా॥ అభయ్ బంగ్

హిందీ మూలం : **మేరా జాదూయి స్కూల్**

అనువాదం : **కె. మాధవి, యం. శ్రీనివాస్**

నేను చదువుకున్న బడి ఎంతో అద్భుతమైనది. అటువంటి చదువు ఈ రోజు నా కొడుకు ఆనంద్‌కి నేను అందించలేకపోతున్నాను. "మా రోజులే వేరు. అప్పటిమాట ఇప్పుడెక్కడ?" అని అంటూ ఉంటారు. అయినా నాకు చాలా బాధగా ఉంది. అసలు మా బడిలో విశేషం ఏమిటో చెబుతాను.

తొమ్మిదవ తరగతి వరకు నా చదువు గాంధీజీ 'నయీ తాలీమ్' (నూతన విద్యా విధానం) అనుసరించి జరిగింది. అందులో నాలుగు సంవత్సరాలు నేను సేవాగ్రాం ఆశ్రమంలోని బడిలో గడిపాను. విద్య అంటే పరిసరాలని మరిచిపోయి తరగతి గోడల మధ్య బందీయై పాఠాలని వల్లె వేయడం మాత్రమే కాదు. దీనికి విరుద్ధంగా గాంధీజీ, "ప్రకృతి, ప్రపంచానికి దగ్గరగా ఉంటూ, సమాజానికి ఉపయోగపడే పనుల ద్వారానే పిల్లల బుద్ధి వికసిస్తుంది. ఈ విధంగా పిల్లలు ఎన్నో పనులలో నైపుణ్యం పొందుతారు" అని నమ్మేవారు. ఈ విద్యావిధానాన్ని వికసింపచేయడానికి, గాంధీ కోరిక మేరకు శాంతి నికేతన్‌లో పని చేస్తున్న ఆర్యనాయగమ్, ఆశాదేవీలను రవీంద్రనాథ్ ఠాగోర్ సేవాగ్రాం పంపించారు. ఆర్యనాయగమ్ శ్రీలంకకు చెందిన వారు కాగా శ్రీమతి ఆశాదేవి బెంగాలీ మహిళ. వీరి రాకతో గాంధీ నమ్మిన సిద్ధాంతానికి ఠాగోర్ ప్రకృతి, కళాప్రేమ తోడయ్యాయి.

మొదటి నుంచి కూడా మా తల్లిదండ్రులు ఈ సిద్ధాంతాన్ని నమ్మి సహకరించారు. ఈ బడిలోని పద్ధతులు చాలా భిన్నంగా ఉండేవి. ఇందులో కొన్నిటి గురించి ఇక్కడ చెబుతున్నాను.

డా॥ అభయ్ బంగ్

జంతువులతో పరిచయం

"జంతువులు - వాటి సంరక్షణ" గురించి ఈ రోజుల్లో చాలా చర్చ జరుగుతోంది. కానీ ఇరవై ఏడు సంవత్సరాల ముందు ఈ విషయానికి అంత ప్రాముఖ్యత ఉండేది కాదు. మరాఠీ చెప్పే పాటిల్ మాష్టారు ఒక పనస చెట్టు కొమ్మ మీద కూర్చుని మాకు పాఠాలు చెప్పేవారు. ఆయన మాకు అడవి గురించి ఎన్నో కథలు, ఆయన వేటాడినప్పటి సంగతులు వర్ణించి చెప్పేవారు.

ఒక రోజు వేటాడుతూ ఆయన ఒక జింకని తుపాకీతో కాల్చారు. గర్భంతో ఉన్న అమాయక జీవి దైన్యాన్ని చూసి ఆయన తల్లడిల్లి పోయారు. ఈ సంఘటన ఆయనను ఎంతగానో బాధించింది. ఫలితంగా ఆయన తుపాకీని వదిలేసి కెమేరా పట్టుకున్నారు. అప్పటి నుండి రకరకాల జంతువులని తన కెమేరాలో బంధించ సాగారు. చెట్టుమీద మంచెపైన ఎన్నో రాత్రులు ఉండి మంచి ఫొటోలను తీశారు. గగుర్పొడిచే ఆయన అనుభవాలు వింటే జంతువుల పట్ల ఆయనకున్న అపారమైన ప్రేమ తెలుస్తుంది. ఆయన ఎంతో మాటకారి. ఆయన చెప్పే కథలు వింటే మేమే అడవిలో తిరిగివచ్చాం అన్నంత గొప్ప అనుభూతి కలిగేది. అడవి గురించి చాలా విషయాలు తెలియడమే కాకుండా దాని మీద ఎంతో ప్రేమ కలిగింది.

ఇప్పటి పుస్తకాలు జంతువుల గురించి చెప్పాలంటే "ప్రాణులంటే పశువులు" లాంటి వాక్యాలతో మొదలు పెడతాయి. ఇలాంటి నీరసమైన, అర్థంలేని మాటలతో పిల్లలని ఎలాగ ఉత్తేజపరచడం? మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో

ఇప్పటికీ బ్రహ్మాండమైన అడవి ఉంది. కానీ అక్కడ కూడా పిల్లలకు ప్రకృతితో ఎటువంటి సంబంధం లేకుండా ఇటువంటి పాఠాలే చెబుతున్నారు.

సాధువుల మేళా

భక్తతుకారాం కవితలు కూడా చేదుమందులా మింగాల్సిన అవసరం మాకు కలగలేదు. ప్రతి ఆషాఢమాసం ఏకాదశి రోజున మా బడిలో సాధువుల మేళా జరిగేది. ఈ మేళాలో సాధువుల జీవితాలలోకి తొంగి చూడగలిగే వాళ్లం. వారి గురించి నాటకాలు వేసేవారు. చిత్రాలు గీసేవారు. వ్యాసాలు కూడా రాసేవారు. బడిపిల్లలందరు కలిపి ఈ పనులన్నీ చేసేవారు. దాదాపు పదిహేను రోజులపాటు బడి ఒక జాతర లాగా ఉండేది. భక్త తుకారాం రాసిన ఒక కవితని మూడు విధాలుగా పాడటం నేను అక్కడే నేర్చుకున్నాను. అక్కడి గాన సభలో నేను మొదటిసారిగా 'రాగభైరవి' పాడాను. సాధువుల ఉపదేశాలు, వారి జీవిత చరిత్ర మొదలైనవి మేం ఆడుతూ, పాడుతూ నేర్చుకున్నాం. అయితే అక్కడ భాష, చరిత్ర, సంగీతం అని వేరు వేరు పేర్లు ఉండేవి కావు.



చాలా సంవత్సరాల తరవాత నేను ఒక ప్రభుత్వ పాఠశాలలో "కావ్య కుసుమాంజలి" అనే ఒక పెద్ద పుస్తకంలో భక్త తుకారాం కవితని చూశాను. దాన్ని చూస్తే బహుశా భక్త తుకారాం కూడా ఎంతో బాధపడేవాడు.

వృక్ష శాస్త్రం

పుస్తకాలలోని బొమ్మలని చూపించి, చెట్ల గురించి ఈ రోజుల్లో చాలా బడులలో నేర్పుతారు. మొక్కలలోని రకరకాల జాతుల శాస్త్రీయ నామాలని పిల్లలు కష్టపడి బట్టీపడతారు. పరీక్షలు అవ్వగానే మరిచిపోతారు. కానీ మా బడిలో వేరుగా ఉండేది. మా బడి చుట్టూ ఎన్నో తోటలు, పొలాలు ఉండేవి. పిల్లలందరిని మా మాష్టారు ఆ తోటల్లో, పొలాల్లో తిప్పేవారు. అక్కడ మొక్కల పరిశీలన జరిగేది. కనిపించిన ప్రతి మొక్క పేరుతో మొదలుపెట్టి దాని ఆకులు, పూలు, పండ్ల గురించి వివరంగా తెలుసుకునే వాళ్లం. అలా వెళ్లినప్పుడు రేగిపండ్లు, ఉసిరికాయలు వగైరా కోసుకుని తినేవాళ్లం (ఇలా బడిలో తింటూ పాఠాలు నేర్చుకోవడం నేను మళ్లీ అమెరికాలోనే చూశాను. కాని అక్కడి తరగతులలో చాక్లెట్లు తింటారు. కోకోకోలాలు తాగుతారు). ఇలా తింటూ రేగిపండ్లు, మామిడికాయల మధ్య పోలికలు, తేడాలు చర్చించుకునే వాళ్లం. అలాగే ఇంకా కొన్ని పండ్లని చూసి వాటి గురించిన విషయాలు రాసుకునేవాళ్లం. తోటలు, పొలాల వెంబడి తిరుగుతూ ప్రకృతిని చాలా దగ్గర నుంచి చూడగలిగాం. ఈ విధంగా మేం వృక్ష శాస్త్రాన్ని క్షుణ్ణంగా నేర్చుకున్నాం. 'బాటనీ' పుస్తకాలలో

ఉండే సిద్ధాంతాలు మా పరిసరాల నిండా కనిపించేవి. వాటిని పరిశీలించి నేర్చుకోవాలన్న ఆసక్తి మా టీచరు మాలో కలిగించారు. ఆకులను వివరించటానికి 'పామేట్, డైవర్జెంట్, రెటిక్యులేట్' లాంటి తలా తోకాలేని పదాలు మాకు వంటబట్టేవి కాదు. ఎందుకంటే ఆ బొప్పాయి చెట్టు మా కళ్ల ముందర ఠీవిగా నిలబడి ఉండేది.

ఏడవ తరగతి పరీక్ష కూడా మాకు ఇలాగే జరిగింది. ఏడవ తరగతి పరీక్షకని మమ్మల్ని రకరకాల ఆకులని, పూలని జమచేయమని మా టీచర్ అన్నారు. వీటి కోసమని మేం మా చుట్టుపక్కల వీధులన్నీ గాలించాం. ఎన్నో రకాల ఆకులని, పువ్వులని సేకరించాం. వాటన్నిటిని కూర్చి ఒక ఆల్బం కూడా తయారుచేశాం. అందుకే ఇరవై ఐదు సంవత్సరాల తరవాత కూడా నాకు సేవాగ్రామ్ పరిసరాలలో ఎక్కడ ఏ చెట్టుందో బాగా గుర్తుంది. ఆ మొక్కలు ఇప్పటికీ నా కళ్లముందు కనిపిస్తాయి. బడిలో ఇలా నేర్చుకోవడం వల్ల కాలేజీలో వృక్షశాస్త్రం ఎంతో సులువుగా నేను నేర్చుకోగలిగాను. ఈ శాస్త్రంలో కాలేజీలో అందరికంటే నాకు ఎక్కువ మార్కులు వచ్చాయి. ఈ విషయమై నన్ను మా ప్రొఫెసరు పొగిడినప్పుడు, "సర్, నేను ఈ విషయాలన్నీ మా సేవాగ్రామ్ బడిలోనే నేర్చుకున్నాను. ఈ కాలేజీలో కాదు," అని నా మనస్సులోనే అనుకున్నాను.

నిత్య జీవితంలో గణితం అంటే లెక్కలు

"ఒక నీళ్ల తొట్టిలో రెండు పైపులు అమర్చి ఉన్నాయి. ఒకపైపు నుండి ఆ తొట్టిలో నీళ్లు పడుతున్నాయి, మరొక పైపు ఆ నీళ్లని బయటికి వదులుతోంది. ఆ తొట్టి ఎంత సేపట్లో నిండుతుంది?" ఇలాంటి అర్థం పర్థం లేని లెక్కలు మనకు బడి పుస్తకాలలో కనిపిస్తాయి. ఇటువంటి ప్రశ్నలను చూస్తే అసలు ఈ లెక్కలకు, మన జీవితానికి ఏమైనా సంబంధం ఉందా అన్న అనుమానం కలుగుతుంది.

ఏ మాత్రం తెలివి ఉన్నవాడైనా ఈ ప్రశ్నకు సమాధానం చెప్పే బదులు ఆ కింద ఉన్న పైపుని మూసి ఈ గొడవ వదిలించుకుంటాడు.



కొలతలు, మిగిలిన లెక్కలు నేను సేవాగ్రామ్‌లో ఎలా నేర్చుకున్నానో ఇక్కడ చెబుతాను. ప్రతి రోజు దాదాపు మూడు గంటలపాటు మేం తప్పకుండా ఏదైనా ఉపయోగకరమైన పని చేయాల్సి ఉండేది. అక్కడి విద్యా విధానంలో అది ఒక భాగం. దీనికి కారణాలు: 1) గాంధీ సూచించిన "బ్రెడ్ లేబర్" అంటే సొంత శ్రమ తోటి తిండి సమకూర్చుకోవడం అనే సిద్ధాంతం. 2) సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల ద్వారా బుద్ధి కుశలత పెంచుకో వచ్చునన్న వినోబా భావే ఆలోచన.

దీని ప్రకారం నేను కొన్నిరోజులు సేవాగ్రామ్‌లోని గొడ్ల చావిడిలో పని చేశాను. అప్పుడే కొత్త చావిడి కట్టే పని మొదలయ్యింది. అందులో భాగంగా మా మాష్టారు నాకు ఒక పని చెప్పారు: "రోజుకి ఒక ఆవు ఎన్ని నీళ్లు తాగుతుందో గమనించు. ఆ తరవాత మన చావిడిలో ఉన్న గొడ్లన్నిటికీ కలిపి రోజుకి ఎన్ని నీళ్లు కావాలో లెక్క కట్టు. అన్ని నీళ్లకి సరిపడే తొట్టి మనం నిర్మించాలి. ఆ తొట్టి కట్టడానికి ఎన్ని ఇటుకలు కావాలో లెక్క కట్టి అవి కొనుక్కుని రా." తొట్టి వైశాల్యం ఎలా కనుక్కోవడం? వాటి చుట్టుకొలత ఎలా తెలుసుకోవడం? ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు తెలుసుకోవడానికి నేను వారం రోజులపాటు ఎంతో కష్టపడ్డాను. నీళ్ల తొట్టి కట్టడం కోసం నేను ఈ లెక్కలన్నీ నేర్చుకున్నాను.

వంట - శిక్షణ

మా బడిలో రోజూ దాదాపు వంద మంది అన్నం తినేవారు. ఇంత మందికి వంట చేసే బాధ్యత వంతులవారీగా పిల్లలకి ఇచ్చేవారు. ఎనిమిది మంది ఒక జట్టుగా కూడి ఈ పని చేసేవాళ్లు. ఒక నెలలో వంటకి ఎంత ఖర్చు



చేయవచ్చో ముందే నిర్ణయించి చెప్పేవారు. పరిమితమైన ఖర్చుతో రుచిగా ఉండి, పోషక విలువలు కలిగిన ఆహారం అందించటం మా శక్తికి మించిన పనిగా ఉండేది. ఆలుగడ్డలు ధర తక్కువగా ఉండేవి. కానీ పోషక విలువల దృష్ట్యా ఎక్కువగా పిండి పదార్థాలే ఉండటం వల్ల వాటిని వదిలేయవలసి వచ్చింది. ఐ.సి.ఎమ్.ఆర్. (భారతీయ వైద్య పరిశోధనా మండలి) వాళ్లు చెప్పిన కనీస మోతాదు నూనె వాడితే నెలకి కేటాయించిన డబ్బు అంతా నూనెకే సరిపోయేది. తెలివైన గృహిణికి ఉన్న నేర్పు కూడా మాకు లేదు. ఈ అర్థ శాస్త్రం, ఆహార శాస్త్రాలతో కుస్తీపడుతూ ఏదో విధంగా పని జరిపించటానికి ప్రయత్నించే వాళ్లం. చాలాసార్లు మేం అనుకున్నవి కాగితాల మీదనే సాధ్యపడేవి. నిజంగా అలా చేయలేక పోయేవాళ్లం. పప్పు ఉడకటానికి ఎంతసేపు పడుతుందో కూడా చాలాసార్లు మాకు తెలిసేది కాదు. చివరికి రాత్రికి మేం గిన్నెలని తోముతూ, కడుగుతూ ఉంటే యుద్ధంలో గాయపడిన సైనికుల లాగా అనిపించేది. అప్పుడు కూడా మరుసటి రోజు చేయవలసిన వంట పనులు మా కళ్ల ముందర మెదులుతూనే ఉండేవి.

కానీ ఈ మొత్తం పనిలో మేం మూడు విషయాలు బాగా నేర్చుకున్నాం. అవి పోషక విలువల గురించి తెలిపే ఆహార శాస్త్రం, ఇంటికి సంబంధించిన ఆర్థిక శాస్త్రం, ఇంకా పాక శాస్త్రం. కొత్తిమీరలో 10,600 యూనిట్ల 'ఎ' విటమిన్ ఉంటుందనే విషయం నాకు ఇప్పటికీ గుర్తుంది. వంటింట్లో పని చేస్తూ కొద్ది రోజుల్లో నేర్చుకున్న విషయాలు మెడికల్ కాలేజీలో పది సంవత్సరాలలో కూడా నేర్చుకోలేదు.

పొలం పనులలో ప్రయోగాలు

సేవాగ్రామ్‌లోని పిల్లలందరూ తప్పనిసరిగా వ్యవసాయం చేసేవారు. పిల్లలందరికీ తలా కొంత భూమిని కేటాయించేవాళ్లు. ఆ భూమిని దున్నడం, విత్తనాలు చల్లడం, నీళ్లు పెట్టడం, ఎరువు వేయడం వంటి పనులన్నీ పిల్లలే చేసేవారు. పొలాలకి బావి నుండి నీళ్లు తోడటానికి పిల్లలందరికీ ఎంతో సమయం పట్టేది. అప్పుడప్పుడు తోడుకునే అవకాశం అర్ధరాత్రి మాత్రమే దొరికేది. ఆ సమయంలో నక్కల ఊళలతో ఎంతో భయం వేసేది. కానీ ధైర్యం చేసి పొలాలకి నీళ్లు పెట్టేవాళ్లం. ఈ పనులు చేస్తూ పండ్ల చెట్ల గురించి, పంటల సేద్యం గురించి నేర్చుకున్నాం. ఎరువు వేసే ముందు వాటి రసాయనిక గుణాలని అర్థం చేసుకునే వాళ్లం. ఇందుకోసం మేం అనుభవం ఉన్న రైతులతో తరచూ మాట్లాడేవాళ్లం. జపాన్‌లో వ్యవసాయం చేసి వచ్చిన ముక్తేశ్వర్ భాయి, ద్రాక్ష తోటల్లో మొట్ట మొదట ప్రయోగాలు చేసిన ప్రేమ్ భాయి వారిలో ఉన్నారు. ఇజ్రాయిల్‌లో చాలా సంవత్సరాలు వ్యవసాయం చేసిన హవేలీగారి పొలం మాకు చాలా దగ్గరగా ఉండేది. ఆయన ఎద్దులకు బదులు గుర్రాలతో పొలం దున్నించే వారు. అప్పుడప్పుడు మాకు అన్నా సాహెబ్ సహస్రబుద్ధి వ్యవసాయ, అర్థ శాస్త్రాన్ని బోధించేవారు. ఇలాంటి వాతావరణంలో వ్యవసాయం చేస్తూ మేం ఎంతో నేర్చుకున్నాం. ఎవరి పొలంలో ఎక్కువ దిగుబడి వస్తుంది అనే విషయంలో పిల్లలు పోటీపడేవారు. దిగుబడిని పెంచడానికి తట్టలకొద్దీ ఆవుపేడ



తెచ్చి వేసే వాళ్లం. ఇలా ఎరువు ఎంతో వేసి నేను రెండు కిలోల వంకాయలు పండించాను. దాన్ని అమ్మడానికి వార్ధా తీసుకుని వెళ్లినప్పుడు అవి మంచివి కాదేమో అని ఎవ్వరూ కొనలేదు.

సజీవ విద్య

"నయీ తాలీమ్" విద్యావిధానం పైన తరచు ఒక ఆరోపణ వినబడుతుంది. "ఈ విద్యావిధానంలో పిల్లలు శారీరక శ్రమ ఎక్కువగా చేస్తారు. విజ్ఞానం సంపాదించుకోటానికి ఇది ఒక అడ్డంకి" అన్నదే ఆ ఆరోపణ. మద్రాసు ప్రాంతంలో ఈ విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టినప్పుడు ఇందులోని శారీరక శ్రమ వల్ల వారి పిల్లల చదువు వెనకబడుతుందని అక్కడివారు నిరసన తెలిపారు. దీని కారణంగా అప్పటి ముఖ్యమంత్రి రాజాజీ రాజీనామా చేయాల్సి వచ్చింది. పిల్లలు తమ మెదడులో ఎన్నో రకాల విషయాలను నింపుకుని, పరీక్షల్లో అంతా బయటికి కక్కేయడమే చదువు అనుకునేవారికి ఈ ఆరోపణ నిజమే అనిపిస్తుంది. గంధకామ్లాన్ని తయారుచేసే నాలుగు పద్ధతులు తెలియకపోతే ఆ చదువు పనికి రానిదని ఇలాంటివారు నమ్ముతారు. తొమ్మిదవ తరగతి పిల్లలకి ఈ విషయాలు ఎలా ఉపయోగపడతాయనేది వీరికి అనవసరం.

దీనికి విరుద్ధంగా "నయీ తాలీమ్" లోని పిల్లలు జీవితానికి సంబంధించిన చాలా విషయాలని ఎంతో బాగా నేర్చుకున్నారు. అయితే చరిత్ర, భూగోళం, రాజనీతి శాస్త్రం వంటి విషయాలలో వీరి స్థితి ఏంటో చూద్దాం. భూగోళ శాస్త్రాన్ని నేనెప్పుడూ పాఠాల లాగా చదవలేదు. సేవాగ్రామ్‌కి దేశ విదేశాల నుండి చాలా మంది వచ్చేవారు. వీరందరు చెప్పిన రకరకాల విషయాల నుంచి మేం ఎంతో నేర్చుకున్నాం. నాకు వేరు వేరు దేశాల తపాళా బిళ్లలు సేకరించడం చాలా ఇష్టంగా ఉండేది. దీని వల్ల నాకు ప్రపంచంలోని దేశాల గురించి చాలా ఆసక్తికరమైన విషయాలు తెలుస్తుండేవి. (స్విట్జర్లాండు ప్రజలు తమ దేశాన్ని హెల్వెటియా అని ఎందుకు అంటారనే ప్రశ్న మాలో తలెత్తింది. దీని జవాబు కోసం మేం ఎన్నో పుస్తకాలు చూడాల్సి వచ్చింది. తద్వారా ఆ దేశ చరిత్ర గురించి మాకు బాగా తెలిసింది.) దేశ విదేశాల కథలు, ప్రముఖుల యాత్రలు

చదవడం వల్ల నాకు ఆ దేశాలన్నిటి గురించి చాలా విషయాలు తెలిశాయి. భూగోళ శాస్త్రం కూడా ఇలాగే నేర్చుకున్నాను. నేను తొమ్మిదవ తరగతిలో శరత్ చంద్ర "పథేర్ దావి", జవేర్‌చంద్ మెఘానీ రాసిన "ప్రభు పథార్య" వంటి నవలలు చదివాను. వీటి మూలంగా నాకు బర్మా దేశం గురించి బాగా తెలిసింది. ఈ నవలలు ఇచ్చిన ప్రేరణతో నేను బర్మా వెళ్లాను.

మా ఉపాధ్యాయులు రాజనీతి శాస్త్రం, సామాన్య శాస్త్రం కూడా వేరే రీతిలో నేర్పించారు. రోజూ సాయంత్రం దినపత్రికలలోని ముఖ్యమైన, ఆసక్తికరమైన విషయాలు మాకు చదివి వినిపించేవారు. ఈ విషయాల వెనక ఉన్న చరిత్ర, రాజనీతి గురించి మాతో చర్చించేవారు. క్యూబాకి రష్యా అందించిన అణు పరిజ్ఞానం, దాన్ని ఆపడానికి అమెరికా చేసిన ప్రయత్నాలు అప్పట్లో ముఖ్య విశేషాలు. రెండో ప్రపంచ యుద్ధం ఫలితంగా ప్రపంచ దేశాలన్నీ పెట్టుబడిదారీ వ్యవస్థ, సామ్యవాదం అనే వర్గాలుగా విడి పోయాయి. మా టీచర్లు రష్యా, అమెరికా మధ్య ఉన్న శత్రుత్వం గురించి, క్యూబాలో జరిగిన విప్లవం గురించి వివరించేవారు. ఈ చర్చల ద్వారా మేం ఎన్నో విషయాలు నేర్చుకున్నాం.

నూతన విధానం

గాంధీజీ విద్యా విధానం, ఠాగోర్ కళాప్రేమని కలబోసి ఒక రూపం: ఇవ్వటానికి ఎన్నో సృజనాత్మక ప్రయోగాలు జరిగాయి. ఇందుకు చాలా ఉదాహరణలు చెప్పవచ్చు. రాత పరీక్షలే కాకుండా వంటచేయడం, నాటకాలు రాయడం, వేయడం, సభలో మాట్లాడటం, ఉత్తరాలు రాయడం వంటి విషయాల్లో కూడా మాకు పరీక్షలు ఉండేవి. మా బడిలో తరగతులనేవి నిర్దిష్టంగా కాకుండా పిల్లల సామర్థ్యాన్ని బట్టి ఉండటం ఇంకో విశేషం. అంటే పిల్లలు అన్ని విషయాలలో ఒకే తరగతిలో ఉండాల్సిన అవసరం లేదు. పిల్లల్లో ప్రతి ఒక్కరు కొన్ని విషయాలని బాగా అర్థం చేసుకుని, ఇంకొన్ని విషయాల్లో వెనకబడి ఉంటారు. వారి ప్రతిభని బట్టి ఒక్కొక్క విషయంలో ఒక్కొక్క తరగతిలో ఉండవచ్చు. నేను ఒకే సంవత్సరంలో ఏడవ తరగతి ఇంగ్లిషు, తొమ్మిదవ తరగతి

లెక్కలు, పదవ తరగతి మరాఠీ నేర్చుకున్నాను.



మంచి విలువలని పిల్లల్లో పెంచడం ఈ విధానం ప్రత్యేకత. శ్రమని గౌరవించడం, సొంతకాళ్లపై నిలబడటం, సమత, ఐక్యత మా రోజువారీ జీవితంలో బడి ఒక భాగం. వీటన్నింటితోపాటు దేశంలో సామాజిక పరివర్తన కోసం జరిగే ఆందోళనలో మేం పాల్గొనే వాళ్లం. ప్రతి సంవత్సరం కొన్ని రోజుల పాటు బడిని వదిలి పిల్లలందరం దూర గ్రామాలకి వెళ్లేవాళ్లం. అక్కడ భూదాన్ వంటి ఆందోళనలో పాల్గొనే వాళ్లం.

నేను ఈ బడి గురించి మాట్లాడినప్పుడల్లా, "మా పిల్లల్ని ఆ బడికి పంపాలని ఉంది. ఇప్పటికీ ఆ బడి నడుస్తోందా?" అని అడుగుతారు. దీనికి నేనేం జవాబు ఇవ్వగలను?

గాంధీజీ గ్రామోద్యోగ్ ఉద్యమాన్ని ప్రభుత్వం ప్రోత్సహించలేదు. పెద్ద పెద్ద పరిశ్రమలతో పోటీలో ఈ ఉద్యమం వెనకబడింది. "నయీ తాలీమ్" విద్యావిధానం కూడా అప్పటి విద్యారంగంలో నిలదొక్కుకోలేక పోయింది. ప్రభుత్వ గుర్తింపు లేకపోవడం వల్ల ఈ బడి పిల్లల భవిష్యత్తు ఒక ప్రశ్నగా తయారయ్యింది. ఈ కారణాల వల్ల తల్లిదండ్రులు వారి పిల్లలను ఈ బడికి పంపడం మానేశారు. "భూదాన్", "గ్రామ్‌దాన్" ఆందోళనల్లో పాల్గొన్న చాలామంది వారి పిల్లలని ఒకప్పుడు ఈ బడిలో చేర్పించారు. కానీ తరవాత వారిని ఈ బడికి పంపడం మానేశారు. సమాజం గానీ, ప్రభుత్వం గానీ ఈ బడి విలువ తెలుసుకోలేక పోయాయి. ప్రతికూల పరిస్థితులలో ఒంటరిగా నిలిచే ఇటువంటి పద్ధతులేవీ ఎక్కువ కాలం నిలబడలేవు. తరవాత కాలంలో "గ్రామ్‌దాన్" ఆందోళన కూడా కొనసాగలేకపోయింది. సమాజంలోని స్వార్థ చింతన, పోటీతత్వం ఈ అద్భుతమైన బడిని బలిగొన్నాయి. నా కొడుకును ఆ అద్భుత బడిలో చదివించాలని నా మనస్సులో ఇప్పటికీ ఉంది. కానీ ఇప్పుడు అది ఎక్కడుంది?

మంచి బడి

డా॥ జాన్ హోల్ట్

Instead of Education లోని One of the Best Schools
అన్న అధ్యాయానికి పుష్పా అగర్వాల్ హిందీ అనువాదం 'అచ్ఛా స్కూల్'

అనువాదం : టి. నరసింహులు

మంచి బడి

పిల్లలకు, పెద్దలకు మధ్య ఆత్మీయ సంబంధాలు ఉన్న బడులలో డెన్మార్క్‌లో గల 'న్యూ లిటిల్ స్కూల్' ఒకటి. పెద్దలతో నిర్భయంగా, నిజాయితీగా పిల్లలు వ్యవహరిస్తారు కాబట్టి ఇక్కడ నిజమైన విద్య లభించే వీలుంది.

ఈ బడిలో పెగ్గీ హ్యూస్ రెండు సంవత్సరాలు పని చేశాడు. దీని మీద 'వి హేవ్ టు కాల్ ఇట్ స్కూల్' (We have to call it school) అన్న సినిమా తీశాడు. బడి మొదలు పెట్టినపుడు ఒక అధ్యాపకుడు, "మనం దీనిని బడి అనాలి. అలా అనకపోతే పిల్లలు ఇక్కడికి రారు," అన్నాడు. పిల్లలు బడికి వేళకు రావలసి ఉంటుంది. కానీ ఇక్కడ బడి లాగా అనిపించదు. ఇక్కడ ఎటువంటి 'చదువు' ఉండదు. వాస్తవానికి ఇది 'పని చేసే' స్థలం. ఈ బడిలో 6-14 సంవత్సరాల వయస్సు పిల్లలు 85 మంది ఉన్నారు. వీరిలో సహకార గుణం,



ఆత్మవిశ్వాసం, సంతోషం వెల్లివిరుస్తుంటాయి. ఆరుగురు పెద్దవాళ్లు కూడా ఉన్నారు.

ఈ పిల్లలు తమకు నచ్చిన విధంగా ఉంటూ బడిలో స్వేచ్ఛను అనుభవిస్తారు. అయితే అందరికీ ఉండే నియమాలు వాళ్లకీ వర్తిస్తాయి. ఉదాహరణకు: ఇంకొకరిని కొట్టగూడదు; ఇతరుల ఆస్తికి, సామాజిక సంపదకు నష్టం కల్గించకూడదు. విద్యార్థులు తమ సమయాన్ని తమకు నచ్చిన విధంగా, నచ్చిన వాళ్లతో గడపవచ్చు. అధ్యాపకులు ఇందుకు అనువైన పరిస్థితులు కల్పిస్తూ, పిల్లల్ని గమనిస్తూ ఉంటారు. పిల్లలకు ఇష్టమైన పనులు రూపొందించటానికి అవసరమైన సామగ్రి సమకూరుస్తుంటారు. పిల్లలతో కలిసి పని చేస్తారు. పిల్లలు కోరినట్లయితే వారికి సహకరిస్తారు. పిల్లలు తాము తయారు చేసిన వస్తువులు చూపించాలనుకున్నా, ప్రశ్నలు అడగాలనుకున్నా, వారితో మాట్లాడాలనుకున్నా, వారితో గడపాలనుకున్నా అధ్యాపకులు వారికి అందుబాటులో ఉంటారు.

విద్యార్థులు స్వయంగా ఎంచుకున్న, లేదా ఇతరులు సూచించిన పనులు చెయ్యమని అధ్యాపకులు పిల్లల్ని భయపెట్టరు, బెదిరించరు, మందలించరు, ప్రలోభపెట్టరు.

ఈ బడిలో విద్యాపరమైన కార్యక్రమం అంటూ ఏమీ ఉండదు. తరగతులు ఉండవు. పాఠ్యప్రణాళిక ఉండదు. ముందుగా నిర్ధారించిన మార్గాలూ ఉండవు. పరీక్షలు, మార్కులు, గ్రేడులూ వంటివి ఏవీ ఉండవు. రిపోర్టులు ఉండవు. పిల్లల తల్లిదండ్రులు లేదా సంరక్షకులతో సమావేశాలు ఉండవు. తమ పిల్లల గురించి మాట్లాడటానికి, తెలుసుకోటానికి ఒకవేళ ఎవరైనా సంరక్షకులు బడికి రావాలనుకుంటే రావచ్చు.

ఇక్కడ చదువుకు సంబంధించి పిల్లలపై ఎటువంటి ఒత్తిడి ఉండదు. ఇతర కొత్త పంథా బడులలో లాగా 'దీనిని ఇలా చేద్దామా', లేదా 'ఇలా చెయ్య వచ్చని నువ్వు అనుకోవటం లేదా' వంటివి ఇక్కడ ఏమాత్రం ఉండవు. పిల్లలు చేసిన పనులను తల్లిదండ్రుల లేదా సంరక్షకుల మెప్పు కోసం ఇక్కడ ప్రదర్శించరు. పిల్లలు తయారుచేసిన బొమ్మలు, చిత్రాలు, వైజ్ఞానిక నమూనాలు, కళాత్మక వస్తువులను పాఠశాల సందర్శకులకు చూపించరు. పిల్లల సృజనాత్మకతని తెలియచెయ్యటం కోసం నృత్యం, నాటకం లాంటి కార్యక్రమాలను బయటి ప్రపంచం కోసం ప్రదర్శించరు.

దీనికి భిన్నంగా అమెరికాలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే ఒక బడి తన పత్రికలో పిల్లల యాత్రా అనుభవాలను ప్రచురించింది: ఓడనుంచి సామాను దించడాన్ని చూడటం, వాటర్ వర్క్స్ చూడటం, రైల్వే స్టేషనులో ఒక వ్యక్తిని ఇంటర్వ్యూ చేయడం వంటివి ఇందులో ఉన్నాయి. యాత్రలకు సంబంధించి పిల్లలకు ప్రణాళిక ఉందనీ, ఇతరులను ఇంటర్వ్యూ చేయడానికి వారు ప్రశ్నలు తయారు చేసుకున్నారనీ ఇందులో పేర్కొన్నారు. ఈ యాత్రల ఫలితంగా పిల్లలు ఆరడుగుల పటం తయారు చేశారనీ, దానిని వేలాడ దియ్యటానికి కప్పుకి గిలకల చక్రం ఏర్పరచారని ఇందులో రాశారు.

కాని ఈ పటాలు, ఈ ఇంటర్వ్యూలు, ఈ ప్రాజెక్టులు అసలు ఎవరు నిర్ణయించారు? పిల్లలు యాత్రలకు వెళ్లి వస్తే రిపోర్టులు, పటాలు, చిత్రాలు, కథలు వంటి రూపంలో ఏదో ఒక ఫలితం ఉండాల్సిందేనా? నాకు నచ్చిన

దానిని చూసిన తరవాత ఆరడుగుల నమూనాను తయారు చేయడం, పాట లేదా రిపోర్టు రాయవలసిన అవసరం నాకు లేదు.

ఒకవేళ ఏదైనా ఫలితం కావాలనుకుంటే దాని కోసం ఎదురు చూసి, దానంతట అదే ప్రకటితమయ్యేటట్లు చూడటం ముఖ్యం. దీనికి చాలా సమయం, అప్పుడప్పుడు కొన్ని సంవత్సరాలు కూడా పట్టవచ్చు. కాని 'సృజనాత్మక అధ్యాపకులు' దీని కోసం ప్రయత్నించినా, ప్రేరేపించినా, ఒత్తిడి చేసినా అది సాధ్యం కాదు.

అటువంటి బడిలో నేను పాఠాలు చెప్పాను కాబట్టి అక్కడ ఫలితాలు ఎలా ఉంటాయో నాకు తెలుసు. పిల్లలు ఏదైనా విషయాన్ని పాట, లేక నృత్య రూపంలో వ్యక్తపరచడాన్ని ఒక బడిలో ప్రముఖుడు ఎప్పుడూ గర్వపడుతూ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తుంటాడు. పిల్లల మనసులలో అధ్యాపకుల ఈ అభిప్రాయాలు ముద్రపడి పోతాయి. అధ్యాపకులకు ఏమి ఇష్టం, తాము ఏం చేస్తే వాళ్లకు నచ్చుతుందనేది వాళ్లు త్వరగా గ్రహిస్తారు. ఏం చెయ్యడం వల్ల బహుమతి, ప్రశంస, మంచి రిపోర్టు మొదలైనవి లభిస్తాయనేది వాళ్లకు తెలుస్తుంది. 'ప్రియ శిష్యుల బృందం'లో చేర్చుకోక పోవడం ద్వారా ఏం చేస్తే తమకు నచ్చదో కూడా అధ్యాపకులు తెలియచేస్తారు. 'న్యూ లిటిల్ స్కూల్'లో ఇటువంటివి ఏవీ ఉండవు.

ఈ బడి ఎలాంటిదో తెలుసుకోవాలంటే దీనిని తప్పక చూడాలి. పిల్లల కోసం పెద్దలు నిర్ణయించిన పనులను వాళ్లతో ఎలా చేయించాలి అన్న ఆటకి అన్ని బడులు అలవాటు పడిపోయాయి. ఆ పనుల నుండి ఎలా తప్పించుకోవాలా అన్న ఆలోచనలో పిల్లలు ఉంటారు. ఇలాంటి ఆట ఆడని ప్రదేశం ఉంటుందని మనం ఊహించం. 'న్యూ లిటిల్ స్కూల్'ని చూసిన తరవాత అప్పటివరకు మంచివి అనుకున్న బడుల పట్ల నాకు విముఖత ఏర్పడింది. అటువంటి బడులలోని ఆడంబరం, తెలివి, భయం, పిరికితనం, సిగ్గు, గర్వం, ఒయ్యారంగల పిల్లలకీ 'న్యూ లిటిల్ స్కూల్'లో సహజత్వం, నిర్భయత, స్పష్టత, నిజాయితీ గల పిల్లలకీ మధ్య చాలా తేడా ఉంది. పిల్లలతోపాటు ఉండటం నాకు ఆనందంగా ఉంటుంది. కాని పిల్లలను బడులలో చూడటం కన్నా చూడకుండా ఉండటం మేలు అనిపించేది.

'న్యూ లిటిల్ స్కూల్'లో ఏమేమి జరుగుతాయి, ఏ విధంగా పిల్లల జీవితాలు మారిపోతాయి, ఏ విధంగా మెరుగుపడతాయి లాంటి విషయాలు వివరించటానికి ఒక పెద్ద పుస్తకం కూడా సరిపోదు. అక్కడ ఏ ఇద్దరు పిల్లలు ఒకే రకమైన పని చెయ్యరు. ఏ ఒక్కరూ రెండు రోజులు ఒకే రకంగా ఉండరు, ఒకే పని చెయ్యరు. ఈ బడి గురించి ఎవరైనా, ఏనాటికైనా ఒక పుస్తకం రాస్తే ఎంత బాగుంటుంది!

సంకీర్ణమైన విద్యా ప్రమాణాల పట్ల తల్లిదండ్రులకు, అధ్యాపకులకు ఆసక్తి ఎక్కువ. ఆ ప్రకారం చూసినా ఈ బడి విజయవంతమైన బడి అని నేను ఖచ్చితంగా చెప్పగలను. ఇక్కడ పిల్లలను వారి ఐక్యూ (I.Q.) లేదా విద్యకు సంబంధించిన ప్రతిభ ఆధారంగా చేర్చుకోరు.

అంతకు ముందు బడిలో బాగా చదవని పిల్లలు కూడా ఇక్కడ చేరుతుంటారు.

ఇక్కడ చదువు పూర్తి చేసిన పిల్లలందరూ అత్యంత కఠినమైన నియమాలు గల సాంప్రదాయ బడులలో చేరి చక్కటి ప్రతిభ కనబరిచారు. ఉన్నత పాఠశాలకు వయస్సు దాటిపోయిన వాళ్లు ప్రొఫెషనల్ శిక్షణ తీసుకున్నారు. డెన్మార్క్‌లో కేవలం 5 శాతం మాత్రమే ఈ శిక్షణను పొందగలుగుతున్నారు. ఇంత మంచి

ఫలితాలను ఇచ్చే ఇతర బడులు నాకు తెలియవు.

డెన్మార్క్‌లోని అన్ని కుటుంబాలు, వర్గాల నుంచి పిల్లలు ఈ బడిలో ఉన్నారని చెప్పలేం. అమెరికాలో లాగానే డెన్మార్క్‌లోనూ చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ఇటువంటి బడికి పంపాలని అనుకోరు. 'న్యూ లిటిల్ స్కూల్'కి పిల్లలను పంపించే తల్లిదండ్రులు/ సంరక్షకుల మధ్య ఎన్నో అభిప్రాయ బేధాలు ఉండవచ్చు. కానీ పిల్లలను విశ్వసించడంలో వాళ్లందరూ ఒకటే. ఆ విధంగా లేకపోతే తమ పిల్లలను ఈ బడిలో చేర్పించరు! ఈ దృష్ట్యా చూస్తే ఈ తల్లిదండ్రులు, వారి పిల్లలు కూడా చాలా అద్భుతమైన వాళ్లని చెప్పాలి. ఈ ప్రపంచం గురించి పిల్లలు తెలుసుకోవాలని అనుకుంటారన్న నమ్మకం ఉండాలి. ఆ నమ్మకం ఉన్నప్పుడు వారు అది సాధించగలుగుతారు అని మాత్రమే నేను చెప్పదలుచుకున్నాను.

ఒక పరిచయం

కోపెన్‌హాగన్‌లో బైగ్స్‌వార్డు మధ్య తరగతికి చెందిన ఒక ప్రాంతం. ఒక చిన్నపాటి పారిశ్రామిక క్షేత్రంలో రోడ్డు పక్కన ఈ బడి ఉంది. ఈ బడికీ, దాని

వెనకవైపు ఉన్న పాడుబడిన ఇళ్లకీ మధ్య చిన్నపాటి అడవి ఒకటి ఉంది. ఈ భవనాన్ని వేరే నిమిత్తం కేటాయించిన దృష్ట్యా ప్రస్తుతం వీళ్లు వేరే ప్రదేశం వెతుక్కోవలసి ఉంది. బడి ప్రధాన గది మొత్తం ప్రదేశంలో మూడింట రెండు వంతులు ఉంటుంది. ఈ గది పొడవుగా, సన్నగా ఉంటుంది. దీని రెండు గోడలకూ నేలకు 4 నుండి 5 అడుగుల ఎత్తులో కిటికీలు ఉంటాయి. బయటకు చూడాలంటే పిల్లలు కిటికీలోకి ఎక్కాలి. అయితే కిటికీలోంచి చూడటానికి ఇలాంటి భవనాలు తప్ప అక్కడ ఏమీలేవు.

ప్రధాన గది దగ్గర ఒక చిన్న వ్యాయామశాల ఉంది. బడికి సంబంధించిన అన్ని సమావేశాలు ఇక్కడే జరుగుతాయి. ప్రధాన గదికి రెండవ వైపు మూత్రశాల ఉంది. ఆ పక్కనే రెండు చిన్న గదులున్నాయి. వీటిలో ఒకటి ప్రధానంగా సంగీతం కోసం ఉపయోగిస్తారు. ప్రధాన గదికి ఒక వైపు వర్క్‌షాపు ఉంది. మిగిలిన భాగాన్ని 2000 చెక్క పెట్టెలలో చిన్న చిన్న భాగాలుగా విభజిస్తారు.

ప్లాస్టిక్ పెట్టెలను ఉపయోగించడం మొదలుపెట్టిన తరవాత ఒక ఫ్యాక్టరీ ఈ చెక్క పెట్టెలను బడికి ఉచితంగా ఇచ్చింది. కుర్చీలు, బల్లలు, పుస్తకాల అలమరాలు, అరలుగా రకరకాలుగా ఈ ముదురు ఆకుపచ్చ రంగు చెక్కపెట్టెలు ఉపయోగపడతాయి. బడిలోకి ప్రవేశించగానే ఇవి మన దృష్టిని ఆకట్టుకుంటాయి. త్వరలోనే అందరూ వీటికి అలవాటు పడిపోతారు. చాలా సాధారణమైన, దృఢమైన, చౌకైన ఈ పెట్టెలు బడి భావనకు ప్రతీకలన్నట్లు ఉంటాయి. ఇవి లేకుండా నేనైతే బడిని ఊహించలేను.

బడి సామానులు చాలా సాధారణమైనవి, చౌకైనవి. ఇలాంటి బడిలో పని చేయాల్సి వస్తే చాలామంది అధ్యాపకులు దురదృష్టంగా భావిస్తుంటారు. ఆఫీసులో ఒక మామూలు టైపు రైటరు (కరెంటుది కాదు), ఒక టేపు రికార్డరు, ఒక డూప్లికేటర్ ఉన్నాయి. ప్రధాన గదిలో ఒక ఫ్రిజ్ ఉంది. ఒక స్టవ్ కూడా ఉంది. పిల్లలు అప్పుడు దీనిపై వంట చేసుకుంటారు. కానీ సాధారణంగా పిల్లలు డేనిష్ సాండ్విచ్‌లు తెచ్చుకుని తింటారు. చిన్నదైనా బడిలో ఒక మంచి గ్రంథాలయం ఉంది. వర్క్‌షాపులో చెక్క, లోహం పనులకు ఉపయోగించే పరికరాలు ఉన్నాయి. వెల్డింగ్‌కి ఉపయోగించే పరికరాలు కూడా ఉన్నాయి. ఆటలు, పజిల్స్‌కి



సంబంధించి పుస్తకాలు కొన్ని ఉన్నాయి. విజ్ఞాన శాస్త్రం, గణిత శాస్త్రాలకు సంబంధించిన పుస్తకాలతోపాటు కొన్ని పాఠ్య పుస్తకాలు ఉన్నాయి. బడిలో అత్యవసరంగా భావించే విజ్ఞాన శాస్త్రం, గణిత శాస్త్రాలకు సంబంధించిన పరికరాలు నాకు అక్కడ కనిపించలేదు.

శిల్పకళకు సంబంధించిన పరికరాలు కూడా ఎక్కువగా లేవు. మట్టి, రంగులు, లేదా డ్రాయింగ్ బోర్డు ఉపయోగిస్తున్న పిల్లలను చూసినట్లు నాకు జ్ఞాపకం లేదు. కాని బడిలో పిల్లలు రంగులు వేసిన కొన్ని చిత్రాలు, ఇతర వస్తువులు ఉన్నాయి. అంటే బడిలో రంగులు ఉండే ఉంటాయి. అవసరమైనప్పుడు పిల్లలు వాటిని తీసుకోవచ్చు. అక్కడ ఒక కుట్టు మిషనుతోపాటు రెండు చేనేత మగ్గాలు కూడా ఉన్నాయి.

ఇంతకు ముందుసారి నేను ఆ బడికి వెళ్లినపుడు అక్కడ చాలా పక్షులు, చిన్న చిన్న జంతువులు బోనులలో ఉండేవి. కాని రెండవసారి వెళ్లినపుడు పక్షుల స్థానంలో ట్యాంకులలో రకరకాల చేపలు కనిపించాయి. ఈ ట్యాంకులను పెద్దల

సహాయంతో పిల్లలే స్వయంగా తయారు చేశారు. కొంతమంది పిల్లలైతే గంటల తరబడి ఈ చేపలను చూస్తూ ఉంటారు. బంతులు, గెంతటానికి ఉపయోగించే (స్కిప్పింగ్) తాడు వంటి ఆటవస్తువులు అక్కడ ఉన్నాయి. వ్యాయామ శాలలో ఎగిరి దూకేందుకు ఒక పరుపు ఉంది. సంగీతం గదిలో పాతబడిన ఒక పియానో, కొన్ని గిటార్లు, ఒక అధ్యాపకుడు తయారు చేసిన వాద్య యంత్రాలు, వివిధ సైజుల్లో డ్రమ్స్ ఉన్నాయి.

ఇది అక్కడ ఉన్న వస్తువుల పూర్తి జాబితా కాదు. ఆ గదిలో నాకు పరిచయం లేని, కనిపించని వస్తువులు ఇంకా ఉండే ఉంటాయి. నేను చూసిన వాటిని బట్టి మూడు విషయాలు స్పష్టమవుతున్నాయి. మొదటిది సాంప్రదాయ పాఠశాలలో కనిపించే సామానులు, పరికరాలు చాలా తక్కువ ఇక్కడ ఉన్నాయి. రెండవది పాఠశాలలో లభ్యమయ్యే అన్ని పరికరాలు పిల్లలు ఉపయోగించటానికి ఉద్దేశించినవి. ఇతర బడులలో లాగా ఇక్కడ అలమరాలకు తాళాలు ఉండవు. అలాగే గ్రంథాలయం నుండి పుస్తకాలు తీసుకోటానికి ఎటువంటి నియమ నిబంధనలు లేవు. ఇక్కడకి వస్తే అర్థమయే మూడవ విషయం: ఒకవేళ 'ఇలాంటి పని చేసే ప్రదేశం' పిల్లల కోసం మొదలు పెట్టాలనుకుంటే ఎక్కువ ఖర్చుతో పనిలేదు. పిల్లలు పని చేయడం కోసం ఖరీదైన సామానుల అవసరం ఉండదు.

అధ్యాపకులు చెప్పే పాఠాలు వినడం, వర్క్‌బుక్కులు నింపడం కంటే భిన్నంగా ఉండటం వల్ల ప్రారంభంలో గణితం, విజ్ఞాన శాస్త్రాల ప్రయోగశాలల పట్ల పిల్లలు ఎక్కువ ఆసక్తి కనబరచరు. కానీ పిల్లలను ఉత్తీర్ణులను చేయడానికి మంచి ప్రత్యామ్నాయాలు ఏమైనా ఉంటే పిల్లలు అధిక సమయం ప్రయోగశాలలో గడుపుతారేమో.

తగినన్ని నిధులులేని కారణంగా బడిలో చాలావరకు వస్తువులు లేవు. ఒక వేళ నిధులు ఉన్నట్లయితే అధ్యాపకులకు, పిల్లలకు అవసరమయ్యే కొన్ని వస్తువులు కొనాల్సి ఉంది. ఒకవేళ అధ్యాపకులు, విద్యార్థులు ఏదైనా వస్తువు కావాలని నిర్ణయించుకుంటే దానిని అప్పు మీద పొందటం లేదా చౌకగా ఖరీదుచేసే మార్గాలు వెతుక్కుంటారు. ఒకవేళ బడి దగ్గర నిధులు ఉన్నట్లయితే పిల్లలు, అధ్యాపకులు కలసి సామాను కంటే మిన్నగా ఉపయోగపడే కార్యక్రమాలకు

ఖర్చుచేయాలని నిర్ణయించుకుంటారేమో.

కోపెన్‌హాగెన్, దాని చుట్టుపక్కల ప్రదేశాలకు విద్యార్థులు సందర్శన యాత్రలు చేస్తారు. ఒకసారి పిల్లల బృందం ఒకటి కాలి నడకమీద స్వీడన్ వెళ్లింది. నిధులు ఉన్నట్లయితే వారు ఇంకా ఎక్కువ యాత్రలు చేసి ఉండేవారు.

హాజరు గురించి కూడా మాట్లాడుకుందాం. అన్ని చోట్ల లాగే డెన్మార్క్‌లో కూడా చట్టం ప్రకారం పిల్లలు తప్పనిసరిగా బడికి వెళ్లాల్సిందే. బహుశా ఇతర బడులలో ఈ చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేస్తారనుకుంటా. కానీ దీనర్థం రోజూ హాజరు తీసుకుంటారనిగాని, ఏదైనా సమయంలో అందరూ హాజరు కావాలని మాత్రం కాదు. బడిలో ఎవరున్నారు, ఎవరు లేరని చూడవలసిన బాధ్యత వారంలో ఒక రోజు ఒక అధ్యాపకునికి ఉంటుంది. పిల్లలు బడిలో లేకపోతే చింతించాల్సిన లేదా ఇంటికి తెలియ చెయ్యాల్సిన విషయంగా భావించరు. ఎవరైనా బడికి రాకపోవడానికి ఏదో కారణం ఉండి ఉంటుందని, వాడు ఎక్కడున్నా చాలా ఉపయోగపడే పనిలోనే ఉన్నాడని భావిస్తారు.

ఎవరైనా పిల్లవాడు ఒకవేళ బడిలో లేనట్లయితే అతడు ఎక్కడున్నాడు, ఏం చేస్తున్నాడని ఎవరో ఒకరికి ఖచ్చితంగా తెలిసేలా బడి వాతావరణం ఉంటుంది. ఒకటి రెండు రోజులపాటు ఎవరైనా బడికి రానట్లయితే ఆ రోజులలో తాను ఏమేమి చేశాడో అతడు అందరికీ తప్పక చెబుతాడు. ఒకటి, రెండు రోజుల పాటు ఎవరైనా బడికి రాకుండా ఉండి దానికి కారణం ఎవరికీ తెలియకుండా ఉండటమన్నది ఎప్పుడో గాని జరగదు. ఒకవేళ చాలా రోజులు బడికి రాక పోయినట్లయితే బహుశా అధ్యాపకులు కూడా కారణాలు తెలుసుకోటానికి ప్రయత్నిస్తారనుకుంటా.

ఒకసారి ఒక విద్యార్థి చాలా రోజుల పాటు బడికి రాలేదు. తిరిగి అతనిని బడికి ఎలా తీసుకురావాలి అని అధ్యాపకులు కూడా ఆలోచించారు. సరైన కారణం ఉన్నట్లు భావిస్తే విద్యార్థులు బడికి రాకుండా ఉండేందుకు స్వాతంత్రం ఉంది. ఇందు కోసం ముందు గానే అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదు. తిరిగి వచ్చిన తరవాత కూడా వివరణ ఇవ్వనక్కర లేదు. ఇతర స్కూళ్లు, కాలేజీ విద్యార్థులలాగా బడికి గైరు హాజరయిన సమయంలో వారు ఏం చేశారో



రాసివ్వవలసిన అవసరం ఇక్కడి విద్యార్థులకు లేదు.

ఈ బడికి అన్నిసార్లు నేను వసంత రుతువులో మే నెల మధ్యగానీ లేదా చివరలోగాని వెళ్లాను. సుదీర్ఘ రాత్రుల శీతరుతువు తరవాత సూర్యుడు వెచ్చబడటంతో స్కాండినేవియన్లు బయటకు రావడానికి ఇష్టపడతారు. ఈ సమయంలో ఏ రోజు చూసినా దాదాపు సగం మంది పిల్లలు మాత్రమే బడికి హాజరవుతారు. శీతాకాలంలో దాదాపు పిల్లలందరూ బడికి హాజరవుతారు. పిల్లలు ఏం చేస్తారు, బడిలో జరిగే కొన్ని పనులను నేను చెప్పదలుచుకున్నాను. కొన్ని పనులు పిల్లలందరూ కలిసి చేస్తారు.

రెండేళ్ల క్రితం బడి సమావేశంలో జరిగిన చర్చల తరవాత ఒక రోజు మధ్యాహ్నం పిల్లలూ, పెద్దలూ అందరూ కలిసి భోజనం చేయాలని నిశ్చయించుకున్నారు. దీని కోసం కొంత మొత్తం కూడా కేటాయించారు. బజారు నుంచి కొంతమంది సరుకులు తీసుకు వస్తే, మరికొంత మంది వంట చేస్తారు. కొందరు వడ్డిస్తారు. అందరూ కలిసి భోజనం చేస్తారు. హంగామా, ఉల్లాసం,

స్నేహం నిండిన ఆనంద, ఆహ్లాదకర దృశ్యం ఇది.

బడిలో తరచుగా విద్యార్థులు, అధ్యాపకులు కలిసి పాల్గొనే 'సాధారణ సభ'లు జరుగుతూ ఉంటాయి. ఇందులో అందరూ మాట్లాడవచ్చు, అలాగే ఓటు వేయవచ్చు. అందరి ఓటుకు సమాన విలువ ఉంటుంది. ఈ విధంగా జరిగే కొన్ని బడులలో పదేళ్ల లోపు పిల్లలు నిజంగా పాల్గొనలేరు. కాని ఈ బడిలో అలా కాదు. చిన్న పిల్లలు కూడా బాగా మాట్లాడతారు.

ఓటింగ్ లేకుండా పరస్పర సంప్రదింపులతో అందరూ లేదా ఎక్కువమంది అంగీకారంతో నిర్ణయాలు తీసుకునేలా ప్రయత్నాలు జరుగుతాయి. పరస్పర సంబంధాలు, సమస్యలు అంటే ఎవరినైనా ఏడ్పించడం లేదా ఇబ్బంది పెట్టడం వంటి వాటి గురించి కూడా మాట్లాడతారు. అంతేకాకుండా బడి విధానం, ఖర్చుల గురించి కూడా చర్చించుకుంటారు.

ఈ సమావేశాల్లో తరుచుగా బడి పటం, 'గదుల' ఏర్పాట్ల గురించి జోరుగా చర్చలు జరుగుతాయి. ప్రధాన గదిని చెక్కపెట్టెలలో చిన్న చిన్న భాగాలుగా ఎలా విభజించాలనే దాని గురించి చాలా సమావేశాలు జరుగుతుంటాయి. ప్రస్తుత ఏర్పాట్లు తమకి ఎందుకు నచ్చలేదో పిల్లలు వివరిస్తారు. తరవాత పిల్లలు కొలతలతో ఒక కొత్త ఏర్పాటు ప్రతిపాదిస్తారు. దీనిని సమావేశంలో ఖరారు చేస్తారు. ఆ తరవాత జోరుగా పని మొదలవుతుంది. మొత్తం సామాను, పుస్తకాలు బయటకు తీసుకెళతారు. అడ్డుగోడలుగా పెట్టిన చెక్క పెట్టెలు తీసేస్తారు. ఇతర సామాగ్రి కూడా తొలగిస్తారు. తరవాత గదిని బాగా శుభ్రం చేస్తారు. అప్పుడు చెక్క పెట్టెలను కొత్త ఏర్పాట్ల ప్రకారం అమరుస్తారు. పుస్తకాలు, సామాను తిరిగి సర్దుతారు.

ఇది చాలా పెద్ద పని. ఇందులో పాల్గొనడం పిల్లలకు ఉల్లాసాన్ని ఇస్తుంది. ఈ సమయంలో వాళ్లు చాలా ఉత్సాహంగా ఉంటారు. ఒక ఆదర్శ విద్యాలయ భవనం ఎప్పటికీ పూర్తి కాగూడదని చాలా సంవత్సరాల క్రితం నేను ఒక యువ ఆర్కిటెక్ట్‌తో అన్నాను. పిల్లలు దాన్ని మళ్లీ డిజైన్ చేసి మళ్లీ మళ్లీ మార్పులు చేసే విధంగా అది ఉండాలి. 'న్యూ లిటిల్ స్కూల్' ఇటువంటిదే.

బడి దినచర్యలో ఉదయం వ్యాయామం, నృత్యం చాలా ముఖ్యమైన

అంశాలు. స్క్వాష్ కోర్టు కంటే కొంచెం పెద్దదిగా ఉన్న గదిలో వ్యాయామశాల ఉంది. దీని పైకప్పు కొంచెం కిందికి ఉంటుంది. అక్కడ కేవలం ఒక జంపఖానా, రెండు డ్రమ్స్ ఉన్నాయి. నృత్యం, సంగీతంలో శిక్షణ పొందిన ఒక అధ్యాపకుడు, చాలా మంది పిల్లలు ఈ వ్యాయామశాలలో రోజూ కలుస్తుంటారు. అధ్యాపకుడు డ్రమ్ మీద ఉత్సాహపరిచే వేగవంతమైన ధ్వనులను చేస్తే పిల్లలు గెంతుతూ, దూకుతూ, ఎగురుతూ, వెనకాముందుకు ఊగుతూ ఉత్సాహంగా నృత్యం చేస్తుంటారు. పిల్లలు ఆనందంతో తమలోని లయతో కదులుతూ ఇంకో లయను అందుకుంటారు. పిల్లలు తరచుగా తమకు నచ్చిన లయను తిరిగి చేస్తూ ఉంటారు.

పిల్లలు, అధ్యాపకుడు ఉత్సాహంగా ముందుకు పోతూ కొత్తవైన, హుషారుని ఇచ్చే, వినసొంపైన నాదాలను, లయను కనిపెడుతుంటారు. కొత్త రాగాలు, కొత్త లయ, కొత్త తాళాలను కనిపెడుతుంటారు. ఒక్కొక్కసారి ఎవరైనా పిల్లవాడు డ్రమ్ వాయిస్తాడు. లేదా ఒక డ్రమ్ ఒక పిల్లవాడు వాయిస్తుంటే రెండవ డ్రమ్



అధ్యాపకుడు వాయిస్తాడు. అటువంటి దృశ్య సౌందర్యాన్ని, ఆనందాన్ని, శక్తిని మాటల్లో వర్ణించడం సాధ్యం కాదు. ఇలాంటిది నేనెప్పుడూ చూడలేదు. పిల్లల్లో చాలా మంది ఆరోగ్యం, ఉత్సాహంతో నిండి ఉన్నారు. ఈ కార్యక్రమం చాలా సేపు జరుగుతుంది. తమ శక్తిలో చాలా వరకు పిల్లలు ఇక్కడ ఖర్చు చేస్తుంటారు. అయితే పూర్తిగా నీరసపడేవరకు చేయరు.

బడిలో ప్రశాంతమైన, ఆలోచనాపూరిత రోజులూ ఉంటాయి. అయితే ఎక్కువ రోజులు పిల్లలు ఎక్కువగా మాట్లాడుతూ, కేకలు వేస్తూ, అందరితో కలిసి పనులు చేస్తూ గడుపుతారు. ఈ పిల్లల కంటే తక్కువ చురుకైన అమెరికన్ పిల్లలకు మత్తుమందులు ఇచ్చి నెమ్మది పరుస్తుంటారు. బడి వ్యవస్థీకృత ఆటపాటల్లో ఈ నృత్య తరగతి ముఖ్యమైన కార్యక్రమం. బడికి దగ్గరగా, పది నిమిషాలలో నడిచి వెళ్లేంత దూరంలో ఒక ఫుట్‌బాల్ మైదానం ఉంది. ఫుట్‌బాల్ ఆటను ఇష్టపడి, ఆటగాళ్లు కావాలనుకునే పెద్ద పిల్లలు అక్కడికి వెళుతుంటారు.

వెల్డింగ్ సామాను రాకమునుపు బడిలో ఒక పొయ్యి (బున్సన్ బర్నర్) ఉండింది. ఒక రోజు ముగ్గురు నలుగురు పిల్లలు ఒక గంట వరకు దాని చుట్టూ చేరి పనులు చేస్తున్నారు. నేను కూడా వారితో ఉన్నాను. మా అందరి దగ్గరా మేకును పట్టుకునే ఒక పట్టకారు ఉంది. దాంతో పట్టుకుని మేం మేకును వేడి చేస్తున్నాం. మేకు వేడెక్కి ఎర్రగా, మెత్తగా మారిన తరవాత దానిని బయటకు తీసి రకరకాల వస్తువులు తయారు చేస్తున్నారు. చాలా మంది రైలు పట్టా ముక్కపై కాలిన మేకు పెట్టి సుత్తితో కొడుతూ ఉన్నారు. నేను కూడా కాలిన మేకులతో కొన్ని ఆకృతులను తయారు చేయాలని ప్రయత్నిస్తూ రెండు మేకులను సాగదీసి అతికించగలనో లేదోనని చూస్తున్నాను. కాని అది సాధ్యం కాలేదు.

ఏడు, ఎనిమిది ఏళ్లు కూడా నిండని ఒక కొత్త పిల్లవాడు ఒకే పనిని మాటి మాటికీ చేస్తున్నాడు. ఎర్రగా కాలుస్తున్న మేకును ఒక్క ముక్కలోకి గుచ్చగా అది కాలి దాంట్లోంచి పొగ వస్తోంది. ఈ కుర్రవాని మేకుకు ఎవరైనా తమ మేకు తాకించినా, నిప్పులో ఎక్కువ భాగం తీసుకున్నా వాడు బిగ్గరగా కేక పెట్టేవాడు. దీనికి ఇతర పిల్లలు భయపడేవారో లేదో గాని నేను మాత్రం భయంతో వణికిపోయే వాడిని. ఏ పిల్లవానిలోనూ ఇంతటి కోపం నేను చూడలేదు. పిల్లవాడు

మేకును చెక్కలోకి గుచ్చినపుడు అతడి ఆలోచనలు ఎలా ఉండి ఉంటాయో నేను ఊహించే సాహసం చేయలేదు. అతనితో నాకు అంతకంటే ఎక్కువ పరిచయం కలగలేదు.

రెండు సంవత్సరాల తరవాత నేను ఇంకోసారి బడికి వెళ్లినప్పుడు ఆ కుర్రవాడు ప్రశాంత, ప్రసన్న చిత్తుడుగా ఉన్నాడు. వెల్డింగ్‌లో మంచి నేర్పుగల పనివాడిగా అతను తయారయ్యాడు. నన్ను ఒక స్నేహితునిగా అతను చూసినందుకు నాకు ఆశ్చర్యం, సంతోషం కలిగాయి.

సంగీతం తరగతిలో మంచి సంగీతజ్ఞుడు, పియానో వాదనలో నిపుణుడు అయిన ఒక అధ్యాపకుడు ఎలక్ట్రిక్ గిటార్‌పై ఒక రాగాన్ని వాయించడం ఒక పిల్లవాడికి నేర్పిస్తున్నాడు. అతను చెప్పి, వాయించి చూపిన తరవాత ఇద్దరూ కలిసి వాయించసాగారు. ఇద్దరు చిన్నపిల్లలు కూడా వాళ్లతోపాటు డ్రమ్స్ వాయిస్తున్నారు. ఆ పిల్లలు సరిగా వాయించనప్పటికీ ఎవరూ వారిని వారించలేదు. 'మేం పనిలో ఉన్నాం, కనిపించటం లేదా?' అనిపించేలా కోపంగా కూడా ఎవరూ చూడలేదు. నాలాగే గదిలో మరో ఇద్దరు, ముగ్గురు పిల్లలు కేవలం చూస్తున్నారు. పియానో, గిటార్ లయలోకి వచ్చినప్పుడు నేను కూడా వారితో పాటు ఈల వేయసాగాను.

ఇంకో అమ్మాయి కిటికీ మీద కూర్చుని బయటికి చూస్తూ ఉంది. అక్కడున్న వారి సామర్థ్యం, ఏకాగ్రత స్థాయి భిన్నంగా ఉన్నప్పటికీ వారందరికీ పాల్గొనేందుకు అనుమతి ఉంది. దీని గురించి విద్యావేత్త శ్రీమతి షైలీ బ్రేస్ ఈ విధంగా వివరించారు– "ఏకాగ్రతతో చూడటం ఒక మహత్వ పూర్వమైన ప్రక్రియ. పిల్లలు ఏకాగ్రతను పెంచుకునే అవకాశాలను గౌరవించాలి. ఎవరైనా పిల్లవాడు ఏకాగ్రతతో ఎవరినైనా చూస్తున్నప్పుడు అతని ఏకాగ్రతను భంగపరచకూడదు. అలాగని 'ప్రోత్సహించనూ' రాదు... కొంతమంది పిల్లలు స్వయంగా ఏదైనా చేసేముందు ఇతరులు ఆ పని చేస్తుండగా చూసి తాము ఏం చేయాలని అనుకుంటున్నారో ఆలోచించుకుంటారు." 'న్యూ లిటిల్ స్కూల్'లో అందరికీ ఈ విషయం తెలుసు.

సమావేశం జరిగే స్థలంలో ఎటువంటి ఫర్నిచరూ లేదు. సమావేశం

జరిగేటప్పుడు గదిలో ఒక వైపున గోడకు ఉన్న కుర్చీలలో సభ్యులు కూర్చుంటారు. అవి తప్ప గది ఖాళీగా ఉంటుంది. 14 సంవత్సరాల వయస్సు గల ఒక అమ్మాయి చాలా రోజులుగా గంటల తరబడి ఈ గోడ మీద టెన్నిస్ బాల్‌ను బాట్‌తో కొడుతూ ఉంది. ప్రతిసారీ ఆమె 20-40 సార్లు బంతి కిందపడకుండా కొట్టగలుగుతోంది. 8-12 సంవత్సరాల వయస్సుగల ఆరుగురు అమ్మాయిలు గంట-రెండు గంటలపాటు ఇక్కడ తాడుతో (స్కిప్పింగ్) ఆడుతుండటం ఇంకోసారి చూశాను. ఆట నియమాలను ఎప్పటికప్పుడు మారుస్తూ ఏకాగ్రత, శ్రద్ధలతో ఆ ఆటను వాళ్లు ఆడుతున్నారు.

బడిలో కొత్తగా చేరిన ఒక చిన్న పిల్లవాడు చాలా కోపిష్టి, దౌర్జన్య స్వభావం



కలవాడు. 'తీవ్రవాద బృందం'గా తమను స్వయంగా పిలుచుకునే ఒక బృందంలో అతడు సభ్యుడు. ఒకసారి అతడు కర్రతో అట్ట పెట్టెను కొడుతూ ఆడుకుంటున్నాడు. పది సంవత్సరాల వయస్సు అమ్మాయి కంట్లో వాడు బలంగా కొట్టి తన ఘనకార్యాన్ని చూడకుండానే పారిపోయాడు. నొప్పితో కంటిమీద చెయ్యి పెట్టుకుని ఆ పిల్ల విలవిలలాడుతోంది. పిల్లలు, అధ్యాపకులు కూడా ఈ దృశ్యాన్ని చూశారు. దగ్గరగా ఉన్న వాళ్లు ఆమె క్షేమం గురించి విచారించారు. ఆమెకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఇంతకుమించి ఏమీ జరగలేదు.

అదే వేరేబడిలో ఇటువంటి ఘటన జరిగి ఉంటే ఆ అమ్మాయి గగ్గోలు పెట్టి ఉండేది. ఇతర పిల్లలు కూడా అధ్యాపకులకు ఫిర్యాదు చేసి ఉండేవారు. ఆ పిల్లవాడిని ఈడ్చుకు వచ్చి ఉండేవారు. అతనితో క్షమాపణలు చెప్పించి, శిక్ష కూడా విధించి ఉండేవారు. కానీ ఇక్కడ ఆ అమ్మాయి, పిల్లలు, పెద్దలందరూ ఆ ఆకతాయి పిల్లవాడు ఉద్దేశపూర్వకంగా కొట్టలేదని, జరిగిన దానికి వాడు కూడా స్వయంగా సిగ్గుపడుతూ, భయపడుతున్నప్పుడు మళ్లీ వాడిని శిక్షించి అవమానించవలసిన పనిలేదని భావించారు. వాడు ఎందుకూ పనికి రానివాడని అనిపించేలా ఎందుకు చెయ్యాలి? బహుశా ఇంటి వద్ద జరిగిన ఇటువంటి అనుభవం కారణంగానే అతడు ఇలా ప్రవర్తిస్తున్నాడేమో? శిక్ష పడుతుందని భయపడవలసిన అవసరం లేదని చెప్పటం అతనికి మేలు చేస్తుంది.

ఉపన్యాసాలు, ఉపదేశాలు, శిక్షలు లాంటివేవీ లేకుండా తీవ్ర స్వభావులైన వారు ఈ బడిలో ఈ విధంగా నాగరికులుగా మారుతున్నారు. పిల్లలతో సహనశీలురుగా, క్షమాగుణం కలవారిలా పెద్దవాళ్లు వ్యవహరిస్తూ వారిలో నమ్మకాన్ని ఉంచుతారు. కాలక్రమేణా పిల్లలు కూడా ఒకరిపట్ల ఇంకొకరు ఇలాగే ప్రవర్తిస్తారు. అట్లాగని ఒకరి అన్నం తినడం, లేదా వస్తువులు లాక్కోవడం వంటివి జరిగితే దెబ్బలాడకుండా, కేకలు వేయకుండా ఉంటారని కాదు. ఒకరిపట్ల ఒకరికి కోపం ఉంటుంది. కానీ ఇతర బడుల పిల్లల లాగా ఒకరి గురించి మరొకరు చెడుగా చెప్పుకోరు, అధ్యాపకులకు ఫిర్యాదు చేయరు. కోపాన్ని, ద్వేషాన్ని చాలాసేపు ఉంచుకోరు.

ఈ బడి ఎందుకు విజయవంతం అయింది?

పిల్లలు ఉల్లాసంగా, ఉత్సాహంగా, ప్రసన్నచిత్తులై ఎందుకు ఉంటారు అనే విషయం గురించి కొంత మేరకు పైవివరణ సరిపోతుందేమో. కానీ చదువులో కూడా పిల్లలు రాణించటానికి కారణం ఏమిటి? దీనికి ఒక అధ్యాపకుడు ఇలా బదులిచ్చాడు: "అధ్యాపకులు, పిల్లలు ఎక్కువగా మాట్లాడుతుంటారు. ఒకరు చెప్పిన దాన్ని ఇంకొకరు వింటూ ఉంటారు. దీని అర్థం అధ్యాపకులు మాట్లాడుతుంటే పిల్లలు వింటూ ఉంటారని కాదు. ఇక్కడ లెక్చర్లు (ఉపన్యాసాలు) వంటివేమీ ఉండవు. ఇతర కొత్త బడులలో అధ్యాపకుల లాగా ఒక అంశంపై 'అభిప్రాయం - చర్చ'లు కూడా నిర్వహించరు. ఇక్కడ పిల్లల మధ్య, పిల్లలు-పెద్దల మధ్య మాటలు జరుగుతుంటాయి.

పిల్లలు - పెద్దల మధ్య ఈ మాటలు ఏ విధంగా మొదలవుతాయి? సాధారణంగా ఎవరైనా పిల్లవాడు పెద్ద వాళ్లతో పని చేస్తూండగా సంభాషణ మొదలుపెడతాడు. ఇతరులు కూడా వచ్చి ఇందులో పాల్గొంటారు. చర్చ అటు, ఇటు మళ్లుతుంటుంది. కొంత మంది వెళ్లిపోతే మరి కొంత మంది వచ్చి చేరుతుంటారు. వాళ్లు రెండు - మూడు బృందాలుగా విడిపోవచ్చు. సంభాషణ ఎప్పటికీ పూర్తికాదు. కొంత సేపు నిలిచిపోయినా ఆలోచన కొనసాగుతూనే ఉంటుంది. మళ్లీ ఎప్పుడో తిరిగి మొదలవుతూ ఉంటుంది.

చాలా బడులలో పీరియడ్ల మధ్య కొట్టే గంటలు, పాఠ్యక్రమం మొదలైన వాటి వల్ల పిల్లల ఆలోచనల్లో అంతరాయం ఏర్పడుతుంది. ఇక్కడ అలా కాకుండా పిల్లల ఆలోచనల్లోనూ, పనుల్లోనూ అనుభవం యొక్క నిరంతరత (దీని గురించి డెనిసెన్ 'లైవ్స్ ఆఫ్ చిల్డ్రన్' అనే పుస్తకంలో చర్చించారు) ఉంటుంది. ఒకసారి పెద్ద పిల్లల మాట చిన్న పిల్లలు వింటే, ఒకసారి చిన్న పిల్లల మాట పెద్ద పిల్లలు వింటారు. అధ్యాపకుల సమావేశాల నుండి కూడా పిల్లలను వేరు చేయలేం. వారిని సమావేశంలోకి రమ్మని ప్రోత్సహించరు. ఒకవేళ ఎవరైనా వస్తే అతన్ని వెనక్కు వెళ్లమని ఎవరూ చెప్పరు.

ఈ వివరణను టీచర్ ట్రైనింగ్ కాలేజీని నడిపేందుకు ఉపయోగపడే

విధానంగానో లేక ఫార్ములాగానో భావించకండి. ఇదొక మానవీయ బృందం. దీనిని నిర్వహించడంలో పెద్దల చేయూత, సహకారం ఎంతో ఉంది. రెండు-మూడు విషయాలలో ఇక్కడి అధ్యాపకుల బృందం చాలా అసాధారణమైనది. మొదటి విషయం వీరిలో చదువు చెప్పగలగడమే కాకుండా ఇతర ఎన్నో నైపుణ్యాలు ఉన్నాయి. వీరిలో చాలా మంది అధ్యాపకుల శిక్షణ పొందకముందే, ఎన్నో ఇతర పనులు చేసి, ఎన్నో అనుభవాలు పొంది ఉన్నారు. తమ ఈ అర్హత, అనుభవాలను వాళ్లు బడికి తెస్తారు. వీరు ఎన్నో పనులు, రకరకాల వస్తువులు చేయగలరు. అంతేగాక వస్తువులను బాగు చేయగలుగుతారు కూడా. ఏదో ఒకటి చేస్తూ ఉండటం పిల్లలకి ఇష్టంగా ఉంటుంది. రకరకాల పనులు చేయగలిగిన వారిని వాళ్లు ఇష్టపడతారు, వారివైపు ఆకర్షితులవుతారు. ఈ అర్హత కారణంగా ఇటువంటి అధ్యాపకులను సహజంగా పిల్లలు గౌరవిస్తారు.

కొత్త బడులు అని చెప్పుకుంటున్న వాటిల్లో తరుచుగా అధ్యాపకుల పరిమిత సామర్థ్యాల కారణంగా చాలా సమస్యలు వస్తున్నాయి. యువ అధ్యాపకులు చాలా మంది తాము పిల్లల్ని గౌరవిస్తూ ఉంటామని, వారితో స్వేచ్ఛగా పని చేయటం తమకి ఇష్టమని నాతో చెబుతుంటారు. 'మీరు ఏం చేయగలరు' అని

నేను అడిగినపుడు వారు ఆందోళన చెందుతారు. సాధారణంగా వారికి ఏమీ చేతకాదు. సంవత్సరాల తరబడి విద్యార్థులుగా ఉండటం తప్పించి వాళ్లు ఏమీ చేయలేదు. కాని కేవలం ప్రేమ, సద్భావనలు ఉంటే సరిపోదు. చాలా మంది పిల్లలు చాలాసార్లు ఇసుమంత నైపుణ్యం కోసం అమిత ప్రేమను కూడా వదులుకుంటారు. వీటికి మించి 'న్యూ లిటిల్ స్కూల్' అధ్యాపకులు తెలివైన వాళ్లు, జిజ్ఞాసువులు. వీరికి ప్రపంచం గురించి ఎంతో తెలుసు, దాని గురించి ఆలోచిస్తూ ఉంటారు.

ఒక సర్వే ప్రకారం అమెరికన్ అధ్యాపకులలో చాలా మందికి విషయ పరిజ్ఞానం గానీ, దాన్ని తెలుసుకోవాలనే ఉత్సుకతగానీ లేదని తెలిసింది. చాలా తక్కువ చదువుతారు. 'రీడర్స్ డైజెస్ట్' (అమెరికా, ఇతర దేశాల్లో ప్రచురితం అయ్యే సాధారణ పత్రిక) వారికి ఇష్టమైన పత్రిక. చాలా మంది అధ్యాపకులు సంవత్సరంలో ఒక పుస్తకం మాత్రమే చదువుతారు. బాగా చదివేవాళ్లు కూడా కేవలం కాలక్షేపం నవలలు చదువుతారు.

ఆధునిక దేశాల్లోని సగటు వ్యక్తిలాగే వాళ్లకూ ఎక్కువగా ఏమీ తెలియదు. అలాగే వాళ్లు ఎక్కువగా ఏమీ చేయనూ లేరు. ఏదో కొంత తెలిసినప్పటికీ, చేయగలిగినప్పటికీ దాని గురించి బడిలో ఎప్పుడో చర్చించరు, ఉపయోగించరు. ఇటువంటి వాళ్లతో గడపడం ఆరోగ్యవంతులు, ఉత్సాహవంతులు, చలాకీ అయిన పిల్లలు ఇష్టపడతారా?

'న్యూ లిటిల్ స్కూల్' అధ్యాపకులకు తమ దేశమైన డెన్మార్క్ పట్ల ద్వేషం, భయం లేవు. ఇక్కడ నచ్చని విషయాలు ఎన్నో ఉన్నాయి. వాటిని మార్చాలన్న కోరిక వారికి ఉంది. కాని వారికి ఈ దేశమన్నా, అక్కడ నివసించటం అన్నా ఇష్టం. వారికి ప్రపంచం తోటి కూడా ఎటువంటి విరోధం లేదు. ఎన్ని లోపాలు ఉన్నప్పటికీ ఇది సుందర, వైవిధ్య భరిత, మనసును దోచే ప్రదేశం. ఉత్సాహపూరిత, సాహస భరిత, లాభకరమైన ఎన్నో పనులు చేయవచ్చు.

తమ జీవితం గురించి కూడా వీరికి ఆందోళన లేదు. వీరిలో బలం, ఉత్సాహం ఉన్నాయి. జీవితంలో బాల్యం చాలా ఉత్తమమైనదని చెప్పి పిల్లలను చాలా కాలం పాటు బాల్యంలో ఉంచాలని వారికి ఉండదు. పెద్దవారై, బలవంతులై

ప్రపంచాన్ని చూడాలని, ఎంతో చేయాలని పిల్లలు కోరుకుంటారని అధ్యాపకులకు తెలుసు. పిల్లలకు ఇందులో మద్దతు ఇవ్వడానికి అధ్యాపకులు ఉత్సాహంగా ముందుకు వస్తారు.

ప్రత్యామ్నాయ బడులకు సంబంధించి ఎప్పుడూ ఇలా ఉండదు. బడి అధ్యాపకులుగా తమ జీవితం, తమ దేశం, తమ చుట్టుపక్కల ప్రపంచంతో సంబంధంలేని యువతీ యువకులను తీసుకుంటుంటారు. వారి పట్ల నాకు సానుభూతి ఉంది. వారిని అర్థం చేసుకోగలను కాని అలాంటి అధ్యాపకులు పిల్లలకు కావలసినంతగా సహకరించలేరు.

పిల్లలకు ప్రపంచంతో ఏ గొడవా ఉండదు. వారి కోసం ప్రపంచం ఉంది. వాళ్లు ఈ ప్రపంచంలోకి రావాలనుకుంటారు. ప్రపంచం వ్యర్థమని, ఇక్కడ చెయ్యదగ్గ పనిలేదని, దీని నుండి బయటపడి ఎంతో దూరం పారిపోవడం మేలని వినడం పిల్లలకు ఇష్టం ఉండదు.

'న్యూ లిటిల్ స్కూల్' అధ్యాపకులు మంచి వారుగాను, పారదర్శకత కలవారుగా ఉండటం బహుశా అన్నిటికంటే ముఖ్య విషయం అనిపిస్తుంది. అంటే పిల్లలు మాట్లాడాలనుకునే అన్ని విషయాలపై మాట్లాడటానికి వీరు సిద్ధంగా ఉంటారు. తమ ఆలోచనలను వారు, ఉన్నది ఉన్నట్లుగా వ్యక్తపరచడమేగాక తమకు తెలియని విషయాన్ని తెలియదని అంగీకరిస్తారు. చాలామంది

అధ్యాపకులు ఇలా చేయరు.

90 శాతం అమెరికన్ అధ్యాపకులు బడులలో వివాదాస్పద విషయాల గురించి మాట్లాడటం ఇష్టపడరనీ, పిల్లలను కూడా ఈ విషయాల గురించి మాట్లాడనివ్వరని ఒక సర్వేలో తేలింది. పిల్లలకు ఈ విషయాల మీద చాలా ఆసక్తి ఉంటుందని అధ్యాపకులకు తెలుసు. అందుకనే సాంప్రదాయక బడులలోని పిల్లలు స్వేచ్ఛగా మాట్లాడలేరు. మాట్లాడినా తమకు నచ్చినట్లుగా, నిజాయితీగా మాట్లాడలేరు.

అంతేగాక శిక్షణ సమయంలోనే అధ్యాపకులకు తమ అజ్ఞానాన్ని, సందిగ్ధతను, సంశయాలను ఎప్పటికీ అంగీకరించ కూడదని బాగా తర్ఫీదు ఇస్తారు. పిల్లలను ఒక హద్దు మించి దగ్గరకు రానివ్వక పోవడం, వ్యక్తిగత జీవితం, భావాల గురించి బహిరంగంగా మాట్లాడకపోవటం లాంటివి అధ్యాపకుల నరనరాన జీర్ణం అయ్యేలా చేస్తారు. కాని ఈ విషయాలలోనే పిల్లలకు జిజ్ఞాస ఉంటుంది. పెద్దవాళ్లు అవ్వటం అంటే ఏమిటనేది దీని ద్వారా అనుభవంలోకి వస్తుంది.

'న్యూ లిటిల్ స్కూల్' పిల్లలు కొంతకాలం తరవాత సాధారణ బడులలో చేరి బాగా వృద్ధిలోకి వచ్చారు. దానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. లోకం గురించి వాళ్లలో కుతూహలం ఏర్పడుతుంది. దాన్ని గురించి తెలుసుకునే నేర్పు, విశ్వాసం వారిలో ఉంటాయి. సంవత్సరాల తరబడి రోజుకు ఎన్నో గంటలు చురుకుగా, గంభీరంగా మాట్లాడటమేగాక ఇతరుల మాటలు వింటూ భాషాపరమైన ప్రయోగంలో సామర్థ్యం సంపాదించుకుంటారు. ప్రారంభిక సంవత్సరాలలో బడి వహించే ప్రధాన భూమిక ఇదే. అప్పటి వరకు బడిలో, బయట ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్న ఈ పిల్లలు సాధారణ బడులలో పరిమితంగా ఉన్న సవాళ్లను చాలా సునాయాసంగా పరిష్కరించుకోగలుగుతారు.

చెవులను చురుకుగా ఉపయోగించే పిల్లలు సాంప్రదాయక బడుల అధ్యాపకులు ఏమి ఆశిస్తున్నారో ఇట్టే అర్థం చేసుకోగలుగుతారు. అదే బడిలో మొదటి నుంచి చదివిన పిల్లల కంటే వీళ్లకు ఎన్నో రెట్లు ఎక్కువ విషయాలు తెలుసు కాబట్టి వాళ్లకంటే వీళ్లు ముందుంటారు.

ఇన్నేళ్లు యధేచ్ఛగా వ్యవహరించిన పిల్లలు ఈ సాధారణ బడులను ఎలా భరించగలరనే ప్రశ్న ఎదురవుతుంది. వీళ్లు బడులను అసహ్యించుకోరా? వాస్తవానికి వాళ్లు ఆ బడులను ఏ మాత్రం ఇష్టపడరు. ఇవి తమకు సరిజోడుకావని తెలుసు. కాని ఈ పిల్లలు చాలా చతురులు, యథార్థవాదులు. ప్రపంచంలో ఏం కావాలన్నా, ఏం చేయాలన్నా కాలేజీలు, విశ్వవిద్యాలయాలు ఒక్కటే మార్గమని వాళ్లకి బాగా తెలుసు. ఈ మార్గంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోడానికి వారు సిద్ధంగానే ఉంటారు. బడి నుండి తమకు ఉపయోగపడే జ్ఞానాన్ని పొందడంలో ఇతర పిల్లల కంటే వీరు చాలా సమర్థులు.

'న్యూ లిటిల్ స్కూల్' గురించి తెలుసుకోవడం ఎంత బాగుందనుకున్నా అది కూడా ఒక బడేనన్న విషయం మరిచిపోకూడదు. దీని పద్ధతులను విదేశాల మాట అటుంచి డెన్మార్క్ లోని చాలా తక్కువ బడులు అనుసరించాయనేది వాస్తవం. ఇందుకు ఇది ఒక ప్రైవేటు బడి కావడం ఒక కారణం అయితే, డేనిష్ ప్రభుత్వ పాలనా వ్యవస్థలో భాగంగా ఇటువంటి బడి ఏర్పాటు చేయాలని లేకపోవడం రెండవ కారణం. అయినప్పటికీ చాలా వరకు దీనికి అయ్యే ఖర్చులు ప్రభుత్వం ఇస్తుంది. ఒక నిర్ధిత సంఖ్యలో తల్లిదండ్రులు బడి ఏర్పాటు చేసి ఒక సంవత్సరం పాటు స్వయంగా నడిపినట్లయితే ఆ తరవాత కాలం నుండి ప్రభుత్వమే స్వయంగా 85 శాతం వరకు నిధులు భరించే ఒక చట్టం డెన్మార్క్‌లో ఉంది. మిగిలిన 15శాతం ఖర్చు స్వయంగా తల్లిదండ్రులే భరించాల్సి ఉంటుంది. ఇది కష్టమైన విషయమే. ఈ దేశంలోని ప్రజల్లో చాలామంది అతి పేదలు కానట్లే, అతి ధనవంతులు కూడా కారు.

పిల్లల చదువుకు డబ్బు ఖర్చు పెట్టే సాంప్రదాయం ఇక్కడ లేదు. ఈ చట్టంలో భాగంగా 'లిటిల్ స్కూల్' అన్న పేరుతో 40 చిన్న స్వతంత్ర బడులు తెరిచారు. ఇటువంటి చట్టం ఇతర ఏ దేశంలోనూ లేదు. ప్రభుత్వ సహకారం లేకుండా 'న్యూ లిటిల్ స్కూల్' అస్తిత్వం ప్రస్తుత రూపంలో కొనసాగేది కాదు. ఇక్కడి పిల్లల తల్లిదండ్రుల కంటే ఎన్నో రెట్లు ధనవంతులైన వారి సహకారం, ఆమోదాలపై ఈ బడి ఆధారపడక తప్పదు. తాము అభివృద్ధి చెందడం కంటే ఇతరులకు సహాయ, సహకారాలు అందించటంలో నమ్మకం, విశ్వాసం ఉన్న బడికి సహాయం చేయాలని ఏ దేశంలోనైనా ధనవంతులు అనుకోరు.

బడికి ఎప్పుడు వెళ్లాలి, ఎంత సమయం గడపాలి అన్న విషయం పిల్లలు, వాళ్ల తల్లిదండ్రులే నిర్ణయించటం వల్ల ఈ పరిస్థితిలో బడి నడవగలుగుతోంది. ఈ జిల్లా బడుల తనిఖీ అధికారి ఈ బడికి సంబంధించి సహకారం అందించాడు. కనీసం వ్యతిరేక చర్యలు తీసుకోడు. ఒకవేళ ఇదే బడి దేశంలో మరే ప్రాంతం లోనైనా ఉండి, వేరే తనిఖీ అధికారి ఉన్నట్లయితే దీనికి ఇంత అదృష్టం ఉండేది కాదు. అంతే కాదు, చాలా విషయాల్లో చట్టం ప్రకారం నడుచుకోవలసి వచ్చేది.

ఎటువంటి కోరిక, ప్రయత్నం లేకుండానే ఇది విజేతల, సఫలీకృతుల

పాఠశాలగా ఎదిగిందని చెప్పవచ్చు. పైచదువులలో ఇక్కడి విద్యార్థులలో ఎక్కువ మంది కాక కొద్దిపాటి మంది పిల్లలే ప్రతిభ కనబరచి ఉన్నట్లయితే చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఇక్కడికి పంపించి ఉండేవారు కాదు. తాము ఎంచుకున్న మార్గం సరైనదన్న ఆత్మ విశ్వాసం చాలా మంది అధ్యాపకులలో ఇప్పుడు ఏర్పడింది కాని అప్పుడు సందేహంలో పడి ఉండేవారు.

పిల్లలు, పెద్దలు కలిసి ఉండి, పని చేసే కొన్ని మార్గాలను తెలియ చేయాలనే ఉద్దేశంతోనే నేను 'న్యూ లిటిల్ స్కూల్' గురించి చెప్పాను. ఒకరితో మరొకరు మాట్లాడగలగాలి, నేర్చుకోగలగాలి. లంచాలు, భయాలు లాంటివి లేని బడి ఉండాలి – సంక్షిప్తంగా చెప్పాలంటే 'బడి లేని' సమాజం ఉండాలి. మన బడులు అన్నింటినీ 'న్యూ లిటిల్ స్కూల్' లాగా మార్చాటానికి అనుమతిస్తే ఆ సమాజానికి అసలు బడుల అవసరమే ఉండదు, బడులు లేకుండానే పని జరుపుకోగలదు. 'న్యూ లిటిల్ స్కూల్' తరహాలో బడులు ఉన్న సమాజం పిల్లలు ఉండటానికి, పెరగడానికి చాలా మంచి, అందమైన ప్రదేశం. అయినప్పటికీ నేను ఆదర్శంగా భావించే దానికంటే ఇది ఎంతో దూరంలో ఉంది.

'న్యూ లిటిల్ స్కూల్' అందుబాటులో లేని ప్రాంతంలో, దూరంగా ఉంది. పిల్లల కోసమే ఏర్పాటు చేసిన ఈ ప్రదేశంలో తమ పూర్తి సమయాన్ని పిల్లలు గడపడం నాకు నచ్చదు... పిల్లలు తమ సమయాన్ని తమతో ఉండేలా శిక్షితులైన వారితో గడపటం కూడా నాకు ఇష్టం ఉండదు. ఈ ప్రదేశం, ఈ మనుషులు ఎంత మంచివైనప్పటికీ పిల్లలకు దీని కన్నా ఎంతో మెరుగైన, స్పష్టమైన, వారికి అందుబాటులో ఉండే ఒక సమాజం అవసరం. ఇందులో దాపరికం లేని, వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి పౌరుడు చురుకైన, గంభీరమైన, బాధ్యతాయుతమైన పాత్రను నిర్వర్తించగలగడానికి హక్కుదారునిగా ఉండే వీలు ఉండాలి. ఇటువంటి సమాజ నిర్మాణం కోసం బడుల స్వరూపం మార్చడమే కాకుండా ఇంకా ఎంతో చేయవలసిన అవసరం ఉంది.

చదువులు - కొత్తదారులు

నేర్చుకోవడం జీవితం నుంచి వేరైన నాటి నుంచి 'చదువు' మొదలయ్యింది. ఉన్న వారికీ, లేనివారికీ మధ్య ఈ చదువు వివక్షత చూపుతూ ఉన్న వారిని అందలం ఎక్కిస్తూనే, ఇంకోవైపు చింతబెత్తాం, బట్టీ పట్టడం, మూసపోత మూక ఆలోచన విధానాన్ని ప్రోత్సహిస్తూ వస్తోంది. చదువును ఆసక్తికరంగా, సృజనాత్మకంగా, ఆనందదాయకంగా, జీవితంతో సంబంధం గలదిగా మలచటానికి సమాంతరంగా అనేక ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ విషయంలో మన దేశంలో ఠాగూర్, గాంధీ, గిజుభాయి ఆలోచనలు ఎందరికో ప్రేరణగా నిలిచాయి. ఇటువంటి తత్వవేత్తలు, విద్యావేత్తల గురించి, చదువులలో ప్రయోగాల గురించి అయిదు పుస్తకాలను కూర్చి 'చదువులు - కొత్తదారులు' పేరుతో ఒకే పుస్తకంగా జనవిజ్ఞాన వేదిక, మంచి పుస్తకం కలిసి ప్రచురించటం సంతోషం. అన్ని వేళలా, అన్ని సందర్భాలలో పిల్లల పక్షాన ఉండటమే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చేయవలసిన పని అని ఈ పుస్తకాలు చెబుతాయి. ఇంకెందరో విద్యావేత్తలూ, వారి ప్రయోగాలూ ఇందులో చోటు చేసుకోక పోయినప్పటికీ ఈ ప్రయత్నం చదువుతో ముడిపడిన వారందరికీ - విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పిల్లల బాగుకోరే వారందరికీ ఉపయోగకరంగా ఉంటుందనీ, ఆలోచనలకు ఊతం అవుతుందనీ ఆశిస్తున్నాం.

₹80/-

ISBN : 978-93-90131-90-7

విజ్ఞాన ప్రచురణలు

మంచి పుస్తకం